శుక్రవారం
23•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 257
• పేజీలు : 16 + (24/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

ముంచింది 10 లక్షల కోట్లు!



ఎగవేతదారుల కుచ్చుటోపీ విలువ

దేశ వార్షిక బడ్జెట్‌లో సగం

బందిపోట్లను మించిన బ్యాంకుదొంగలు

జనం సొమ్ముతో జల్సాలు

'వడ్డీ ఎంతైతేముంది.. అసలు కట్టినప్పుడు కదా'.. అప్పు తీసుకొనేముందు ఓ బడా వ్యాపారి తన అసిస్టెంట్‌తో అన్న డైలాగ్ ఇది. ఎప్పుడో 1950లలో తెలుగులో వచ్చిన ఓ సినిమాలో అప్పు గురించి చేసిన వ్యాఖ్య. ఇప్పుడు దేశంలో గొప్ప గొప్ప వ్యాపారులుగా ప్రముఖులైన వాళ్లలో అత్యధికులు ఈ సూత్రాన్ని బాగా వంటబట్టించుకొన్నారు. కోట్లకు కోట్లు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవడం.. రంగుటద్దాల్లో వ్యాపారాభివృద్ధిని చూపించడం.. పొరపాటున అప్పిచ్చిన బ్యాంకు చెల్లింపు నోటీసు ఇచ్చేసరికి ఏ లండన్‌కో.. ఆస్ట్రేలియాకో చెక్కేయడం.. ఇదీ ఇవాళ పరిస్థితి. ఒక మధ్యతరగతి వ్యక్తి ఓ ఇల్లు కట్టుకోవడానికి రుణమడిగితే.. భూతద్దాలు పెట్టుకొని మరీ తప్పులు వెతుకుతూ.. నెలలపాటు తిప్పుకొనే బ్యాంకు అధికారులకు మాల్యాలు.. మోదీలు, కొఠారీలకు అప్పులివ్వడంలో ఎలాంటి లొసుగులు కనిపించవు.. నిబంధనలు వర్తించవు. మామూలు వ్యక్తి ఒక నెల డిఫాల్ట్ అయితే.. ఎస్సెమ్మెస్, మెయిల్, ఫోన్ సందేశాలు ఠంచన్‌గా వచ్చేస్తాయి. అవసరమైతే ఎగ్జిక్యూటివ్‌లు వచ్చి మరీ డబ్బులు వసూలు చేసుకొని పోతారు. కానీ వేల కోట్ల అప్పు తీసుకొన్న వాడివైపు కన్నెత్తిచూసే సాహసం బ్యాంకులు చెయ్యవు. ఎవరో ఒకరి పేరు మీడియాలో హల్‌చల్ అయితే.. అప్పుడు తీరిగ్గా కేసులు, దాడులు, సోదాలు.. ఇవి బ్యాంకులు కామన్‌గా చేసే తంతు. ఇండ్లల్లో మామూలు కన్నమేసే దొంగలను మించిన బందిపోట్లు వీళ్లు. దేశం మొత్తంమీద అన్ని బ్యాంకుల్లో వీళ్లు కుచ్చుటోపీ పెట్టిన మొత్తం ఎంతో తెలుసా? అక్షరాలా పది లక్షల కోట్ల రూపాయలు. అంటే భారత దేశ సాధారణ వార్షిక బడ్జెట్‌లో సగమన్నమాట. ఇదంతా ప్రజలది. అంటే మనందరిది. మన సొమ్మును బ్యాంకుల నుంచి దర్జాగా దోచుకొనిపోయినవాళ్లు జల్సా చేస్తున్నారు. కోట్లకు కోట్లు దోచిపెట్టిన బ్యాంకులు ఇందులో తమ వంతు బాధ్యతను పక్కనపెట్టి.. ఓ కేసు వేసి చేతులు దులిపేసుకొంటున్నాయి. కామన్ మ్యాన్ మాత్రం అప్పులతిప్పలు పడుతూనే ఉన్నాడు. బ్యాంకుల నోటీసులకు జడుసుకుంటూనే ఉన్నాడు.

› వివరాలు 3వ పేజీలో

2630 రైతు వేదికలు

- రైతు వేదికల నిర్మాణ బాధ్యతలు మండల సమితులకు
- రైతు అవగాహన సదస్సులు, చర్చలు వీటిలోనే నిర్వహణ
- సమితుల్లో 51% బలహీనవర్గాలు, మహిళలు
- ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు
- ప్రాంతీయ రైతుసదస్సులు, సమితుల నిర్మాణం, విధులపై ప్రగతిభవన్‌లో సమీక్ష
- రాష్ట్ర సమన్వయ సమితిలో గరిష్ఠంగా 15 మంది రైతు ప్రతినిధులు
- చైర్మన్‌గా వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి



200 కోట్ల మూలధనంతో
రాష్ట్ర రైతు సమన్వయ సమితి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో 2,630 రైతు వేదికలను నిర్మించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. రైతులకు నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహించడానికి, వారు చర్చించుకుని అభిప్రాయాలను పంచుకోవడం కోసం ఈ వేదికలను వినియోగించాలని పేర్కొన్నారు. ప్రతి 5 వేల ఎకరాలకు ఒకటి చొప్పున రైతు వేదికలను వీలైనంత త్వరగా నిర్మించాలని ఆయన నిర్దేశించారు. రైతు ప్రయోజనాల కోసం రాష్ట్రవ్యాప్తంగా రైతు సమన్వయసమితులను ఏర్పాటుచేయాలని సంచలన నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్ రూ.200 కోట్ల మూలధనంతో రాష్ట్ర రైతు కార్పొరేషన్‌ను ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. ఆ వెంటనే జీవో కూడా వెలువడింది. అదేవిధంగా రాష్ట్రంలోని 30 జిల్లాల్లో రైతు సమన్వయ సమితులు ఏర్పాటుచేయాలని ప్రత్యేకంగా ఉత్తర్వులు విడుదలయ్యాయి. రైతు సమన్వయ సమితుల నిర్మాణం, విధులు, బాధ్యతలు, ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న ప్రాంతీయసదస్సుల గురించి గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్షించారు. రైతు వేదికల నిర్మాణానికి కావాల్సిన స్థలాలను జిల్లా కలెక్టర్లు ఎంపిక చేయాలని, ప్రభుత్వ భూముల నుంచి లేదా కొనుగోలు చేసి సేకరించాలని ఆదేశించారు. వేదికల నిర్మాణ బాధ్యతలను మండల రైతు సమన్వయ సమితులు తీసుకోవాలని సూచించారు. రూ.200 కోట్ల మూలధనంతో తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయసమితి పేరిట ఏర్పాటుచేసే కొత్త కార్పొరేషన్ వ్యవసాయాభివృద్ధికి, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను

› మిగతా 2వ పేజీలో



గురువారం జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీలో జీహెచ్‌ఎంసీ లిస్టింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎస్ ఎస్కే జోషి, నగర మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు. చిత్రంలో డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ బీ జనార్దన్‌రెడ్డి తదితరులు

బీఎస్‌ఈలో జీహెచ్‌ఎంసీ లిస్టింగ్

బాండ్లద్వారా నిధులు సమీకరించిన రెండో కార్పొరేషన్‌గా ఖ్యాతి

12

అట్టహాసంగా ప్రారంభ కార్యక్రమం • జీహెచ్‌ఎంసీకి డబుల్ ఏ రేటింగ్

ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ద్వారా రూ. 200 కోట్ల సేకరణ

లైఫ్‌సైన్సెస్ లీడర్ తెలంగాణ

రాబోయే పదేండ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు లక్ష్యం

నాలుగు లక్షల మందికి ఉపాధి



మంత్రి కేటీఆర్ సమక్షంలో మలేషియాలోని సిలోంగర్ రాష్ట్రంతో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం. చిత్రంలో ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి కూడా ఉన్నారు.

- ప్రపంచానికే బెంచ్‌మార్క్‌గా ఫార్మాసిటీ
- ఏషియా లైఫ్‌సైన్సెస్ విభాగంలో అతిపెద్ద క్లస్టర్ జీనోమ్‌వ్యాలీ
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్
- బయోఏషియా సదస్సు, ప్రదర్శన ప్రారంభం
- 52 దేశాల నుంచి 1600 మంది హాజరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రం లైఫ్‌సైన్సెస్, ఐటీరంగాల్లో దేశంలోనే కాకుండా ప్రపంచంలోనూ లీడర్‌గా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. రాబోయే పది సంవత్సరాల్లో లైఫ్‌సైన్సెస్ రంగం ద్వారా 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ.6.5 లక్షల కోట్లు) పెట్టుబడులు రాబట్టుకోవడం, వీటిద్వారా నాలుగులక్షల మందికి ఉపాధి కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నాలుగు లక్షల ఉద్యోగాల్లో అత్యధికం తయారీరంగంలోనే రానున్నాయని

› మిగతా 2వ పేజీలో

కేటీఆర్ కృషివల్లే

వరల్డ్ ఐటీ కాంగ్రెస్ విజయవంతంపై దేవ్యానిఘోష్ ప్రశంస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వరల్డ్ ఐటీ కాంగ్రెస్, నాస్కాం ఇండియా లీడర్‌షిప్ ఫోరం సదస్సులను ఏకకాలంలో విజయవంతంగా నిర్వహించారని మంత్రి కేటీఆర్‌ను నాస్కాం కాబోయే అధ్యక్షురాలు దేవ్యాని ఘోష్ ప్రశంసించారు. మంత్రి కేటీఆర్, ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ సారథ్యంలోని బృం దం కలిసికట్టుగా పనిచేసి సదస్సులను విజయవంతం చేశారని ట్విట్టర్‌లో అభినందించారు. నాస్కాం బాధ్యు లు, వారి బృందం కృషితో సదస్సులు విజయవంతం అయ్యాయని మంత్రి కేటీఆర్ రీట్వీట్ చేశారు. తెలంగాణకు ఇదే తరహాలో సహాయ సహకారాలు అందించాలని కోరారు.



సీఎంను పరామర్శించిన గవర్నర్ దంపతులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ దంపతులు గురువారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును పరామర్శించారు. సీఎం రెండోసోదరి విమలాబాయి బుధవారం కన్నుమూసిన విషయం తెలిసిందే. సోదరి వియోగంతో బాధపడుతున్న సీఎం కేసీఆర్‌ను నరసింహన్ దంపతులు ఓదార్చారు.



గురువారం ప్రగతిభవన్‌లో తెలంగాణ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్

వచ్చేనెలలో రాష్ట్రంలో విధుశేఖరభారతీ స్వామి పర్యటన

- గద్వాలలో ఘనస్వాగతం పలుకనున్న ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శృంగేరిపీఠం పీఠాధిపతి శ్రీ విధుశేఖరభారతి స్వామి మార్చి మొదటివారంలో తెలంగాణ రాష్ట్రంలో పర్యటించనున్నారు. స్వామి పర్యటన ఖరారవడంతో ఆయనను రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య అతిథిగా తెలంగాణ సర్కార్ ప్రకటించింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు స్వామికి ఘనస్వాగతం పలికేందుకు సన్నాహాలు చేస్తున్నారు. స్వామి గద్వాలకు చేరుకోగానే దేవాదాయశాఖమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, దేవాదాయ కార్యదర్శి శివశంకర్, శృంగేరిపీఠం ఆస్థాన విద్వాంసులు బాచంపల్లి సంతోషకుమారశాస్త్రి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతారు. శ్రీ విధుశేఖరభారతి స్వామి పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ నెల 18న విజయయాత్రను ప్రారంభించారు. భద్రావతి, దావనగిరి, బళ్లారి, గంగావతి మీదుగా రాష్ట్రంలోని గద్వాలకు చేరుకుంటారు. మార్చి 1న గద్వాలలో, 2న వనపర్తిలో, 3న మహబూబ్‌నగర్‌లో, 4న అచ్చంపేటలో పర్యటిస్తారు. ఏప్రిల్ 10 వరకు ఏపీలో పర్యటించి 11న హైదరాబాద్ చేరుకుంటారు. ఏప్రిల్ 11 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో స్వామి బసచేస్తారు.

2630 రైతు వేదికలు

మొదటిపేజీ తరువాయి...

క్షేత్రస్థాయికి తీసుకుపోవడంలో కృషిచేస్తుందని, లాభాపేక్షలేని సంస్థగా పనిచేస్తుందని అన్నారు. రైతు కార్పొరేషన్‌కు సమకూరిన నిధులను నిర్దేశిత లక్ష్యాల సాధన కోసమే వినియోగించాలని సీఎం స్పష్టంచేశారు. గ్రామ, మండల రైతు సమన్వయసమితుల మాదిరిగానే త్వరలోనే జిల్లా, రాష్ట్రస్థాయి సమన్వయసమితులు ఏర్పాటవుతాయని చెప్పారు. విత్తనం వేసిన దగ్గర నుంచి పంటలకు మద్దతు ధర వచ్చేవరకు ప్రతి దశలోనూ రైతు సమన్వయ సమితులు చురుకైనపాత్ర పోషించేలా వాటికి విధులు, బాధ్యతలు ఉంటాయని సీఎం కేసీఆర్ తెలిపారు. కనీసం 51% బలహీన వర్గాలు, మహిళలు ఉండేలా రైతు సమితుల నిర్మాణం జరుగుతుందన్నారు. 25, 26 తేదీల్లో జరిగే ప్రాంతీయ సదస్సులకు మండలసమితుల సభ్యులతోపాటు ఆయాజిల్లాలకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు కూడా హాజరుకావాలని సీఎం ఆదేశించారు. సమీక్ష సమవేశానికి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, ఈటల రాజేందర్, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, విప్ పల్లారాజేశ్వర్‌రెడ్డి, మిషన్ భగీరథ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు బీ వినోద్‌కుమార్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, బాల్కసుమన్, అడ్వకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి, సీఎంవో ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, వ్యవసాయశాఖ కమిషనర్ జగన్‌మోహన్‌రావు తదితరులు హాజరయ్యారు.

విద్యార్థులను సన్నద్ధం చేయండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ కళాశాలల విద్యార్థులను జాతీయ పోటీపరీక్షలకు సన్నద్ధం చేయాలని ఇంటర్ విద్య కమిషనర్ ఏ అశోక్ అధ్యాపకులను ఆదేశించారు.నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో గురువారం అధ్యాపకులకు ఒక్క రోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అశోక్ హాజరయ్యారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.42 గంటలకు



సూర్యాస్తమయం: 6.17 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణ మాసం, శుక్లపక్షం, సప్తమి తె. 2.31 వరకు, తదుపరి అష్టమి. నక్షత్రం: కృత్తిక మధ్యాహ్నం 12.43 వరకు, తదుపరి రోహిణి. అమృత ఘడియలు: ఉదయం 10.24 నుంచి 12.00 వరకు, అమృత ఘడియలు: రాత్రి 10.12 నుంచి 11.48 వరకు, రాహుకాలం: ఉదయం 11.03 నుంచి 12.29 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.01 నుంచి 9.47 వరకు, తదుపరి మధ్యాహ్నం 12.53 నుంచి 1.39 వరకు, వర్జ్యం: తె. 1.09 నుంచి 2.45 వరకు.

లోకం పోకడ



బ్యాంకు డిఫాల్టర్స్ సార్.. విదేశాలకు చెక్కేయడానికి వాళ్లకు ప్రత్యేక విమానాలు కావాలని డిమాండ్ చేస్తున్నారు!



గురువారం హెచ్‌ఐసీసీలో జరిగిన బయోఏషియా 15వ ఎడిషన్ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కే తారకరామారావు



సదస్సు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన టీఎస్ఐఐసీ స్టాల్‌ను తిలకిస్తున్న మంత్రి కేటీఆర్, అసోం ఐటీమంత్రి



మైఖేల్ ఎన్‌హాల్‌కు జీనోమ్‌వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డు ఇస్తున్న కేటీఆర్

లైఫ్‌సైన్సెస్ లీడర్ తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 800 కంపెనీలు, 50 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఉన్నాయన్నారు. హెచ్‌ఐసీసీలో మూడురోజులపాటు జరిగే 15వ బయోఏషియా సదస్సు ప్రారంభ కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ గురువారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం ఆయన మాటల్లోనే..

'లైఫ్‌సైన్సెస్ ఆవిష్కరణలు, ఉత్పత్తి హబ్‌ల ఏర్పాటులో తెలంగాణ బలోపేతం అవుతున్నది. జాతీయ ఫార్మా ఉత్పత్తిలో మన హైదరాబాద్ ఒక్కటే దాదాపు 35 శాతం వాటా కలిగి ఉన్నది. ప్రపంచానికి, దేశానికి తెలంగాణ రాష్ట్రం వ్యాక్సిన్‌హబ్‌గా పేరుపొందింది. ప్రపంచానికి అవసరమయ్యే వ్యాక్సిన్లలో 33శాతం మనవద్దే ఉత్పత్తి అవుతున్నాయి. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, పుష్కలమైన మానవ వనరులు, ప్రోత్సాహక ప్రభుత్వం వంటి అంశాల వల్ల జాతీయ, అంతర్జాతీయ ప్రముఖ లైఫ్‌సైన్సెస్ సంస్థలు తెలంగాణ వైపు దృష్టి సారిస్తున్నాయి. జినోమ్‌వ్యాలీ, ఫార్మాసిటీ, మెడికల్ డివైజెస్ పార్క్ వంటివి ప్రపంచ లైఫ్‌సైన్సెస్ సంస్థలను హైదరాబాద్‌వైపు ఆకర్షిస్తున్నాయి. ప్రపంచస్థాయి ఫార్మా సంస్థలను విశేషంగా ఆకట్టుకోవడానికి బయోఏషియా సదస్సు తోడ్పడుతుందని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను. 14వ బయోఏషియా సమ్మిట్‌లో ఇచ్చిన వాగ్దానం మేరకు జీనోమ్‌వ్యాలీకి ఐలా (ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ) స్టేటస్‌ను మంజూరు చేశామని సహర్షంగా ప్రకటిస్తున్నాను. దీనివల్ల జీనోమ్‌వ్యాలీలో ఎలాంటి అనుమతులైనా సులువుగా లభిస్తాయి. కొత్తతరహా అభ్యుద్ధికి ఐలా సరికొత్త మార్గదర్శిగా నిలబడుతుందని విశ్వసిస్తున్నాను. తెలంగాణ ప్రభుత్వం సులభ వాణిజ్య విధానం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పట్ల అంకితభావంతో ఉన్నదని చెప్పడానికి ఐలాల ఏర్పాటు నిర్ణయమే ప్రత్యక్ష ఉదాహరణ అని చెప్పొచ్చు. ఏషియా లైఫ్‌సైన్సెస్ విభాగంలోని జీనోమ్‌వ్యాలీ అతిపెద్ద క్లస్టర్ అని మీ అందరికీ తెలిసిందే. దీన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నది. 1999లో జినోమ్‌వ్యాలీ క్లస్టర్ ఆరంభం కాగా, ప్రస్తుతం 200 సంస్థలు పదివేల మంది సాంకేతిక నిపుణులు, ఉద్యోగులతో అది కళకళలాడుతున్నది. నోవార్టిస్, జీఎస్‌కే, సనోఫీ, ఫెర్రింగ్ ఫార్మా, కెమో, డూపాంట్, యాష్‌లాండ్, యునైటెడ్ స్టేట్స్ ఫార్మాకోపియా, లాన్‌జా వంటి ప్రపంచ ఫార్మా దిగ్గజాలే కాకుండా భారతదేశానికి చెందిన పలు పేరెన్నికగల ఫార్మా సంస్థలు జినోమ్‌వ్యాలీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య అవసరాలను తీర్చడానికి అవసరమయ్యే ఉత్పత్తులు తెలంగాణలో తయారు అవుతుండడంపై ఇక్కడి ప్రజలు ఎంతో గర్వపడుతున్నారు. ఈ ఏడాది స్లేబ్యాక్ ఫార్మా, కెమో వంటి సంస్థలు జినోమ్‌వ్యాలీలో కార్యకలాపాలు ప్రారంభించడాన్ని మేం స్వాగతిస్తున్నాం. నోవార్టిస్, జీఎస్‌కే, బయోలజికల్ ఈ, అలెంబిక్ వంటివి జీనోమ్‌వ్యాలీలో అధ్యయనం, ఉత్పత్తి కార్యకలాపాలను ప్రారంభించినందుకు అభినందిస్తున్నాను. కేంద్ర ప్రభుత్వంతో కలిసి దేశంలోని అతిపెద్ద యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ప్రారంభించడానికి ప్రయత్నిస్తున్నాం. దీనివల్ల లైఫ్‌సైన్సెస్ కంపెనీలకు ఉపయోగకరంగా ఉండడమే కాకుండా కొత్త మందులను తయారు చేసే సమయం గణనీయంగా తగ్గుతుంది. జీనోమ్ వ్యాలీ క్లస్టర్‌ను విస్తరిస్తున్నాం. ఇందుకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ మాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన చేస్తాం. తద్వారా జీనోమ్‌వ్యాలీ-2 తక్షణమే ప్రారంభించే ప్రయత్నం మొదలుపెట్టాం. ఆరోగ్య పరిరక్షణలో అనేక విజయాలు సాధించడానికి ఇది దోహదం చేస్తుంది. గౌరవనీయులైన ముఖ్యమంత్రి ఈ రంగంలో స్టార్టప్‌లను అభివృద్ధిపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నారు. ఫలితంగా నిరుపేదలకు ఎంతో లబ్ధి కలుగుతున్నది. గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రం చవకగా వ్యాక్సిన్లను తయారు చేసి ప్రపంచానికి సరఫరా చేస్తున్నది. భారత్ బయోటెక్, బయోలాజికల్ ఈ, శాంతాబయోటెక్ వంటి సంస్థలు ఈ రంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించాయి. ఆరోగ్య పరిరక్షణపై అత్యధిక ప్రభావం చూపాయి. ఇకనుంచి తెలంగాణ రాష్ట్రం ఏటా ప్రతి కంపెనీ ఒక కొత్త వ్యాక్సిన్ ఉత్పత్తిని ప్రారంభించాలని భావిస్తున్నది. ఇందు కోసం లైఫ్‌సైన్స్ విభాగంలోనే ప్రప్రథమంగా వ్యాక్సిన్ అభివృద్ధికి సాయంచేసే ఇంక్యుబేటర్‌ను ప్రారంభిస్తున్నాం. అధికశాతం సంస్థలు, సొంతంగా ఉత్పత్తి సదుపాయాలను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అధ్యయన కేంద్రాలు, ప్రముఖ కళాశాలల్లో ఇంక్యుబేషన్ సెంటర్లను ఆరంభించాలన్న ఆలోచన మాకుంది. ఈ రంగానికి సంబంధించి ముఖ్యమంత్రి మాకు ప్రతిష్ఠాత్మకమైన లక్ష్యాలను నిర్దేశించారు. గతేడాది నేను ఇదే వేదికపై ఈ రంగానికి సబంధించి మా లక్ష్యాలను వివరించాను. భారత్, అందులో తెలంగాణ ఐటీ, ఫార్మా రంగాల్లో ప్రపంచస్థాయి గుర్తింపు కల్గి ఉన్నాయి. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న ఫార్మా సిటీకి పర్యావరణ అనుమతులు తుదిదశకు చేరుకున్నాయి. దీనికి కేంద్ర ప్రభుత్వం కూడా సహకారాన్ని అందిస్తున్నది. 19వేల ఎకరాలతో ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మాసిటీగా ఇది అవతరిస్తుంది. ప్రపంచంలో బెంచ్‌మార్క్‌గా ఈ ఫార్మా సిటీ నిలవబోతుంది. పర్యావరణానికి ఎలాంటి హాని లేకుండా ఏర్పాటు చేసే ఫార్మా క్లస్టర్ ఇదే. రాష్ట్రంలో ఏర్పాటయ్యే పరిశ్రమలకు నైపుణ్యం ఉన్న విద్యార్థులను తయారు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం టాస్క్ సంస్థను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నది. ఇమ్యునోథెరపి, వ్యక్తిగత మెడిసిన్, నానో మెడిసన్ లాంటి కోర్సులను ప్రారంభించడానికి స్థానికంగా ఉన్న విద్యాసంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నాం. లైఫ్‌సైన్సెస్ రంగంలో రాబోయే రెండుమూడు సంవత్సరాల్లో రూ.3 వేల కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం మెడికల్ డివైజెస్‌లో 70 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా రాష్ట్రంలో చేపట్టిన మెడికల్ డివైజెస్ పార్కు దేశంలోనే అతిపెద్దది. ఇక్కడ దేశీఆ, అంతర్జాతీయ కంపెనీలు పెట్టుబడులు పెట్టవచ్చన్నారు. ఫార్మా, బయోటెక్, మెడికల్ డివైజెస్ కంపెనీల మధ్య సమన్వయానికి కృషి చేస్తున్నాం'.



గురువారం హెచ్‌ఐసీసీలో బయోఏషియా 15వ ఎడిషన్ సదస్సుకు హాజరైన ప్రతినిధులతో మంత్రి కేటీఆర్, పరిశ్రమలశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్

ప్రపంచ మార్పులు తెలుసుకొనేందుకు

ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ, దేశంలో ముఖ్యమైన మూడు స్టార్టప్ ఇంక్యుబేటర్లు ఉన్నాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా బయోటెక్నాలజీ రంగంలో వచ్చిన, వస్తున్న మార్పులు తెలుసుకోవడానికి ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోపడుతాయని తెలిపారు. ఐర్లాండ్ ఈ సదస్సుకు భాగస్వామ్య దేశంగా ఉండటం ఎంతో ఉపయోగకరమని అన్నారు. రాష్ట్ర లైఫ్ సైన్సెస్ సలహామండలి చైర్మన్ డీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, 14 సంవత్సరాల క్రితం ప్రారంభమైన బయోఏషియా ప్రస్తుతం టీనేజ్‌లోకి చేరుకుందని, ఈ సమయంలో తదేకంగా దృష్టి పెట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో త్వరలోనే ఫార్మాసిటీ, జినోమ్ వ్యాలీ, మెడికల్ డివైజెస్ పార్కు ఏర్పాటు కానున్నట్లు చెప్పారు.

అవార్డు ప్రదానం

బయోఏషియా సదస్సు సందర్భంగా అందించే ప్రతిష్ఠాత్మక జీనోమ్ వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డును స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మిచెల్ ఎన్ హాల్‌కు మంత్రి కేటీఆర్ అందచేశారు. ఈ సందర్భంగా హాల్ మాట్లాడుతూ ఈ అవార్డును అందుకోవడం గర్వంగా భావిస్తున్నానని అన్నారు. లైఫ్ సైన్సెస్ ద్వారా మానవ జీవితంలో మార్పు తీసుకరావాలనేదే లక్ష్యమన్నారు.

నేడు సీఈవో కాంక్లేవ్

బయోఏషియా రెండోరోజు సదస్సులో భాగంగా శుక్రవారం సాయంత్రం సీఈవో కాంక్లేవ్ సెషన్ జరుగుతుంది. ఈ సదస్సులో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్ ప్రభు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు పాల్గొంటారు. ప్యానెలిస్టులుగా బయోకాన్ సంస్థ సీఎండీ కిరణ్ మజుందార్‌షా, నోవార్టిస్ ఇండియా అధ్యక్షుడు జావేద్ జియా, రెడ్డి ల్యాబ్స్ చైర్మన్ సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు. ఉదయం సెషన్స్‌లో నోవార్టిస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ శ్రీరాం ఆరాధ్యే, జినోమ్‌వ్యాలీ అవార్డు గ్రహిత మైకెల్ హాల్, జర్మనీ మెర్క్ కంపెనీ లైఫ్‌సైన్సెస్ సీఈవో ఉదిత్ బాత్రా ప్రసంగిస్తారు.

మలేసియా రాష్ట్రంతో తెలంగాణ ఒప్పందం

మలేషియా దేశంలోని సిలోంగర్ రాష్ట్రం, తెలంగాణ రాష్ట్రం బయోటెక్నాలజీ రంగంలో పరస్పర సహకారం అందించుకోవడానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. సిలోంగర్ రాష్ట్రానికి చెందిన సెంట్రల్ స్పెక్ట్రమ్ సీఈవో డాటో మహమూద్ అబ్బాస్, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి సంతకాలు చేశారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో వీరు పత్రాలను మార్చుకున్నారు. సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ కంపెనీల ఎగ్జిబిషన్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సదస్సుకు ప్రపంచంలోని 52 దేశాల నుంచి 1600 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అసోం, గుజరాత్ రాష్ట్రాలు భాగస్వామ్య రాష్ట్రాలుగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎనర్జీ, గ్రోత్ మార్కెట్స్ హెడ్ ఆండ్రూ వగ్లూర్, నోవార్టిస్ హైదరాబాద్ హెడ్ నవీన్ గుల్లపల్లి, భారత్ బయోటెక్ సీఎండీ కృష్ణా యెల్లా, బయలాజికల్-ఈ ఎండీ మహిమా దాట్ల, అరబిందో ఫార్మా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, శాంతా బయోటెక్ సీవోవో మహేశ్ బీ, మలేషియా ఇన్వెస్ట్ సిలోంగర్ సీఈవో దాతోహసన్ హజారీ ఇద్రిస్, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, డీఆర్ఎల్ డైరెక్టర్ విశ్వనాథ్, ఫాబా అధ్యక్షుడు మలోబీ, తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

మాంసం పరిశ్రమకు మహర్దశ

- మాంస పరిశ్రమలో కీలకపాత్ర పోషిస్తున్న ఆవిష్కరణలు
- ఐసీఏఆర్-ఎన్ఆర్‌సీఎంతో ఎస్వీ వర్సిటీ ఒప్పందం
- జిల్లాలో స్లాటర్ హౌస్‌ల ఏర్పాటు
- జాతీయ మాంస పరిశోధనా కేంద్రం 11వ వార్షికోత్సవంలో పౌల్ట్రీ రీసెర్చ్ డైరెక్టర్ చటర్జీ

హైదరాబాద్/బోడుప్పల్, నమస్తే తెలంగాణ: పౌల్ట్రీహబ్‌గా ప్రసిద్ధిగాంచిన తెలంగాణ రాష్ట్రంలో మాంస పరిశ్రమ అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని పౌల్ట్రీ పరిశోధన కేంద్రం సంచాలకుడు డాక్టర్ ఆర్ఎన్ చటర్జీ తెలిపారు. దేశవ్యాప్తంగా అత్యధికంగా తెలంగాణలో 98.2 శాతం మంది ప్రజలు మాంసాన్ని ఆరగిస్తారని, తదనుగుణంగా కేంద్రప్రభుత్వం జాతీయ మాంస పరిశోధన కేంద్రాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పిందని చెప్పారు. మాంసం పరిశ్రమపై శాస్త్రవేత్తలు పరిశోధన చేసి నాణ్యత పెరిగేలా చూడాలని ఆయన కోరారు. బోడుప్పల్ పరిధిలోని చెంగిచర్లలో జాతీయ మాంస పరిశోధనా కేంద్రం (ఎన్ఆర్‌సీఎం) 11వ వ్యవస్థాపక వేడుకలు గురువారం జరిగాయి. సదస్సును చటర్జీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వివిధదేశాల్లో మాంస ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని చటర్జీ తెలిపారు. ఎన్ఆర్‌సీఎం డైరెక్టర్ వైద్యనాథన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం గొర్రెలు, చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తుందని, భవిష్యత్‌లో ఎగుమతిరంగం పుంజుకునే ఆస్కారం ఉందని తెలిపారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మాంసం పరిశ్రమ అభివృద్ధిలో ప్రాసెసింగ్, మోడల్స్, నాణ్యత, స్లాటర్, నానోటెక్నాలజీ, సెల్ఫ్ లైఫ్, కొత్త ఆవిష్కరణలు ముఖ్యపాత్ర పోషించబోతున్నాయని వెల్లడించారు. మాంసం, మాంసం పదార్థాలలో ఉండే రసాయనిక అవశేషాలను కనిపెట్టేందుకు ఉపయోగపడే సాంకేతికతను అభివృద్ధి చేసినట్టు వివరించారు. దీనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పంజాబ్ తదితర రాష్ట్ర ప్రభుత్వాలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకొని ఆ ప్రభుత్వాల పశుసంవర్ధకశాఖకు ఎన్ఐఆర్ఎం చేయూతనిస్తుందని తెలిపారు. ప్రపంచస్థాయి నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా మాంసం ఉత్పత్తి కోసం అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ముందుకొచ్చిన ఐసీఏఆర్-ఎన్ఆర్‌సీఎంతో శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపుమేరకు 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయాలనే అంశాలపై నిపుణులు విస్తృతంగా చర్చించారు. జీహెచ్‌ఎంసీ తరహాలో జిల్లాల్లో స్లాటర్ హౌజ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి చొరవతో మెదక్ జిల్లాలో స్లాటర్ హౌజ్ నెలకొల్పేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ప్రాజెక్టు రిపోర్టు అందజేశామని శాస్త్రవేత్తలు ప్రకటించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నవీన మాంస పరిశోధన రంగంలో ఉన్న అవకాశాలను వివరించారు. మరో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బసవరెడ్డి మాంస పరిశ్రమలో వ్యాపార అవకాశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో కర్ణాటక వెటర్నరీ, పశుపరిశోధన వర్సిటీ డాక్టర్ ఎండీ నదీం ఫైరోజ్, భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎస్ రావు, ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్బీ బార్‌బుద్ధి, శాస్త్రవేత్తలు డాక్టర్ బీఎం నవీన, డాక్టర్ ఆర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ బసవారెడ్డి, డాక్టర్ జార్జ్‌నినన్ పాల్గొన్నారు.



ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఏఆర్-ఎన్ఆర్‌సీఎం, ఎస్వీ పశువైద్య వర్శిటీ అధికారులు

మార్చి 10న సీపీఎస్ ఉద్యోగుల జనజాతర

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం ఉద్యోగులు మార్చి 10న కాంట్రిబ్యూటరీ ఉద్యోగుల జనజాతర పేరుతో ఎన్టీఆర్‌స్టేడియంలో మహాసభను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఈ సభకు ఆహ్వానించాలని నిర్ణయించారు. రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌యూ) అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధానకార్యదర్శి శ్రీకాంతాచారి, కోశాధికారి నరేశ్‌గౌడ్‌లతో సన్నాహక సదస్సు కమిటీని ఏర్పాటుచేశారు. వీరు మార్చి ఐదు వరకు 31 జిల్లాల్లో పర్యటించి సన్నాహక సమావేశాలను నిర్వహిస్తారు. 2004 సెప్టెంబర్‌లో కాంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం అమల్లోకి వచ్చిన నాటినుంచి ఇప్పటివరకు 278 మంది మరణించగా.. 992 మంది ఉద్యోగులు రిటైరయ్యారు. చనిపోయిన 278 కుటుంబాల వారికి మరణ, పదవీ విరమణ గ్రాట్యుటీ అందలేదని, పదవీ విరమణ పొందిన 992మంది ఉద్యోగులకు గ్రాట్యుటీ అందలేదని టీఎస్‌సీపీఎస్‌యూ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం రూ.14 కోట్లు విడుదల చేస్తే ఆయా కుటుంబాలవారికి ఆర్థికప్రయోజనం చేకూరుతుందని ఉద్యోగసంఘాలు విజ్ఞప్తిచేస్తున్నాయి. రాష్ట్రంలో 1.23లక్షల మంది ఉద్యోగులు ఈ స్కీంలో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసి, తమ డిమాండ్లను సాధించుకోవాలని టీఎస్‌పీఎస్‌యూ ప్రయత్నిస్తున్నది.



సింహవాహనంపై కొలువుదీరిన యాదగిరీశుడు

గోవర్ధనగిరిధారిగా యాదగిరీశుడు

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రిలో శ్రీలక్ష్మీనరసింహుడు గురువారం గోవర్ధన పర్వతమెత్తి భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో ఆరోరోజు శ్రీలక్ష్మీనరసింహుడు గోవర్ధనగిరిధారి అలంకారంలో తిరువీధుల్లో భక్తుల జయజయ ధ్వానాల మధ్య దర్శనమిచ్చారు. విశేష పుష్పాలంకరణ, వజ్రవైడూర్యాలు ధరించి, సుగంధ ద్రవ్యాల పరిమళం వెదజల్లుతుండగా శ్రీవారు తనవైభవానికి తానే సాటి అన్న విధంగా ఊరేగారు. రాత్రి సింహవాహనంపై కొలువుదీరారు. శుక్రవారం ఎదుర్కోలు మహోత్సవం, 24న శ్రీవారి తిరుకల్యాణం, 25న శ్రీస్వామివారి దివ్య విమానరథోత్సవం జరుగనున్నది. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి శుక్రవారం ఉదయం యాదాద్రికి వస్తున్నట్టు ఆలయ ఈవో గీత తెలిపారు.

ప్రత్యేక హైకోర్టు మరింత ఆలస్యం

అమరావతిలో కొత్త భవన నిర్మాణం తర్వాతే తరలింపు.. మొదటి లేఖకు విరుద్ధంగా బాబు మరో లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు ఏర్పాటులో మరింత జాప్యం జరుగనున్నది. ఇప్పటికే ఉన్న భవనాలల్లో ఏపీ ప్రత్యేక హైకోర్టు ఏర్పాటు చేస్తామని ఉమ్మడి హైకోర్టుకు లేఖరాసిన చంద్రబాబు, ఐదు నెలల్లో కొత్త భవనం ఏర్పాటుచేస్తామని మరోలేఖ రాసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో కొత్త భవనం పూర్తయ్యాకే హైకోర్టు ఏర్పాటుకు ఉమ్మడిహైకోర్టు మొగ్గుచూపినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా ఉమ్మడి హైకోర్టు కొనసాగనున్నది.ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హైకోర్టు వ్యవహారంపై గురువారం ఉమ్మడిహైకోర్టు న్యాయమూర్తులు(ఫుల్‌కోర్టు),తాత్కాలిక ప్రధా న న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ సమావేశమయ్యారు. ఏపీ సర్కారు త్వరలో నిర్మాణం ప్రారంభించనున్న భవనం(సిటీ సివిల్‌కోర్టు)లోనే తాత్కాలిక హైకోర్టును ఏర్పాటుచేయాలనిఫుల్‌కోర్టు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తాత్కాలిక హైకోర్టు కోసం రూ.108 కోట్లు వెచ్చించి, 19 కోర్టు హాళ్లతో ఎనిమిది నెలల్లో భవనం నిర్మాణం చేస్తామని, హైకోర్టుకు శాశ్వతభవనం ఏర్పాటుచేసే వరకు తాత్కాలిక హైకోర్టును అదే భవనంలో కొనసాగిస్తామని ఉమ్మడి హైకోర్టుకు ఇటీవల రాసిన లేఖలో ఏపీ సీఎం చంద్రబాబు తెలియచేసినట్టు సమాచారం. భవనాన్ని ఎనిమిది నెలల్లో కాకుండా ముందుగా పూర్తిచేస్తామని తెలిపినట్టు తెలిసింది. ఏపీ ప్రత్యేక హైకోర్టు కోసం కేటాయించిన భవనాలపై న్యాయమూర్తుల పరిశీలన కమిటీ అనాసక్తి ప్రదర్శించిన నేపథ్యంలో, కొత్త భవనంలోనే తాత్కాలిక హైకోర్టు ఏర్పాటుకు ఫుల్‌కోర్టు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. చంద్రబాబు పేర్కొన్న భవనం ఎప్పుడు పూర్తయితే అప్పుడు ఏపీ హైకోర్టును తరలించాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

ముంచిన మొత్తం 10 లక్షల కోట్లు



మ్యాడం మధుసూదన్,
(ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ)

బ్యాంకుల్లో ఖాతాలు మొదలుపెట్టండని ప్రధానమంత్రి పిలుపునిస్తారు. ఇంట్లో సొమ్మంతా తెచ్చి బ్యాంకుల్లో పెట్టేందుకు పెద్ద నోట్లను రద్దు చేసేస్తారు. చెమటోడ్చి సంపాదించిన డబ్బు బ్యాంకుల్లో సురక్షితం గా ఉంటుందని నమ్మి జమచేస్తే.. ఆ సొమ్ము తో మరొకడు సోకు చేసుకొంటాడు. ప్రజలు తమపై ఉంచిన అపార నమ్మకాన్ని బ్యాంకులు కంపెనీలకు తాకట్టు పెడుతున్నాయి. జనం సొమ్మును బడాబాబులకు ధారాదత్తం చేస్తున్నాయి. సామాన్యుడు అప్పు కోసం వస్తే సవాలక్ష ఆంక్షలు పెట్టే బ్యాంకు అధికారులు సూటుబూటు వ్యాపారులను మాత్రం గుడ్డిగా నమ్మేస్తున్నారు. సామాన్యుడు దాచుకొన్న డబ్బు అప్పనంగా బడా కంపెనీల ఖాతాల్లోకి బదిలీ చేస్తున్నారు. రాజుల సొమ్ము రాళ్ల పాలన్న సామెత ఇప్పు డు తిరగబడింది. సామాన్యుడు రాళ్లు కొట్టి కూడబెట్టిన సొమ్ములు కార్పొరేట్ బడాబాబుల పాలయిపోతున్నాయి. లిక్కర్‌డాన్ విజయ్‌మాల్యా బ్యాంకులను తొమ్మిదివేల కోట్లకు పైగా ముంచి లండన్ పారిపోయిన క్రమంలోనే తాజాగా వెలుగుచూసిన పీఎన్బీని ముంచిన నీరవ్‌మోదీ వ్యవహారం దేశ బ్యాంకింగ్ వ్యవస్థ పనితీరును ప్రశ్నార్థకం చేసింది. మాల్యాలు, మోదీలకు తోడు కొత్తగా విక్రమ్ కొఠారీ బాగోతం తెరమీదకు వచ్చింది. ఇట్లాంటి వాళ్లు చాలామందే ఉన్నారంటూ ఆర్బీఐ ప్రకటించింది. వీళ్లంతా కలిసి బ్యాంకులను ముంచిన మొత్తం సొమ్ము దాదాపు పది లక్షల కోట్ల రూపాయలు. అంటే.. మన దేశ వార్షిక బడ్జెట్ (రూ. 24 లక్షల కోట్లు) మొత్తంలో దాదాపు నలభై శాతం అన్నమాట. దేశంలో పది రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌తో ఇది సమానం. తాజాగా బయటపడ్డ నీరవ్‌మోదీ, విక్రం కొఠారీల లెక్కలు కాకుండా భారత రిజర్వ్ బ్యాంకు తేల్చిన లెక్కలివి.

తెలుగు రాష్ట్రాల్లోనూ నీరవ్‌మోదీలు

మన తెలుగు రాష్ట్రాల్లోనూ నీరవ్‌మోదీల్లాంటి ప్రబుద్ధులు ఉన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వివిధ రూపాల్లో పెట్టుబడులు పెట్టిన కంపెనీలు బ్యాంకులను ముంచిన మొత్తం రూ. 50వేల కోట్ల పైమాటేనని లెక్క తేల్చింది. ఇందులో సింహభాగం హైదరాబాద్ కేంద్రంగా వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్న ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్‌దే. ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్ బ్యాంకులకు ఎగవేసిన రుణం మొత్తం రూ.44 వేల కోట్లుగా ఆర్బీఐ పేర్కొన్నది. నీరవ్‌మోదీ, విక్రమ్ కొఠారీల ఉదంతంతో మరింత అప్రమత్తమైన ఆర్‌బీఐ ఇప్పటివరకు మూడు జాబితాలను విడుదల చేసింది. మూడో జాబితాలో రూ.100 కోట్ల నుంచి రూ. 500 కోట్ల వరకు రుణాలను ఎగవేసినవారి పేర్లను వెల్లడించింది. అందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలు, కంపెనీలు ఎగవేసిన రుణాలు దాదాపు రూ. ఆరువేల కోట్ల వరకు ఉన్నట్లు ప్రాథమిక అంచనా. ఈ జాబితాలో ఎగవేతదారుల మొండి బకాయిలు రూ.49 వేల కోట్లుగా తేలింది. దేశవ్యాప్తంగా తాము చెల్లించలేమని పూర్తిగా చేతులెత్తేసిన సుమారు 36 కంపెనీల నుంచి సొమ్మును వసూలు చేసే బాధ్యతను ఆర్బీఐ 'నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్'కు అప్పగించింది. ఆ రుణాల విలువ.. అక్షరాలా ఎనిమిదిన్నర లక్షల కోట్లు. ఈ పరిస్థితి దేశ ఆర్థిక వ్యవస్థనే కుదిపేసేలా మారింది. కేంద్ర ప్రభుత్వం పెద్దనోట్లను రద్దు చేసిన సమయంలో మొత్తం దేశంలో చలామణీలో ఉన్న నగదు రూ.15 లక్షల కోట్లు.. కానీ బడావ్యాపారులు బ్యాంకులకు ఎగవేసిన మొత్తం ఎంతో తెలుసా? అక్షరాలా రూ.పది లక్షల కోట్లు. బ్యాంకులలో దాచుకున్న ప్రజల సొమ్మును రుణాల రూపంలో ఘరానా మోసగాళ్లకు అప్పనంగా అప్పజెప్పి బ్యాంకులు నెత్తిన చేతులు పెట్టుకుంటున్నాయి. మొండిబకాయిలు ఎటూ తేలక ఆర్బీఐ 36 కేసులను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ)కు అప్పగించింది. 36 కేసుల్లో విల్‌ఫుల్ డిఫాల్టర్ల సంఖ్యే ఎక్కువ. ఇది దేశ బ్యాంకింగ్ రంగానికే పెద్ద సవాల్‌గా మారింది.

నీరవ్‌కు పీఎన్బీ దాసోహం

వజ్రాల వ్యాపారి నీరవ్‌మోదీ స్కాంలో కొత్త నిజాలు వెలుగుచూస్తున్నాయి. దాదాపు 14వేల కోట్ల రుణాల ఎగవేతతోపాటు హవాలా రాకెట్ కోణం బయటపడుతున్నది. నీరవ్ వ్యాపారం హైదరాబాద్‌లో కూడా విస్తరించడంతో ఈడీ అధికారులు ఇక్కడి బ్రాంచీలపై దృష్టి పెట్టారు. ఆర్బీఐ విడుదల చేసిన జాబితాను గమనిస్తే నీరవ్‌మోదీలను మించి బ్యాంకులను బురిడీ కొట్టించిన కంపెనీల పేర్లు విస్తుగొలుపుతున్నాయి. డిఫాల్టర్ల జాబితాలో 12కంపెనీలు టాప్‌లో ఉన్నాయి. భారత్ స్టీల్ లిమిటెడ్, ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్, ఎస్సార్ స్టీల్ లిమిటెడ్, అలోక్ ఇండస్ట్రీ వంటి కంపెనీలు రెండున్నర లక్షల కోట్లకుపైగా రుణాలను ఎగవేసినట్లు ఆర్బీఐ వెల్లడించింది. పీఎన్బీ, ఎస్బీఐ, ఐడీబీఐ వంటి బ్యాంక్‌లకు భారీగా బకాయిపడ్డాయి.

బ్యాంక్‌లను సంక్షోభంలోకి నెట్టిన టాప్ 12 డిఫాల్టర్‌లు..

1	భారత్ స్టీల్ లిమిటెడ్	44,478 కోట్లు
2	ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్ లి.	44,364 కోట్లు
3	ఎస్సార్ స్టీల్ లి.	37,284 కోట్లు
4	భూషణ్ పవర్ అండ్ స్టీల్	38,000 కోట్లు
5	అలోక్ ఇండస్ట్రీస్	22,000 కోట్లు
6	ఆమ్‌టెక్ ఆటో లిమిటెడ్	14,000 కోట్లు
7	మన్నెత్ ఇస్పాత్ లిమిటెడ్	12,015 కోట్లు
8	ఎలక్ట్రో స్టీల్ లిమిటెడ్	10,000 కోట్లు
9	ఎరా ఇన్‌ఫ్రా కంపెనీ	10,273 కోట్లు
10	జైపీ (jaypee)	9,700 కోట్లు
11	ఏబీజీ షిప్‌యార్డ్	6,900 కోట్లు
12	జ్యోతి స్ట్రక్చరల్	5,165 కోట్లు

ఎగవేసిన మొత్తం 2,54,179 కోట్లు

ఆర్బీ ఐ మూడో జాబితాలో బ్యాంకులవారీగా రుణాలు ఎగవేసినవారి పేర్లను వెల్లడించింది. రూ. 10 కోట్ల నుంచి రూ. 500 కోట్ల వరకు రుణాలు ఎగవేసినవారి వివరాలను బ్యాంక్‌లకు పంపించి వెంటనే వసూలుచేయాలని ఆదేశించింది. ఇందులో హైదరాబాద్ కేంద్రంగా నగల వ్యాపారంచేసే ఎంబీఎస్ జ్యువెల్లర్స్ దాదాపు 900 కోట్లకు పైగా రుణాలను ఎగవేసింది. తెలంగాణ, ఏపీలలో ఆంధ్రా బ్యాంక్, పీఎన్బీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ వంటి వాటికి కుచ్చుటోపీలు పెట్టినవారి రుణాల విలువ దాదాపు 7వేల కోట్ల వరకు ఉంటుందని ప్రాథమిక అంచనాలో తేలింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న దక్కన్ క్రానికల్ హోల్డింగ్ లిమిటెడ్ ఒక్క ఆంధ్రబ్యాంకు నుంచే 203 కోట్ల రూపాయలు తీసుకున్నది. కెనరాబ్యాంకు సహా మరికొన్ని బ్యాంకుల నుంచి రూ. వెయ్యికోట్లకు పైగానే రుణాలు తీసుకొని బకాయిపడింది.

తాజాగా విడుదలైన మీడియం డిఫాల్టర్లలో కొన్ని కంపెనీల వివరాలు బ్యాంకులవారీగా..

బ్యాంకు పేరు	అప్పు తీసుకున్న కంపెనీ	కంపెనీ డైరెక్టర్	అప్పు(రూ.కోట్లలో)
ఆంధ్రాబ్యాంక్	ఎంబీఎస్ జ్యువెలర్స్‌లిమిటెడ్	సుఖేశ్‌గుప్తా	251
ఆంధ్రాబ్యాంక్	దక్కన్ క్రానికల్ హోల్డింగ్ లిమిటెడ్	వెంకట్రాంరెడ్డి	203
ఆంధ్రాబ్యాంక్	సోలార్ సెమీ కండక్టర్స్	సత్యనారాయణ ప్రసాద్	121
ఆంధ్రాబ్యాంక్	ఎన్‌సీఎస్ షుగర్స్	నాగేశ్వరరావు	111
యాక్సిస్ బ్యాంక్	ఆర్‌ఈఐ ఆగ్రో	అశోక్‌కుమార్ చటర్జీ	160
బ్యాంక్ ఆఫ్ బరోడా	పెరల్ విజన్ ప్రై.లిమిటెడ్	పీకే తివారీ	103
బ్యాంక్‌ఆఫ్ మహారాష్ట్ర	విజ్‌డమ్ డైమండ్స్, జ్యువెలరీ	జతిన్ ఆర్ మెహతా	276
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	సిద్ధివినాయక లాజిస్టిక్స్	రూప్‌చంద్	185
సెంట్రల్ బ్యాంక్‌ఆఫ్ ఇండియా	ఎలక్ట్రోథర్మ్ ఇండియా లిమిటెడ్	ముఖేశ్ బండారీ	385
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	ఎస్ కుమార్స్ నేషన్‌వైడ్ లిమిటెడ్	నిథిన్ కస్లీవాల్	283
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	ఫర్‌ఎవర్ ప్రీషియస్ జ్యువెలరీ	నివేశ్ పటేల్	254
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	సూర్య వినాయక ఇండియా లి.	రాజీవ్ సుఖ్‌బీర్	154
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	థారస్ అర్త్‌మూవర్స్	సిద్ధార్థ నారాయణ్	130
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	బెస్ట్ అండ్ క్రాంప్టన్ ఇంజినీరింగ్	నారాయణస్వామి	121
ఐసీఐసీఐ బ్యాంక్	కెమ్‌రాక్ ఇండస్ట్రీస్	కల్పేశ్ మహేంద్రభాయ్‌పటేల్	123
ఇండియన్ బ్యాంక్	సౌత్ ఇండియాప్రొడ్యూస్ కంపెనీ	టి.సుధాకర్	117
ఇండియన్ బ్యాంక్	పరేఖ్ ప్లాటినియం లిమిటెడ్	రమేశ్ పరేఖ్	173
ఇండియన్ బ్యాంక్	బెల్లరీ స్టీల్స్	మాధవ ఎస్	111
కొటక్ మహీంద్రా బ్యాంక్	బేట న్యాఫ్‌థోల్	దీపక్ భవేజా	951
కొటక్ మహీంద్రా బ్యాంక్	రాజా టెక్స్‌టైల్స్	శ్రీవాత్సవ	694
కొటక్ మహీంద్రా బ్యాంక్	ర్యాంక్ ఇండస్ట్రీలిమిటెడ్	డీవీ రమేశ్	551
కొటక్ మహీంద్రా బ్యాంక్	త్రిమూర్తి ఫర్టిలైజర్స్	ధీనాథ్	261
కొటక్ మహీంద్రా బ్యాంక్	జేబీ డైమండ్స్	జ్యూరాజ్ భాయ్ సురానీ	258
కొటక్ మహీంద్రా బ్యాంక్	వాసుటెక్ లిమిటెడ్	ధురువర్మ	233
కొటక్ మహీంద్రా బ్యాంక్	మిశ్రా కార్పెట్‌ప్యాలెస్	శ్యామ్‌జీ మిశ్రా	233
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	ద్వారకాదాస్ సేథి ప్రై.లిమిటెడ్	సభ్యసేథ్	257
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	డీఎస్సీ లిమిటెడ్	మహేందర్‌సింగ్	230
పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్	ఇండియన్ టెక్నో మ్యాక్ కంపెనీ	రాకేశ్‌కుమార్	125
పంజాబ్ నేషనల్ బ్యాంక్	ఫరెవర్ ప్రీసియస్ జ్యువెలరీ	జతిన్ మెహతా	747
పంజాబ్ నేషనల్ బ్యాంక్	విన్సమ్ డైమండ్స్	జతిన్ మెహతా, ఆర్ రవిచంద్ర	900
పంజాబ్ నేషనల్ బ్యాంక్	జూమ్ డెవలపర్స్ ప్రై.లిమిటెడ్	విజయ్ చౌదరి	410
పంజాబ్ నేషనల్ బ్యాంక్	వీఎంసీ సిస్టమ్స్ లిమిటెడ్	ఉప్పలపాటి హిమబిందు	296
పంజాబ్ నేషనల్ బ్యాంక్	ఎంబీఎస్ జ్యువెలర్స్ ప్రై.లిమిటెడ్	సుఖేశ్‌గుప్తా	266
స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనీర్ అండ్ జైపూర్	ఆర్‌ఈఐ ఆగ్రో లిమిటెడ్	సంజయ్ జున్‌జున్‌వాలా	313
స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనీర్ అండ్ జైపూర్	న్యాఫెడ్	న్యాఫెడ్	158
స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్	జీఎస్ ఆయిల్స్ లిమిటెడ్	మనోజ్‌కుమార్ అగర్వాల్	220
స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్	ఇండియన్ టెక్నోమ్యాక్ కంపెనీ లి.	రాకేశ్‌శర్మ	168
స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్	జూమ్ డెవలపర్స్ ప్రై.లిమిటెడ్	విజయ్ మధన్‌లాల్ చౌదరి	113
స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్	శీతల్ రిఫైనరీస్ లిమిటెడ్	జుగల్ కిశోర్	110
స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్	ఎంబీఎస్ ఇంపెక్స్ ప్రై.లిమిటెడ్	సుఖేశ్‌గుప్తా	309
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	ఎక్సెల్ ఎనర్జీ లిమిటెడ్	పి.రవీంద్రనాథన్	413
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	అగ్‌నైట్ ఎడ్యుకేషన్ లిమిటెడ్	బాలసుబ్రహ్మణ్యం	316
విజయ బ్యాంక్	జూమ్ డెవలపర్స్ ప్రై.లిమిటెడ్	విజయ్ చౌదరి	180
విజయ బ్యాంక్	పెరల్ స్టూడియో	ప్రబోధ్‌కుమార్	164
విజయ బ్యాంక్	అగస్త్యేయర్ పేపర్‌బోర్డు లిమిటెడ్	ఎన్ఎస్.మణి	157

లండన్‌లో సిక్కు వ్యక్తిపై జాత్యాంహకార దాడి

లండన్: బ్రిటన్‌లో సిక్కు పౌరుడిపై జాత్యాంహకార దాడి జరిగింది. ఓ శ్వేత జాతీయుడు ఈ దాడికి పాల్పడ్డాడు. బ్రిటన్‌లో పర్యటిస్తున్న భారత్‌కు చెందిన పర్యావరణ ఉద్యమకారుడు రవ్‌ణీత్ సింగ్(37) అక్కడి సిక్కు ఎంపీ తాన్ దేశీని కలువడానికి బుధవారం సాయంత్రం పార్లమెంట్ వద్దకు వెళ్లారు. అయితే పార్లమెంట్ బయట వేచి ఉన్న రవ్‌ణీత్‌పై ఓ శ్వేతజాతీయుడు దాడి చేశాడు.



నాగాలాండ్ రాష్ట్ర అభివృద్ధిలో ఉన్న లోపాలను సవరించేందుకు నేను కృషిచేస్తాను. ఈశాన్య ప్రాంతంలో రవాణా వ్యవస్థ ద్వారానే మార్పు సాధ్యం. నాగాలాండ్‌లో 500 కిలోమీటర్ల జాతీయ రహదారుల కోసం పదివేల కోట్లు వెచ్చించాం. సౌభాగ్య పథకంతో ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండేలా చర్యలు తీసుకుంటాం.

నరేంద్రమోదీ, ప్రధాని

జైపూర్‌లోని గాంధీనగర్ రైల్వేస్టేషన్ ఇరువై నాలుగు గంటలు మహిళా సిబ్బందితో నడుపబడే మొట్టమొదటి భారత నాన్ సబర్బన్ రైల్వేస్టేషన్‌గా పేరొందింది. స్టేషన్ ఆపరేషన్స్ మొదలు రైల్వే భద్రతా అధికారులంతా మహిళలే. రైల్వేలలో మహిళ సాధికారత సాధ్యమవుతున్నది అనడానికి ఇదొక ఉదాహరణ. సమాజంలో మార్పునకు ఇది దోహదపడుతుంది.



పీయూష్ గోయల్, రైల్వే మంత్రి

చరిత్రలో నేడు



1455

తొలిసారి బైబిల్‌ను ముద్రించిన జాన్ గుటెన్‌బర్గ్.

1895



17.56 నిమిషాల్లో 10 కి.మీ. స్కేటింగ్ చేసి వరల్డ్ రికార్డు సాధించిన జాప్ ఎడెన్.



1919

ఇటలీలో ఫాసిస్ట్ పార్టీని స్థాపించిన ముస్సోలిని.

కేజ్రీవాల్ నేతృత్వంలోని ఢిల్లీ ప్రభుత్వం, అధికార యంత్రాంగానికి మధ్య తీవ్ర వైరుధ్యం నెలకొన్నది. చరిత్రలో ఇటువంటి సన్నివేశం అరుదు. అర్ధరాత్రి చీఫ్ సెక్రటరీని కేజ్రీవాల్ తన నివాసానికి పిలిపించటం, అక్కడ అతనిపై ఓ ఎమ్మెల్యే దాడిచేయటంపై అధికారుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. ఎమ్మెల్యే చేత క్షమాపణ చెప్పించేదాకా సీఎం అధికార సమావేశాలకు హాజరుకాబోమని ఐఏఎస్ అధికారుల సంఘం పట్టుబట్టడం సమస్య తీవ్రతను చెబుతున్నది. ఇప్పటికైనా కేజ్రీ, అతని సహచరులు రాజ్యాంగ నియమాలకు లోబడి నడుచుకోవాలని గుర్తిస్తే మంచిది.

ది హిందూ

మోదీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. దేశంలో బొగ్గుగని తవ్వకాల్లో ప్రైవేట్ కంపెనీల పెట్టుబడులకు అనుమతిచ్చింది. బొగ్గు గనులను జాతీయం చేసిన 45 ఏండ్ల తర్వాత తిరిగి గనులను ప్రైవేట్ కంపెనీల చేతుల్లో పెట్టడం ఆశ్చర్యకరం. దేశంలో విద్యుత్‌శక్తి ఉత్పాదనలో బొగ్గుదే ప్రధాన పాత్ర. 70 శాతం విద్యుత్తు బొగ్గునుంచే ఉత్పత్తి అవుతున్నది. ప్రైవేట్ పెద్ద కంపెనీల రాకతో బొగ్గు తవ్వకాల్లో టెక్నాలజీ వినియోగంతో బొగ్గు వెలికితీత సామర్థ్యం పెరుగుతుందని ప్రభుత్వం అంటున్నది. 1991 తర్వాత నూతన ఆర్థిక విధానాల కొనసాగింపులో భాగంగానే ఈ నిర్ణయమని ప్రభుత్వం చెప్పకనే చెబుతున్నది.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

తమిళనాట కొత్త పార్టీ

ప్రముఖ నటుడు కమల్‌హాసన్ నేతృత్వంలో తమిళనాట కొత్త రాజకీయపార్టీ పురుడుపోసుకున్నది. విలక్షణ నటుడిగా పేరు సంపాదించుకున్న కమల్‌హాసన్ 'మక్కల్ నీది మయ్యం' (ప్రజా న్యాయ వేదిక)పేరుతో రాజకీయపార్టీని స్థాపించి జెండాను, అజెండాను ప్రకటించారు. ఐక్యతకు, పరస్పర సహకారానికి ప్రతీకగా ఐక్యతా చిహ్నం మధ్య నక్షత్రం గుర్తుతో జెండాను ఆవిష్కరించారు. ఐక్యతా చిహ్నంలోని ఆరు చేతులను దక్షిణాది ఆరు రాష్ర్టాలకు ప్రతీకగా, నక్షత్రం ప్రజలకు గుర్తు గా చెబుతూ ప్రజలు కేంద్రంగా తన పార్టీ పనిచేస్తుందని తెలిపారు. కొన్నేండ్లుగా తమిళనాడు రాజకీయాలు అవినీతిమయం అయిపోయాయన్న అపవాదు మూట గట్టుకున్న పరిస్థితుల్లో స్వచ్ఛమైన, నీతిమంతమైన రాజకీయాల కోసం పార్టీని ప్రారంభిస్తానని ప్రకటించి న కమల్‌హాసన్ ఆ దిశగా అడుగులు వేశారు. మొదటి నుంచి అభిప్రాయాల్లో, జీవితాచరణలో తనదైన ప్రత్యేకతను చాటుకున్న ఆయన పార్టీ ఆవిర్భావ సమయంలోనూ కొనసాగించారు. నిరాడంబరత్వానికి, సచ్ఛీలమైన, త్యాగపూరితమైన జీవితానికీ ప్రతీకగా నిలిచిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఇల్లు రామేశ్వరం నుంచి ప్రదర్శన ప్రారంభించారు. మధురైలో అశేష అభి మాన జనసందోహం మధ్య పార్టీని ప్రకటించారు. ఓటును అమ్ముకొని ఏండ్ల తరబడి కష్టాలపాలవుతున్న ప్రజలను గట్టెక్కించేందుకు రాజకీయపార్టీని ప్రారంభించానని ఉద్వేగభరితమయ్యారు. తాను అందరిలా రాజకీయనేతను కానని, కార్యకర్తనని అన్నారు. ప్రజలకు సేవ చేయడమే బాధ్యతగా స్వీకరించి రాజకీయాల్లోకి వచ్చానని చెప్పుకున్నారు. నాస్తికుడైన కమల్‌హాసన్ గాంధీని, పెరియార్‌ను ఇతర గొప్పనేతలను ఆదర్శంగా స్వీకరిస్తానని, గౌరవిస్తానని, వారి అడుగుజాడల్లో నడుస్తానని ప్రకటించి తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు.

కాంగ్రెస్ రాజకీయ ఆధిపత్యాన్ని గండికొట్టి దేశంలో ప్రాంతీయ రాజకీయశక్తికి పునాది వేసిన రాష్ట్రంగా తమిళనాడుకు విశిష్టత ఉన్నది. సినీరంగ ఆకర్షణ, అభిమాన సంఘాల ఆరాధాన శక్తి పెట్టుబడిగా ఉపకరించిందని చెప్పుకున్నా, దానికి సుదీర్ఘ సామాజిక,రాజకీయ నేపథ్యం ఉన్నది. దక్షిణభారతంలోనే ప్రాంతీయ రాజకీయశక్తికి పునాది వేసిన 'సౌత్ ఇండియన్ వెల్ఫేర్ అసోసియేషన్' 1916లోనే ప్రారంభమైంది. ఈ మూలాల్లోంచే ఈ.వి.రామస్వామి పెరియార్ 1944లోనే 'ద్రవిడార్ కగజమ్' పార్టీని స్థాపించి, స్వయంప్రతిపత్తిగల ప్రత్యేక ద్రవిడ నాడు కోసం ఉద్యమించాడు. కొంతకాలం తర్వాత సీఎన్ అన్నాదురై పెరియార్‌తో విభేదించి 1956లో ద్రవిడ మున్నేట్ర కజగమ్ (డీఎంకే) స్థాపించాడు. హిందీ వ్యతిరేకోద్యమంతో ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న డీఎంకే, 67లో కాంగ్రెస్ ఏకఛత్ర పాలనకు తెరదించి అధికారం కైవసం చేసుకుని అన్నాదురై ముఖ్యమంత్రి అయ్యారు. అన్నాదురై 69లో కన్నుమూయటంతో కరుణానిధి పార్టీ పగ్గాలు చేపట్టారు. ఎంజీఆర్‌గా ప్రఖ్యాతిగాంచిన ఎంజీ రాంచంద్రన్ అనతికాలంలోనే కరుణానిధి నాయకత్వాన్ని విభేదించటంతో 72లో డీఎంకే పార్టీ చీలిపోయింది. ఎంజీఆర్ నాయకత్వంలో ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగమ్ (ఏఐఏడీఎంకే) ఏర్పడింది. ఇది మొదలు ఒక పార్టీ తర్వాత మరొకటిగా డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీలు అధికారాన్ని పంచుకుంటున్నాయి. అయితే కాలక్రమంలో అదేస్థాయిలో పోటాపోటీగా అవినీతి కుంభకోణాల్లో కూరుకుపోవటం, అధికారాన్ని కోల్పోవటం ఓ రాజకీయ చదరంగంగా కొనసాగుతున్నది. ఓ సుదీర్ఘ సామాజిక, రాజకీయ చరిత్ర నేపథ్యంగా ఉత్తరాది రాజకీయ ఆధిపత్యానికి ఎదురొడ్డి ద్రవిడ రాజకీయాలకు పునాది వేసిన రాష్ట్రంలో అవినీతి రాజకీయాలు తమిళ చరిత్రను కాంతి విహీనం చేశాయి. సరిగ్గా ఇలాంటి నేపథ్యంలో కమల్‌హాసన్ రాజకీయ ప్రవేశం కాకతాళీయం కాదు, చారిత్రక సందర్భంగా భావించవచ్చు. అయితే జయలలిత మరణం, ఏర్పడిన రాజకీయ కుమ్ములాటల నేపథ్యంలో ఏర్పడిన రాజకీయ శూన్యతలో కమల్‌హాసన్ ఎంతమేరకు సఫలీకృతులవుతారో కాలమే సమాధానం చెబుతుంది.

> **విభిన్నమైన పాలనా విధానం, జీవనప్రమాణాలను పెంచే అభివృద్ధి పథకాలు స్పష్టమైన రాజకీయ, తాత్విక దృక్పథం వెలుగులోనే సుసాధ్యమన్నది కమల్‌హాసన్‌కు తెలియంది కాదు. కాకుంటే సినీరంగ వ్యవహారశైలి అతని కార్యాచరణపై నీలినీడగా సోకకుండా చూసుకున్నప్పుడే కమల్‌హాసన్ రాజకీయ భవిష్యత్తుకు భరోసా.**

దక్షిణాదిన ద్రవిడ రాజకీయానికి పునాదివేసిన తమిళనాడులో రాజకీయాలు అంత సులువు కాదని చరిత్ర చెబుతున్నది. కేవలం సినీ గ్లామర్, అభిమాన సంఘాల ఆదరణే పునాదిగా ఉండే రాజకీయాలకు కాలం చెల్లిన స్థితి తమిళనాడుతో సహా రాష్ట్రంలోనూ అనుభవంలోకి వచ్చింది. చిరంజీవి, విజయకాంత్, రజనీకాంత్, పవన్ కళ్యాణ్ లాంటి వారి అనుభవాలు ఉండనే ఉన్నాయి. అలాగే ప్రజాకర్షక పథకాలతో అందలమెక్కి ఏం చేసినా నడుస్తుందనే ధోరణికి భవిష్యత్తు అంధకారమేనని కూడా తెలిసివస్తున్నది. ఈ పరిస్థితుల్లో కమల్‌హాసన్ కూడా సినీ గ్లామర్, అభిమాన సంఘాల సంఖ్యాబలంపై మాత్రమే ఆధారపడి రాజకీయాలు చేయబోరని ఆశించవచ్చు. ఎందుకంటే చాలామంది తమిళనేతలకు భిన్నంగా తాత్విక దృక్పథం, జీవితాచరణ కలిగిన కమల్‌హాసన్ రాజకీయాల్లో కూడా విలువలకు పెద్దపీట వేస్తేనే భిన్నత్వం ఉంటుంది. ప్రజాదరణ వస్తుంది. ఓట్ల కోసం హామీలు గుప్పించనని, ఆరు వేల లంచమిచ్చి ఓటు అడుగనని అంటూ, ఆరు లక్షలు ఎలా సంపాదించవచ్చో పాలనావిధానాలతో సంక్షేమానికి పెద్దపీట వేసి ప్రజలను ఐశ్వర్యవంతులను చేస్తానని ప్రకటించి తన రాజకీయ ప్రాధాన్యాలను చాటడం ఆహ్వానించదగింది. కేవలం సినీగ్లామర్ కేంద్రంగా రాజకీయాలు చేయాలనుకుని, చేతులెత్తేసిన ఉదంతాల నుంచి గుణపాఠాలుగా నేర్చుకోవాలి. విభిన్నమైన పాలనా విధానం, జీవనప్రమాణాలను పెంచే అభివృద్ధి పథకాలు స్పష్టమైన రాజకీయ, తాత్విక దృక్పథం వెలుగులోనే సుసాధ్యమన్నది కమల్‌హాసన్‌కు తెలియంది కాదు. కాకుంటే సినీరంగ వ్యవహారశైలి అతని కార్యాచరణపై నీలినీడగా సోకకుండా చూసుకున్నప్పుడే కమల్‌హాసన్ రాజకీయ భవిష్యత్తుకు భరోసా.

జనగళం

రైతే రాజు లక్ష్యం

రైతులకు పంట రుణాల మాఫీ, ఇన్‌పుట్స్ సబ్సిడీ అందించడం ఉచిత విద్యుత్ అందించడం, గోదాముల నిర్మాణం లాంటి రైతు సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం హర్షణీయం. రెండు పసళ్లకు ఎకరానికి రూ. 8 వేల పెట్టుబడి అందించడం దేశానికే ఆదర్శం. ఇలాంటి బృహత్తరమైన పథకాలతో రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తున్నది. రైతులను సంఘటితం చేసేందుకు సమన్వయ కమిటీతోపాటు వ్యవసాయరంగాన్ని లాభసాటిగా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నది. ఇలాంటి విప్లవాత్మక నిర్ణయాలతో సంక్షేమ పథకాలు దీర్ఘకాలికంగా కొనసాగితే కచ్చితంగా రైతు రాజు అవుతాడు.

- జి.సతీష్‌కుమార్, టీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

వీఆర్ఏలకు పదోన్నతులేవి?

రెవెన్యూ శాఖలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేర్చడంలో వీఆర్ఏలది కీలకపాత్ర. రేయింబవళ్లు రికార్డుల శుద్ధీకరణలో పాల్గొన్నా మాపై వీఆర్ఏలపై పైస్థాయి అధికారులు కరుణ చూపడం లేదు. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా తయారైంది వీఆర్ఏల పరిస్థితి. గతేడాది ఫిబ్రవరి 24 శివరాత్రి రోజున ప్రగతిభవన్‌లో వీఆర్ఏలతో చర్చలు జరిపి ముఖ్యమంత్రి కేసీఆర్ పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు. ఏపీపీయస్సీ ద్వారా ఎంపికైన దాదాపు 2900 మంది డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. కానీ ఏడాది అవుతున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదు. అధికారుల అలసత్వంతో వీఆర్ఏలలో నైరాశ్యం అలుముకున్నది. కాబట్టి రెవెన్యూ శాఖలో వీఆర్ఏల పదోన్నతులపై దృష్టిసారించాలి. సంక్షేమ పథకాలు అమల్లో కీలక పాత్ర పోషిస్తున్న వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించేవిధంగా చర్యలు తీసుకుంటే 2900 ఉద్యోగుల్లో వెలుగులు విరజిమ్ముతాయి.

- కొండ రాజేంద్రకుమార్, సంస్థాన్‌నారాయణపూర్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

జాతీయం



మిహిర్ స్వరూప్ శర్మ

మోదీది గెలుపు బాటేనా?

నరేంద్ర మోదీ రెండోసారి అధికారంలోకి రాబోతున్నారా అనేది ఊహకందనిదే. కానీ మనం చెప్పగలిగేది అందరిలాగా ఆయనది ప్రథమ గెలుపు. కానీ ఆతర్వాత తన అనుచరణ గణంపై ఆధారపడిన ఆయన ఆచరణ, ఆయన మొదట్లో సాధించిన 282 మ్యాజిక్ ఫిగర్‌లో 50 స్థానాలు తగ్గించింది. ఇదే కొనసాగితే.. మునుముందు ఆయన ముందున్నది గెలుపుబాట కాదు, ఓటమి బాటే.

ఈ మధ్య కాలంలో మోదీ ప్రభుత్వ పయనం ఏమిటన్నది ఆయన ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చెబుతున్నది. బడ్జెట్ సందర్భంగా దేశవ్యాప్తంగా జరిగిన చర్చలు, ఊహాగానాలు మోదీ ప్రభుత్వ భవిష్యత్తుకు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా గడిచిన పదేండ్లలో మొదటిసారి బడ్జెట్ ఏకకాలంలో బలహీనంగా, అస్పష్టంగా ఉన్నది. బడ్జెట్ అంటే అనేక విధాన నిర్ణయాలు, అనేక కొత్త అంశాలు, ప్రణాళికల సవరణలు ఉంటాయి. ఓ వారంపాటు అందరిదృష్టిని బడ్జెటే ఆకర్షించాలి. కానీ ఇవేవీ ఈసారి బడ్జెట్‌లో లేకుండా చాలా బలహీనంగా ఉన్నది. మరో విషయమేమంటే బడ్జెట్ రోజున ఎలాంటి భారాలు మోపబోతున్నారు, ఏ వస్తువులపై ఎలాంటి పన్నులు వేయబోతున్నారు అనేది బాగా చర్చ జరిగింది. కానీ ఇవేవీ లేకుండానే ఈ బడ్జెట్ ముగిసింది. అలాగే బడ్జెట్ రోజు దానికంటే ఎక్కువగా మరో రెండు అంశాలు అందరిదృష్టిని ఆకర్షించాయి.

మొదటిది రాజస్థాన్‌లో జరిగిన ఉప ఎన్నికల గురించి, అక్కడ వచ్చిన ఫలితాల గురించి చెప్పుకోవాలి. అక్కడ బీజేపీకి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. వాస్తవానికి ఈ వ్యతిరేకత ఏ రీతిన ఉన్నదో ప్రపంచానికి చాటిచెప్పింది. అల్వార్ నియోజకవర్గం స్థానాన్ని 2014లో బీజేపీ రెండు లక్షల మెజారిటీతో గెలుపొందింది. కానీ 2018లో లక్ష ఓట్ల మెజారిటీతో ఆ స్థానాన్ని కోల్పోయింది. ఈ నియోజకవర్గంలో పందొమ్మిది శాతం ఓటర్లు బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారు. ఈ ఒక్క ఉప ఎన్నిక ఫలితం రాబోయే సాధారణ ఎన్నికల్లో ఉత్తరాన ఉన్న ఓటరు అభివ్యక్తిని చూపింది. అది అక్కడితో ఆగకుండా మిగిలిన ప్రాంతాలపై ప్రభావం చూపే ప్రమాద సంకేతాన్ని సూచిస్తున్నది. ఈ ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల ఫలితాలన్నీ మొదటిసారి మోదీ బీజేపీ కాదని కాంగ్రెస్ పార్టీలో బలమైన నేతలు లేకున్నా ఆ పార్టీ బలపరుస్తున్నాయి. గుజరాత్ ఎన్నికల అనంతరం అభేద్యమైన మోదీ శరీరాన్ని అల్వార్, అజ్మీర్ ఫలితాలు శక్తివిహీనం చేశాయి.

రెండోసారి మోదీ గెలుస్తారా అని అందరూ అంచనా వేస్తున్నది వాస్తవమే. అయితే అందరూ అనుకుంటున్నట్టే మోదీ మరోసారి గెలువాల్సి ఉంది. అయితే మోదీ అతని మిత్రపక్షాల సామర్థ్యాలను నమ్ముకుంటున్నాడు. నిజానికి మోదీ యాభై స్థానాల కంటే ఎక్కువే కోల్పోతాడన్నది కనబడుతున్నది. ఎందుకంటే రెండు జాతీయ పార్టీలు పోటీపడనున్న ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీని తుడిచిపెట్టలేకపోవచ్చు. వాస్తవానికి మోదీ కూడా ఓటమి పాలు కావచ్చు. ఘోరంగా ఓడిపోవచ్చు. ఈ ప్రభావం ఢిల్లీ మొదలు మిగిలిన భారతదేశమంతా కనిపిస్తే దానికి కారణం మోదీ అధికార యంత్రాంగం ఈ విషయాన్ని తీక్షణంగా పరిశీలించలేదని అర్థం చేసుకోవాలి. వ్యాపారవేత్తలు ఎంతమాత్రం చెప్పుచేతుల్లో లేరని అనుకోవాలి. ఈ పరిణామాల ఫలితాలు కాలమే నిర్ణయిస్తుంది.



అది ఎంతటి రాజకీయ, ఆర్థిక ఒత్తిడిలో ఉన్నదో తెలుస్తున్నది. ఈ బడ్జెట్లు మోదీ ప్రభుత్వపు అశక్తతను బయటపెడుతున్నాయి. అయితే రాజకీయ ప్రాధాన్యాలే ఉన్నప్పటికీ ప్రభుత్వం కొన్ని ఉపకారాలు చేసిందని అర్థం చేసుకోవచ్చు. మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ కంపెనీలు, ప్రభుత్వరంగ బ్యాంకులు, వైద్య నియంత్రణలు తదితర అంశాల్లో వెలుగు కనిపిస్తున్నది.

కానీ బడ్జెట్ రోజు ఒక పెద్ద తప్పు నాటి వార్తల్లో బయటపడింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో రెవెన్యూ అంచనాల్లో భాగంగా విత్త ప్రణాళిక గురించి చెప్పారు. ఈ సందర్భంగా జీఎస్టీ కారణంగా పన్ను ఎగవేత తగ్గిందని ఫిబ్రవరి 1 నుంచి పన్నుల ఆదాయం సంతృప్తికంగా ఉందని తెలిపారు. కానీ అదేరోజే ఏం జరిగింది? రాష్ర్టాల మధ్య రవాణా అయ్యే వస్తువులను తూకం వేసేందుకు నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ రూపొందించిన వే బిల్ వ్యవస్థ అదేరోజు కుప్పకూలింది. జైట్లీ నేర్పిన మొదటి పన్ను ఎగవేత నిరోధక వ్యవస్థ అదే. వేబిల్ వెబ్‌సైట్ వైఫల్యంపై స్పందించిన కేంద్ర కస్టమ్స్, ఎక్సైజ్ బోర్డు ఎలక్ట్రానిక్

> జైట్లీ నేర్పిన మొదటి పన్ను ఎగవేత నిరోధక వ్యవస్థ అదే. వేబిల్ వెబ్‌సైట్ వైఫల్యంపై స్పందించిన కేంద్ర కస్టమ్స్, ఎక్సైజ్ బోర్డు ఎలక్ట్రానిక్ వే బిల్లుల జారీకి మరో తేదీని ఖరారు చేస్తామని, అప్పటినుంచే అది వర్తిస్తుందని సెలవిచ్చింది. ప్రభుత్వం చేపట్టే భారీ కార్యక్రమాలకు ఎంతటి సమర్థమైన మౌళిక వసతులు ఉన్నప్పటికీ అందులో చిన్న లోపమున్నా లక్ష్యం నెరవేరదు అన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. కానీ మోదీ హామీ ఇచ్చినట్లుగా ప్రభుత్వం వ్యవస్థాగతంగా సంస్కరణలు తీసుకురావటంలో అశక్తతను చూపుతున్నది.


ఈ వాస్తవం మోదీ, అమిత్‌షాలకు చాలాకాలం క్రితమే తెలుసని కచ్చితంగా చెప్పవచ్చు. వాస్తవానికి మనకు తెలువటానికి చాలాకాలం ముందే ఈ విషయం వారికి తెలుసు. దీన్ని దృష్టిలో ఉంచుకొనే వారి అనుయాయులు బడ్జెట్ ఎలా ఉండాలనే అంశాలను రూపొందించి ఉండవచ్చు. 2004లో వాజపేయి ప్రభుత్వం భారత్ వెలిగిపోతున్నది అనే నినాదం వల్ల ఎన్నికల్లో ఓడిపోయింది. ఇప్పుడు ఆ నీడలోనే గ్రామీణ బడ్జెట్‌ను రూపకల్పన చేశారని అనిపిస్తున్నది. కానీ విధానాలకు, కేటాయింపులకు అస్సలు సంబంధం లేని వ్యవసాయ కేంద్రీకృత బడ్జెట్‌ను చూశాం. ఓట్ల సాధనకోసం, గెలుపు కోసం మోదీ ప్రభుత్వం ఎంతగా ఆందోళనలో ఉన్నదో ఈ బడ్జెట్ తేటతెల్లం చేస్తున్నది.

దేశంలో మూడు దశాబ్దాల తర్వాత పూర్తి మెజారిటీతో ఏర్పడిన ప్రభుత్వం, అన్ని అనుకూలతలు ఉన్న ప్రభుత్వం ప్రకటిస్తున్న బడ్జెట్లలో వే బిల్లుల జారీకి మరో తేదీని ఖరారు చేస్తామని, అప్పటినుంచే అది వర్తిస్తుందని సెలవిచ్చింది. ప్రభుత్వం చేపట్టే భారీ కార్యక్రమాలకు ఎంతటి సమర్థమైన మౌళిక వసతులు ఉన్నప్పటికీ అందులో చిన్న లోపమున్నా లక్ష్యం నెరవేరదు అన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. కానీ మోదీ హామీ ఇచ్చినట్లుగా ప్రభుత్వం వ్యవస్థాగతంగా సంస్కరణలు తీసుకురావటంలో అశక్తతను చూపుతున్నది. పైన ఉదహరించిన వార్తాకథనాలు కేంద్ర ప్రభుత్వ రాజకీయ దుర్బలతను దాని పరిమితమైన దృష్టిని, కార్యక్రమాల అమలు సామర్థ్యాన్ని తెలుపుతున్నాయి. తాజా బడ్జెట్ వెనుక ఉద్దేశాలు, ప్రభుత్వ హామీలకు ప్రమాణంగా కనిపిస్తున్నాయి. ఈ బడ్జెట్ ప్రభుత్వం గతంలో చెప్పిన మాటలతో పోల్చితే చాలా బలహీనంగా, అసంబద్ధంగా ఉన్నది.

(www.rediff.com **సౌజన్యంతో..**)

తెలంగాణ ఆవిర్భావ ఫలాలు

విశ్లేషణ



విశ్వేశ్వర్ మంగళపల్లి



తెలంగాణ రాష్ట్రానికి ఒక కాపిటలిస్టు క్లాస్ కావాలో వద్దో నాకు తెలువదు గని, అన్నిరంగాల్లో విస్తరించగలిగే ఒక ఎంట్రప్రెన్యూరల్ క్లాస్ మాత్రం చాలా చాలా అవసరం. అత్యవసరం. (ఈ రెండిటికీ చాలా వ్యత్యాసం ఉన్నది)

నిన్న రాత్రి పదింటికి ఒక ఫోన్‌కాల్.. అన్నా నేను సురేష్‌రెడ్డి.. గుర్తుపట్టిన్రా?. రెడ్డికాలనీ, కుమార్‌పల్లి. మన హన్మకొండ. అజయ్, విజయ్, టేబుల్ టెన్నిస్ ఆడేది. గుర్తుపట్టినవా అన్నా? ప్రశ్నతోపాటుగా, గుర్తుతెప్పించే ప్రయత్నం.

ఇరువై ఐదేండ్ల స్మృతుల గనులలోంచి ఒక ముఖచిత్రం మెల్లగా బయటికి వచ్చింది. చామనఛాయ, నలుపు మధ్యలో ఒక షేడ్, నుదుట సిగరెట్‌తో కాల్చిన మరక, సౌమ్యంగా మాట్లాడే స్వభావంగల ఒక బక్కపలుచని పిల్లగాని ముఖచిత్రం అది.

ఆఁ.. ఆఁ.. సురేష్ ఎన్నాళ్లకు, బాగున్నవా?... ఇంకా ముఖచిత్రం మొత్తం గుర్తురాని సంశయం కొట్టొచ్చినట్టున్న గొంతుతో అడిగిన.

ఏమి లే అన్నా. ఇవాళ హన్మకొండలో మీ సిస్టర్ కలిస్తే, మీ నెంబర్ తీసుకొని ఫోన్‌జేస్తున్న. ఎట్లున్నావ్ అన్నా?

చాలా సంతోషం సురేష్, గుర్తుపెట్టుకొని కాల్ చేసినందుకు. చానా రోజులయ్యింది. నువ్వు అమెరికా పోయినావనుకున్న. ఎక్కడున్నావ్, ఏమిజేస్తున్నావ్. నిజంగా చానా రోజులయ్యింది. అంత మంచిదేనా?

అంత మంచిదే అన్నా.. మా బిడ్డ పెళ్లి అని ఫోన్‌జేస్తున్న. రావాలన్న

పెళ్లి చేసేంత పెద్ద బిడ్డ ఉన్నదా సురేష్?

అవునన్నా..ఇంజినీరింగ్ తర్వాత మనమంతా ఎటోళ్లు అటు బొయినం. టచ్‌లో లేరు. అజయ్ అన్న కెనడాలో సెటిల్ అయ్యిండు. విజయ్ టాటా డీలర్షిప్ తీసుకున్నడు. పెద్దోడు అయ్యిపోయిండు. ఇప్పటికీ మా గ్యాంగ్‌కు లీడర్ విజయ్

విజయ్ సంగతి ఎరికే.. ఒకసారి వరంగల్ భద్రకాళి గుడిల కలిసిండు. ఆ సాయింత్రం ఇంటికి కూడా వచ్చిండు.. 2015 అనుకుంట

నువ్వేం జేస్తున్నావ్ అన్నా.. ఢిల్లీకి బోయినవ్ అని తెలిసింది.

అవును సురేష్. ఢిల్లీ తర్వాత కొన్నిరోజులు బొంబాయిలో పనిచేసి అందరి తిరిగనే ఐటీ ఫీల్డ్‌లోకి వచ్చి. అటు ఇటు తిరిగి ఇప్పుడు బెంగళూరులో సెటిల్ అయ్యిన. ఇండిపెండెంట్‌గా ఉన్న.

మంచిదే అన్నా.. ఇండిపెండెంట్‌గా ఉండటం.

ఆ ఏమి మంచిదిలే సురేష్. దాంట్లో ఉండే కష్టాలు దాంట్లో ఉంటాయి. నువ్వేం జేస్తున్నవ్?

నాది ప్రెషర్ డై కాస్టింగ్ మోడల్స్ కంపెనీ ఉన్నదన్నా హైదరాబాద్‌లో.

వావ్.. ఎంత పెద్దగుంటాయేంది ఆపరేషన్స్? చిన్నప్పటి స్నేహితపు చనువు ఇచ్చిన ధైర్యంతో అడిగిన ప్రశ్న అనుకుంట.

ఒక 300 మంది ఉంటారన్న. 80 కోట్ల టర్నోవర్. ఎఫ్ఎంసీజీ కస్టమర్స్ అన్నా. ఇరువై యేండ్లు కష్టపడితే ఇక్కడికి వొచ్చిన.

వండర్ఫుల్ సురేష్!. అప్పుడు స్ఫురించింది ఒక ఆలోచన. అడుగాలా వద్దా అన్న సంశయంలో ఉన్న. ధైర్యం చేసి అడిగిన. నువ్వు ఒక ఎంట్రప్రెనేర్/ఇండస్ట్రియలిస్ట్ కదా. రాష్ట్రం వచ్చిన తర్వాత ఏమన్నా మార్పులు చూసినవా?. తెలంగాణ దురద. ఒక లోకల్ ఎంట్రప్రెనేర్‌ను అడిగే అవకాశాలు, అది కూడా రాష్ట్రావతరణ అటు ఇటు చూసిన లోకల్ ఎంట్రప్రెనేర్‌ను అడిగే అవకాశాలు చాలా అరుదు కదా.

ఇండస్ట్రిలిస్ట్ పెద్ద వర్డ్ అన్నా. నన్ను నేను ఒక ఎంట్రప్రెనేర్‌గా జూస్త.

అవును. ఈ మధ్యల మా దోస్తులు నలుగురు యూనిట్ పెట్టింద్రు. ఒక్క పైసా ఇయ్యలేదు. అన్ని మంచిగా జరిగినయి. లేబర్ లొల్లి కూడా చానా తగ్గింది. ఇదివరకు లెక్క ధర్నాలు లేవు, స్ట్రైకులు లేవు. ఇప్పుడు చానామట్టుకు ఇంటర్నల్ ప్రాబ్లమ్స్ ఉన్నాయి. వర్కర్స్ స్కిల్స్ పెంచాలంటే కష్టంగా ఉన్నది. మారడానికి రెడీగా లేరు.

మెల్లగా ముచ్చట అటు ఇటు పోయింది, కాబోయే అల్లుని పుట్టుపూ

> సౌమ్యంగా, సైలెంట్‌గా ఉండే గీ వరంగల్ పిల్లగాడు ఇంతదూరం వచ్చినాడని సంతోషమైంది. రాష్ట్రావతరణ తర్వాత వచ్చిన మార్పు గురించి పాజిటివ్‌గా మాట్లాడటం ఇంకా సంతోషం. అయితే ఇది ఒక వన్ ఆఫ్ అనుభవమా లేక, ఇట్లాంటి సురేషులు చాలామంది ఉన్నారా నాకు తెలువదు, ఉండాలని మాత్రం కోరుకుంటున్న.

మార్పులు వొచ్చినయన్న. మెయిన్ చేంజ్ పవర్ సిచ్యుయేషన్. అది ఒక పెద్ద రిలీఫ్. చానామందికి ఇది అర్థం కాదు. ఒక మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పవర్ లేకుండా, జెనెరేటర్ల మీద నడుపుడు అంత ఈజీ కాదు. ఇప్పుడు ఆ ప్రాబ్లమ్ లేదన్న. మూడు షిఫ్టులు నడిపే డిమాండ్ మా దగ్గర లేదు గని, ఒకవేళ ఆ డిమాండ్ వస్తే నడిపే భరోసా ఉన్నది. కస్టమర్ల దగ్గర మీరు ఆర్డర్లు ఇస్తే, సప్లై జేస్తమని జెప్తున్నం. మా కస్టమర్లంతా పెద్ద కంపెనీలు. యూనీలీవర్, పీజీ, కోల్గేట్ లాంటివి. వాళ్లకు మేము టయర్ త్రి సప్లై. వాళ్లు ఒకటికి రెండుసార్లు ఆలోచించి ఇస్తరు. కొంచెం అటు ఇటు అయితే. పీనలైజ్ చేస్తారు.

పవర్ కాకుండా ఇంకా ఎమన్నా మార్పులు చూసినవా సురేష్?

ఇదివరకంటే ఇండస్ట్రీ ఇన్స్‌పెక్షన్‌ల పేరుమీద సతాయించుడు బాగా తగ్గింది. ఇంకా కొంచం అప్పుడప్పుడు చూస్తాం. మీరు బెంగళూరులో ఉంటున్నారు కదా. నీకు టీఎస్ ఐపాస్ ఎరికేనా అన్నా?

ఎందుకు తెలువదు.. పెర్మిషన్స్‌కి సింగల్ విండో కదా?

ర్వోత్తరాల లాంటియి..

ఇగ ఉంటా అన్నా. మీకు లేటయ్యినట్టున్నది. పెండ్లికి తప్పకుండా రావాలె అని మల్లి గుర్తుచేసిండు సురేష్‌రెడ్డి. సరే అంటి. ఇంతలా వాట్సాప్‌లో పెండ్లి పత్రిక పంపించిండు. కంగ్రాట్స్ అండ్ థాంక్స్ అని మెసేజ్ పెడితే. రిటర్న్ మెస్సేజ్ ఒక థమ్స్ అప్ సింబల్ వచ్చింది.

సౌమ్యంగా, సైలెంట్‌గా ఉండే గీ వరంగల్ పిల్లగాడు ఇంతదూరం వచ్చినాడని సంతోషమైంది. రాష్ట్రావతరణ తర్వాత వచ్చిన మార్పు గురించి పాజిటివ్‌గా మాట్లాడటం ఇంకా సంతోషం. అయితే ఇది ఒక వన్ ఆఫ్ అనుభవమా లేక ఇట్లాంటి సురేషులు చాలామంది ఉన్నారా నాకు తెలువదు, ఉండాలని మాత్రం కోరుకుంటున్న.

ఇది కల్పితం ఏ మాత్రం కాదు. సురేష్‌రెడ్డితోని ఎవరన్నా డిటైల్‌గా మాట్లాడాలనుకుంటే ఆయన పర్మిషన్ తీసుకొని ఆయన నెంబర్ ఇయ్యడానికి నేను రెడీ.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

గుడ్లు పెడుతున్న బాలుడు!

- రెండేండ్లుగా 20 గుడ్లు పెట్టిన వైనం
- డాక్టర్లకు సైతం అంతుబట్టని వ్యవహారం



జకర్తా, ఫిబ్రవరి 22: కొన్ని సాధారణ ఘటన వార్తలను మనం పెద్దగా పట్టించుకోం. కొన్ని ఘటనలు మాత్రం జనాన్ని సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంటాయి. అలాంటి ఘటన ఒకటి ఇండోనేషియాలోని గోవా పట్టణంలో చోటుచేసుకున్నది. ఈ ప్రాంత వాసి అక్మల్ (14) అనే బాలుడు గుడ్లు పెడుతుండటం వైద్యులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. 2016 నుంచి ఇప్పటివరకు దాదాపు 20 గుడ్లు పెట్టినట్టు అక్మల్ తెలిపాడు. మల ద్వారం గుండా గుడ్లు వస్తున్నాయన్నాడు. సదరు గుడ్లను తెరిచి చూడగా అంతా తెల్లసొన లేదా మొత్తం పచ్చసొనతో ఉంటున్నాయని బాలుడి తండ్రి రుస్లి చెప్పారు. దీంతో బాలుడు తరుచుగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల వైద్యుల ఎదుట రెండు గుడ్లను పెట్టాడు. ఈ రెండేండ్లలో తమ కుమారుడు 20 గుడ్ల ను పెట్టాడని.. తొలిసారి పెట్టిన గుడ్డును తెరిచి చూడగా మొత్తం పచ్చసొన మాత్రమే ఉన్నదని రుస్లి చెప్పారు. బాలుడి తీరు వైద్యులకు అంతుబట్టడం లేదు. మానవ శరీరం నుంచి గుడ్లు రావడం అనేది అసాధ్యమని వైద్యులు అంటున్నారు. ఎవరో అక్మల్ మలద్వారంలో గుడ్లను బలవంతంగా పెడుతున్నట్టు అనుమానిస్తున్నామని దీన్ని తాము ప్రత్యక్షంగా చూడలేదన్నారు. వైద్యుల వాదనను రుస్లి ఖండించారు. అక్మల్ పరిస్థితిని అధ్యయనం చేయడానికి వైద్యులు అతడిని షేక్ యూసుఫ్ దవాఖానలో ఉంచారు.

సర్జరీ చేశాక పేషంట్ చనిపోయినా
17 లక్షల దవాఖాన బిల్లు!

- గుర్గావ్‌లో ఓ ప్రైవేటు హాస్పిటల్ దోపిడీ
- పోలీసులకు బాధితుడు ఫిర్యాదు



గుర్గావ్: మొన్న.. ఢిల్లీలో డెంగ్యూతో బాధపడుతున్న చిన్నారి చికిత్సకు రూ.15.8 లక్షల బిల్లు వసూలు చేసిందో దవాఖాన. నిన్న.. గర్భంలోని కవలలను బతికించడానికి శస్త్ర చికిత్స చేయాలంటే రూ.50 లక్షలు కావాలని, చివరకు ఇద్దరు చిన్నారులనూ పొట్టనబెట్టుకుంది మాక్స్ హాస్పిటల్. కార్పొరేట్ దవాఖానల ధనదాహానికి ఉదాహరణలు అనేకం. సర్జరీ విఫలమై మహిళ చనిపోయినా, రూ.17లక్షల బిల్లు వసూలు చేసిన గుర్గావ్‌లోని ఓ దవాఖాన సంగతి వెలుగుచూసింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే తన తల్లి మరణించారని ఆమె కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజస్థాన్‌లోని అల్వార్ వాసి సావిత్రీదేవి (67) అనారోగ్యంతో గతనెల 8న గుర్గావ్‌లోని కొలంబియా ఏషియా దవాఖానలో చేరారు. ఆమెను పరీక్షించిన వైద్యులు పిత్తాశయంలోని రాళ్ల తొలిగింపునకు సర్జరీ చేయాలని అన్నారు. మరునాడే ఆమెకు శస్త్రచికిత్స చేశారని సావిత్రీదేవి తనయుడు రాజేంద్రసింగ్ తెలిపారు. తామెలాంటి శస్త్రచికిత్స చేయలేదని దవాఖాన డాక్టర్ చైతన్య పతానియా చెప్పారు. 2017 ఆగస్టులోనే మ రో దవాఖానలో సావిత్రీదేవికి శస్త్రచికిత్స చేసి పిత్తాశయాన్ని తొలిగించారని, పిత్తవాహికలో చిక్కుకున్న ఒక్కరాయి తొలిగింపు నకు ఆమె చేరారని వైద్యులంటున్నారు. జనవరి 9న శస్త్ర చికిత్స తర్వాత తన తల్లి తీవ్రమైన కడుపునొప్పితో బాధపడినట్లు కుమారుడు తెలిపారు. మరో మూడు సర్జరీలు నిర్వహించిన వైద్యులు, తన తల్లిని ఐసీయూలో ఉంచారని ఆరోపించారు. కానీ తీవ్రమైన గుండెనొప్పితో జనవరి 26న తల్లి మరణించినట్లు చెప్పారు. దీంతో ఆయన జనవరి 27న పాలంవిహార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆరోగ్య శాఖ నివేదిక అందాక కేసు దర్యాప్తు చేపడతామని అధికారి విక్రమ్ నెహ్రా తెలిపారు.

నాలుగు ఫ్లాట్ల ఖరీదు రూ.240 కోట్లు!

- ముంబైలో కొన్న ఓ సంపన్న వ్యాపారి



ముంబై: ముంబైలో ఫ్లాట్ల ధరలు చాలా ఎక్కువ. ఒక చోట ఒక్కో ఫ్లాటు ఖరీదు రూ.60 కోట్లు పలికింది. తపారియా అనే ఓ సంపన్న వ్యాపారి కుటుంబీకులు అటు వంటి 4 ఫ్లాట్లను రూ.240 కోట్లకు కొన్నారు. 4,500 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఒక్కో ఫ్లాటులో చదరపు అడుగుకు రూ.1.2 లక్షల ధర పెట్టి కొన్నారు. ముంబై లోని నేపియన్‌సీ రోడ్‌లో 35 అంతస్తుల్లో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ టవర్‌లో 28 నుంచి 31 వరకున్న ఫ్లోర్లలో తపారియా ఫ్యామిలీ ఈ ఫ్లాట్లను బుక్ చేసుకున్నట్లు వారి తరఫు న్యాయవాద సంస్థ 'వాడియాగాంధీ' బుధవారం తెలిపింది. ముంబైలోని ప్రతిష్ఠాత్మక కిలీచంద్‌హౌస్ ప్యాలెస్ సమీపంలో ఈ టవర్ నిర్మిస్తున్నారు. తపారియా కుటుంబీకులకు లోగడ ఫెమీకేర్ అనే అంతర్జాతీయస్థాయి గర్భనిరోధక మందుల కంపెనీ ఉండేది. మూండేండ్ల క్రితం దానిని రూ.4,600 కోట్లకు అమ్మేశారు. ప్రస్తుతం ఖరీదైన ఫ్లాట్ల కొనుగోలుతో వార్తల్లోకి వచ్చారు.

కెనడా ప్రధాని విందుకు
ఖలిస్థాన్ ఉగ్రవాది!

- అత్వాల్‌ను ఆహ్వానించిన కెనడా రాయబారి
- పొరపాటు గ్రహించి చివరి నిమిషంలో ఆహ్వానం రద్దు
- వీసా జారీపై విచారణ చేపట్టిన భారత విదేశాంగశాఖ
- వేర్పాటువాదాన్ని సమర్థించబోమని ట్రూడో స్పష్టీకరణ


ముంబైలో బుధవారం కెనడా ప్రధాని సతీమణి సోఫీతో జస్పాల్ అత్వాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో గౌరవార్థం భారత్‌లో కెనడా హైకమిషనర్ గురువారం రాత్రి ఇచ్చిన విందుకు ఖలిస్థాన్ ఉగ్రవాది జస్పాల్ అత్వాల్‌కు ఆహ్వానం పంపడంపై పెను దుమారం చెలరేగుతున్నది. దీనిపై వివాదం తలెత్తడంతో కెనడా హైకమిషనర్ నాదిర్ పటేల్ నష్ట నివారణ చర్యలు చేపట్టారు. అత్వాల్‌కు పంపిన ఆహ్వానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. జస్టిన్ ట్రూడోతో ప్రధాని మోదీ శుక్రవారం భేటీ కానున్న నేపథ్యంలో ఈ వివాదం తలెత్తడం గమనార్హం. 'అత్వాల్‌కు పంపిన ఆహ్వానాన్ని హై కమిషన్ రద్దు చేసింది. ప్రధాని భద్రత అంశాలపై మేం బహిరంగంగా చర్చించం' అని కెనడా రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అయితే అత్వాల్ భారత్‌లోకి ఎలా ప్రవేశించారు? ఆయనకు వీసా ఎలా జారీ అయ్యిందన్న అంశాన్ని పరిశీలిస్తున్నట్లు భారత్ విదేశాంగశాఖ ప్రకటించింది. విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ మాట్లాడుతూ 'ఇందులో రెండు కోణాలు ఉన్నాయి. ఒకటి అత్వాల్‌కు ఆహ్వానం.. రెండోది వీసా జారీ. అత్వాల్‌ను పొరపాటున ఆహ్వానించామని కెనడా హైకమిషన్ తెలిపింది. ఇక వీసా ఎలా జారీ అయ్యిందన్న విషయమై ఇప్పుడే ఏమీ చెప్పలేను. దీనిపై పూర్తిగా విచారిస్తాం. అత్వాల్‌పై భారత్‌లో కేసులున్నాయా? లేదా? అనేదాన్ని బట్టి ఆయనను అరెస్ట్ చేసే అవకాశాలు ఉంటాయి' అని తెలిపారు. ఇదిలా ఉంటే సిక్కు ఉగ్రవాదుల నిషేధిత జాబితాలో అత్వాల్ పేరు లేదని కేంద్ర హోంశాఖ పేర్కొన్నది. అంతకుముందు ముంబైలో ట్రూడో భార్య సోఫీ ట్రూడోతో అత్వాల్ దిగిన ఫొటోలు వెలుగు చూడటంతో అయనకు ఆహ్వానం పంపిన విషయం బయటపడింది. దీనిపై జస్టిన్ ట్రూడో స్పందిస్తూ ఖలిస్థాన్ ఉగ్రవాది అత్వాల్‌కు ఆహ్వానం పంపడం తీవ్రమైన విషయమన్నారు. తమ దేశం భారత విభజనకు మద్దతు ఇవ్వబోదని తేల్చి చెప్పారు. 1986లో కెనడాలోని వాంకోవర్‌లో పర్యటిస్తున్న అప్పటి పంజాబ్ మంత్రి మాల్కియత్ సింగ్ సిద్ధుపై హత్యాయత్నం కేసులో అత్వాల్‌కు 20 ఏండ్ల జైలుశిక్ష పడింది. తాజా వివాదంపై అత్వాల్ స్పందిస్తూ.. దశాబ్దాల క్రితం జరిగిన నేరం, దానికి పడిన శిక్ష గురించి ఇప్పుడు చర్చ లేవనెత్తడం సరికాదని వ్యాఖ్యానించారు.

షాద్‌మన్ చౌక్‌కు భగత్‌సింగ్ పేరు పెట్టాలి

- పాకిస్థాన్ కోర్టులో పిటిషన్

లాహోర్: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్‌ను బ్రిటిష్ పాలకులు ఉరితీసిన ప్రదేశానికి ఆయన పేరు పెట్టాలని, అక్కడ భగత్‌సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ పాకిస్థాన్‌లోని లాహోర్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను భగత్‌సింగ్ మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ ఇంతియాజ్ రషీద్ ఖురేషి దాఖలు చేశారు. ఈ విషయమై గతంలోను పిటిషన్ దాఖలైందని తెలిపారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ రెండు పిటిషన్‌లను జతచేయాలని, వీటిపై వచ్చేనెల 5న విచారణ జరుపుతామని తెలిపారు.

2007 అల్లర్ల కేసులో యూపీ సీఎంకు ఊరట


న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో 2007లో జరిగిన అల్లర్లకు కారణమని ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు అలహాబాద్ హైకోర్టులో ఊరట లభించింది. ఆదిత్యనాథ్ పాత్రపై పునర్విచారణ చేపట్టాలన్న విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించింది.ఈ ఘటనలో ఆదిత్యనాథ్ పాత్రపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని పిటిషనర్లు పర్వేజ్ పర్వాజ్, అసద్ హయత్ 2008లో కోర్టుకు విజ్ఞప్తిచేశారు. 2007 మతఘర్షణల్లో ఓ వ్యక్తి మృతిచెందగా, శాంతికి విఘాతం కలిగించారనే ఆరోపణలపై అప్పటి ఎంపీ ఆదిత్యనాథ్ అరెస్టయ్యారు.

దవాఖాన నుంచి పారికర్ డిశ్చార్జి

పనాజీ: గోవా సీఎం మనోహర్ పారికర్ వారం రోజుల చికిత్స తర్వాత దవాఖాన నుంచి డిశ్చార్జి అయ్యారు. గురువారం అసెంబ్లీకి హాజరై బడ్జెట్ సమావేశంలో పాల్గొన్నారు. అయన క్లోమగ్రంధి వ్యాధితో బాధపడుతూ ఈ నెల 15న ముంబైలోని లీలావతి దవాఖానలో చేరారు. ఆయన అసెంబ్లీలో క్యాబినెట్ నిర్వహించారు. మధ్యాహ్నం మూడుగంటలకు బడ్జెట్ సమావేశాలను ప్రారంభించారు. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్నప్పుడు పారికర్ చాలా నీరసంగా ఉన్నారు. ఆయన ఐదునిమిషాలే ప్రసంగించారు. అనారోగ్యంతో సభలో ఉండలేక పోతున్నానని చెప్పారు. తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేశారు.

ఇసుమంతైనా తగ్గని అవినీతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ప్రభుత్వాలు మారుతున్నా మన దేశంలో అవినీతి ఇసుమంతైనా తగ్గడం లేదు. పైగా ఏటికేడు పెరుగుతూ ఉన్నది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటన్నేషనల్ సంస్థ చెప్తున్న కఠిన వాస్తవమిది. జర్మనీకి చెందిన ఈ స్వచ్ఛంద సంస్థ ఏటా ప్రపంచదేశాల్లో అవినీతిపై సర్వే నిర్వహించి 'అవినీతి సూచీ' పేరుతో జాబితాను విడుదల చేస్తుంది. ఈ ఏడాది ప్రభుత్వ రంగంలో అవినీతి, మీడియా స్వేచ్ఛ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని 180 దేశాల్లో సర్వే చేసి 'అవినీతి సూచీ-2017' పేరుతో జాబితాను విడుదల చేసింది. ఇందులో భారత్‌కు 81వ స్థానం లభించింది. 2016లో విడుదల చేసిన 176 దేశాల జాబితాలో భారత్ 79వ స్థానంలో ఉండగా ఈసారి ఏకంగా రెండు స్థానాలు దిగజారి ఆసియా-పసిఫిక్ రీజియన్ లోనే చెత్తరికార్డును నమోదు చేసింది.



- న్యూజిలాండ్ 89 పాయింట్లతో తొలి స్థానంలో నిలిచి రికార్డు సాధించింది. డెన్మార్క్ 88 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది.
- సోమాలియా 9 పాయింట్లతో అట్టడుగున నిలువగా, దక్షిణ సూడాన్ (12పాయింట్లు), సిరియా (14 పాయింట్లు) చివరి వరుసలో నిలిచాయి.
- చైనా 41 పాయింట్లతో 77వ స్థానంలో నిలిచింది.
- రష్యా కేవలం 29 పాయింట్లు సాధించి 135వ స్థానంలో నిలిచింది.
- అమెరికా 75 పాయింట్లతో 16వ స్థానంలో, బ్రిటన్ 82 పాయింట్లతో ఎనిమిదోస్థానంలో నిలిచింది.
- భూటాన్ మినహా మిగతా పొరుగుదేశాలు పారదర్శక పాలనకు దూరం. చైనా, భూటాన్ కన్నా భారత్ వెనుకబడి ఉండగా దాయాది పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, మయన్మార్ కన్నా మెరుగ్గా ఉంది.
- భూటాన్ 67 పాయింట్లతో 26వ స్థానంలో నిలిచి పారదర్శక పాలనలో దక్షిణాసియాలో ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నది.
- పాక్ 32 పాయింట్లతో 117వ , శ్రీలంక 38 పాయింట్లతో 91వ, మయన్మార్ 30 పాయింట్లతో 130వ, బంగ్లాదేశ్ 28 పాయింట్లతో 143వ స్థానంలో ఉన్నాయి.
- బ్రిక్స్ కూటమిలో దక్షిణాఫ్రికా 71వ ర్యాంకుతో తొలి, ఆ తర్వాత స్థానాల్లో చైనా(77), భారత్ (80), బ్రెజిల్ (96), రష్యా (135) నిలిచాయి.
- ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో పాలన పరంగా దేశాల మధ్య చాలా వ్యత్యాసం ఉంది. సగం దేశాలు పారదర్శక పాలన అందిస్తూ జాబితాలో తొలి 50 ర్యాంకుల్లో నిలిచాయి.



భారత్‌కు 40 పాయింట్లు

సంస్థ సభ్యులు అవినీతిని కొలిచేందుకు 0 నుంచి 100 పాయింట్ల స్కేలును కొలమానంగా తీసుకున్నారు. 0 వచ్చిన దేశాన్ని అత్యంత అవినీతిమయ దేశంగా, 100 పాయింట్లు వచ్చిన దేశాన్ని అవినీతి రహితంగా పరిగణించారు. ఇందులో భారత్‌కు గత ఏడాది మాదిరిగానే 40 పాయింట్లు వచ్చాయి.

మీడియా స్వేచ్ఛను హరించడం వల్లే..

మీడియా స్వేచ్ఛను హరించడం, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలపై ఆంక్షల వల్లే అవినీతి పెరుగుతున్నదని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ తెలిపింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని పలు దేశాల్లో అవినీతిని ప్రశ్నించే జర్నలిస్టులు, ప్రతిపక్ష నేతలు, న్యాయాధికారులు, నిఘా సంస్థల అధికారుల ప్రాణాలకు ముప్పు పొంచిఉన్నదన్నది. కొన్ని దేశాల్లో హత్యలూ జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా భారత్, ఫిలిప్పీన్స్, మాల్దీవుల్లో పరిస్థితి ఆందోళనకరమన్నది. ఈ దేశాలు అవినీతి జాబితాలో ముందున్నాయని, మీడియాకు స్వేచ్ఛ తక్కువగా ఉన్నదని, పాత్రికేయుల హత్యల్లో ముందువరుసలో ఉన్నాయన్నది. గత ఆరేండ్లలో ఈ దేశాల్లో అవినీతిపై కథనాలు రాస్తున్న 15 మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారని జర్నలిస్టుల సంరక్షణ కమిటీ (సీపీజే) తెలిపింది. సీపీజే నివేదిక ప్రకారం గత ఆరేండ్లలో జరిగిన పాత్రికేయుల హత్యల్లో 90% 45 పాయింట్ల కన్నా తక్కువ వచ్చిన దేశాల్లోనే జరిగాయి.



రాజకీయ ప్రవేశానికి ముందు రజినీతో రహస్య భేటీ

- వెల్లడించిన కమల్ హాసన్



చెన్నై, ఫిబ్రవరి 22: రాజకీయ ప్రవేశానికి ముందు తన సహనటుడు, స్నేహితుడు సూపర్‌స్టార్ రజినీకాంత్‌తో తాను రహస్యంగా సమావేశమయ్యానని విలక్షణ నటుడు, 'మక్కళ్ నీది మయ్యం' పార్టీ వ్యవస్థాపకుడు కమల్‌హాసన్ వెల్లడించారు. ఈ భేటీలో తాను రాజకీయాల్లోకి రావాలని అనుకుంటున్నట్టు రజినీకాంత్‌తో చెప్పానని తెలిపారు. భవిష్యత్తులో తాము రాజకీయ ప్రత్యర్థులుగా మారినప్పటికీ పరస్పర గౌరవభావాన్ని వీడకూడదని ఇద్దరం నిర్ణయించుకున్నామని పేర్కొన్నారు. కమల్‌హాసన్ బుధవారం తమిళనాడులోని మధురైలో 'మక్కళ్ నీది మయ్యం' పార్టీని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది డిసెంబర్‌లో తాను రాజకీయాల్లోకి ప్రవేశిస్తానని సూపర్‌స్టార్ రజినీకాంత్ ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో తమిళ వార పత్రిక ఆనంద వికటన్ పత్రికకు రాసిన వ్యాసంలో కమల్ ఈ విషయాలను వెల్లడించారు. పూనమల్లి పట్టణ శివార్లలో 'బిగ్‌బాస్' కార్యక్రమం షూటింగ్ జరుగుతున్నప్పుడు ఈ సమావేశం జరిగిందని వివరించారు. రజినీకాంత్ నటిస్తున్న 'కాలా' సినిమా షూటింగ్ కూడా అదే ప్రాంతంలో ఉండటంతో తాము సమావేశమయ్యామని తెలిపారు.

ఆప్ ఎమ్మెల్యేలకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

- బీజేపీ ఏజంట్‌గా లెఫ్టినెంట్ గవర్నర్: ఆప్
- సమావేశాల బహిష్కరణకు అధికారుల నిర్ణయం



న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్‌పై దాడి కేసులో అరెస్టయిన ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలు అమానతుల్లాఖాన్, ప్రకాశ్ జార్వాల్‌లకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఢిల్లీలోని మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ షెఫాలీ బర్నాలా టాండన్ ఆదేశాలు జారీ చేశారు. వారి బెయిల్ పిటిషన్లపై ఆదేశాలను శుక్రవారానికి రిజర్వు చేశారు. వారికి విధించిన ఒక రోజు కస్టడీ ముగిసి పోవడంతో పోలీసులు గురువారం వారిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. కాగా, ఢిల్లీ మంత్రి ఇమ్రాన్ హుస్సేన్, ఢిల్లీ డైలాగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు ఆశీష్ ఖేతాన్‌లపై దాడిపై తమ ఫిర్యాదులపై స్పందించకుండా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని ఆప్ ఆరోపించింది. సీఎస్ అన్షు ప్రకాశ్‌పై దాడి ఘటనలో సీఎం కేజ్రీవాల్ క్షమాపణ చెప్పే వరకు సీఎం, మంత్రుల సమావేశాలకు హాజరు కాబోమని ప్రభుత్వాధికారులు పునరుద్ఘాటించారు. మంత్రుల 'విశ్వాస ఉల్లంఘన'ను నిరసిస్తూ ప్రతి రోజూ మధ్యాహ్నం 1.30 గంటలకు మౌనం పాటించాలని నిర్ణయించామని ఐఏఎస్ అధికారుల సంఘం తెలిపింది.

టీచర్ల చేతికి తుపాకులు!

- పాఠశాలల్లో కాల్పుల ఘటనలను అడ్డుకోవటానికి ట్రంప్ పరిష్కారం
- ఫ్లోరిడా బాధితులకు పరామర్శ

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: తుపాకికి తుపాకితోనే సమాధానం చెప్పాలని, హింసను హింసతోనే ఎదుర్కోవాలని ట్రంప్ నిర్ణయానికొచ్చారు. తమదేశంలోని పాఠశాలల్లో ఉన్మాదులు కాల్పులు జరిపి విద్యార్థులను పొట్టనపెట్టుకుంటున్న నేపథ్యంలో.. ఏకంగా టీచర్లకే తుపాకులను అందజేయాలని ట్రంప్ భావిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయనే గురువారం ట్విట్టర్‌లో వెల్లడించారు. 'స్కూళ్లలో కొందరు ఉపాధ్యాయులకు సైనిక శిక్షణనిచ్చి, రహస్య ఆయుధాలను అందజేసే అవకాశాల్ని పరిశీలించాల్సి ఉంది. దేశంలోని ఉపాధ్యాయుల్లో 20 శాతం మందికి ఈ విధంగా ఆయుధాలు ఇచ్చినా కూడా.. పాఠశాలల్లో కాల్పుల ఘటనలను సమర్థవంతంగా అడ్డుకోవటానికి వీలవుతుంది. సాధారణంగా పాఠశాలల్లో కాల్పుల ఘటనలు సగటున మూడు నిమిషాలపాటు చోటుచేసుకుంటున్నాయి. విషయం తెలుసుకొని పోలీసులు అక్కడికి చేరుకోవటానికి 5 నుంచి 8 నిమిషాలు పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా సైనిక శిక్షణనిచ్చిన టీచర్లు ఉంటే.. పోలీసులు వచ్చేలోపే అప్పటికప్పుడే సమస్యను పరిష్కరిస్తారు. ఒక పాఠశాలలో ఆయుధ శిక్షణ పొందిన పలువురు టీచర్లు ఉన్నారని తెలిస్తే.. ఏ ఉన్మాది కూడా ఆ పాఠశాలలో కాల్పులకు తెగబడే సాహసం చేయడు. అంతే సమస్య పరిష్కారం అయిపోయినట్లే!' అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాలో పెరుగుతున్న తుపాకి హింసను అడ్డుకోవటానికి కొన్ని కఠిన చర్యలు తీసుకోనున్నట్లుగా ఆయన తెలిపారు. తుపాకులను కొనుగోలు చేసే వ్యక్తి మానసిక ఆరోగ్యాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవటం, తుపాకి కొనుగోలు చేసే వ్యక్తుల కనీస వయసును 21కి పెంచటం, బంప్‌స్టాక్‌ల విక్రయంపై నిషేధం విధించటం వంటి అంశాలను కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. టీచర్లకు తుపాకులివ్వాలన్న ప్రతిపాదనపై విమర్శలు రావటంతో, తాను అలా అనలేదని, ప్రత్యేక శిక్షణ ఇచ్చిన తర్వాతే ఆయుధాలను అందించే అంశాన్ని పరిశీలించాల్సి ఉన్నదని ట్రంప్ వివరణ ఇచ్చారు. మరోవైపు, ఫ్లోరిడా కాల్పుల ఘటనలో ప్రాణాలతో బయటపడిన విద్యార్థులు, గాయపడిన వారితో, తల్లిదండ్రులతో ట్రంప్ వైట్‌హౌస్‌లో గురువారం సమావేశమయ్యారు. స్కూళ్లలో మరోసారి ఇటువంటి ఘటన జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. దీనిపై ఒక దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు.

'యాక్ట్ ఈస్ట్ పాలసీ' త్వరలో సాకారం

- ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ప్రధాని మోదీ



కోహిమా, ఫిబ్రవరి 22: ఆగ్నేయాసియా దేశాలతో ఈశాన్య రాష్ట్రాలను అనుసంధానించేందుకు తాము తీసుకొచ్చిన యాక్ట్ ఈస్ట్ పాలసీ త్వరలో సాకారం కానున్నదని ప్రధాని మోదీ తెలిపారు. తద్వారా ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి వేగవంతం కానున్నదని చెప్పారు. ఈశాన్య ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని పేర్కొన్నారు. గురువారం ఆయన నాగాలాండ్‌లోని త్యూన్‌సాంగ్ పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. నాగాలాండ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బలమైన, సుస్థిరమైన ప్రభుత్వం అవసరమని చెప్పారు. నాలుగేండ్లలో నాగాలాండ్‌లో 500 కిలోమీటర్ల జాతీయ రహదారులను అభివృద్ధి చేశామని, రూ.10,000 కోట్లతో రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నామని తెలిపారు. స్మార్ట్‌సిటీగా కోహిమా అభివృద్ధికి రూ.1800 కోట్లను ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27న జరుగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-ఎన్‌డీపీపీ కలిసి పోటీచేస్తున్నాయి.

సుప్రీం ధర్మాసనాల మధ్య విభేదాలు

మరోసారి బయటపడిన న్యాయమూర్తుల అసమ్మతి ▪ చీఫ్‌జస్టిస్ బెంచ్‌కు చేరిన భూసేకరణ కేసుల వివాదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మధ్య అసమ్మతి మరోసారి బయటపడింది. తాజాగా వివిధ ధర్మాసనాల మధ్య కేసుల విషయంలో భేదాభిప్రాయాలు తలెత్తాయి. చివరకు ఈ వ్యవహారం ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా వద్దకు చేరింది. భూసేకరణకు సంబంధించిన కేసులను కొంతకాలం పెండింగ్‌లో పెట్టాలంటూ బుధవారం ఓ ధర్మాసనం జారీ చేసిన ఆదేశాలపై మరో రెండు ధర్మాసనాలు అభ్యంతరం తెలిపాయి. ఈ మేరకు జస్టిస్ అరుణ్‌మిశ్రా, జస్టిస్ ఏకే గోయల్ నేతృత్వంలోని ధర్మాసనాలు చీఫ్‌జస్టిస్‌కు గురువారం ఫిర్యాదు చేశాయి. తమ ముందున్న భూసేకరణ కేసులపై ఏదో ఒక నిర్ణయం చెప్పాల్సిందిగా సీజేఐని కోరాయి.

భూసేకరణ కేసులకు సంబంధించి 2014లో జస్టిస్ మదన్‌బీ లోకూర్, కురియన్ జోసెఫ్, ఆర్‌ఎం లోధాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈనెల 8న జస్టిస్‌లు అరుణ్‌మిశ్రా నేతృత్వంలోని జస్టిస్ ఆదర్శ్ గోయల్, శంతనగౌడార్‌లతో కూడిన ధర్మాసనం రద్దు చేసింది. బుధవారం ఇలాంటిదే మరో భూసేకరణ కేసు జస్టిస్‌లు మదన్‌బీ లోకూర్, కురియన్ జోసేఫ్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. 2014లో త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలుంటే విస్తృత ధర్మాసనానికి దానిని సిఫారసు చేయాలేగాని, మరో త్రిసభ్య ధర్మాసనం ఆ తీర్పును ఎలా కొట్టివేస్తుందని ఈ ధర్మాసనం ప్రశ్నించింది. సుప్రీంకోర్టు మొత్తం ఒకేలా వ్యవహరించాలే తప్ప.. ఇలా చేయడాన్ని తాను ఏమాత్రం సహించబోనని జస్టిస్ జోసెఫ్ కురియన్ మండిపడ్డారు. దీంతో భూసేకరణ కేసులకు సంబంధించి స్పష్టత వచ్చేవరకు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు ఎలాంటి భూసేకరణ కేసులనూ విచారించకూడదని పేర్కొంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై అభ్యంతరం వ్యక్తంచేసిన రెండు ధర్మాసనాలు గురువారం సీజేఐకి ఫిర్యాదు చేశాయి. సుప్రీంకోర్టులో బాధాకరమైన పరిస్థితి నెలకొందని వారు పేర్కొన్నారు. మరో ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి రెండు ధర్మాసనాలు వెలువరించిన పరస్పర విరుద్ధ తీర్పులపై తుది నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ వివాదం నేపథ్యంలో సీజేఐ ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారన్నది ఆసక్తికరంగా మారింది.

హాదియా వివాహాన్ని కేరళ హైకోర్టు గుర్తించలేదా?: సుప్రీంకోర్టు



లవ్ జిహాద్ కేసు మార్చి 8కి వాయిదా

కేరళలో లవ్ జిహాద్ కేసుపై సుప్రీంకోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. దీనిపై సమగ్ర విచారణ జరిగిందా? ఇష్టపూర్వకంగా జరిగిన హాదియా-షఫీన్‌జహాన్ వివాహాన్ని కేరళ హైకోర్టు గుర్తించిందా, లేదా? అని ప్రశ్నించింది. వివాహం ఇద్దరి ఇష్టాఇష్టాలపై ఆ ధారపడి ఉంటుందని చీఫ్‌జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం అన్నది. తాను స్వేచ్ఛగానే నిర్ణయం తీసుకుని ఇస్లాంలోకి మారానని, దీం ట్లో జహాన్ ప్రమేయం లేదని హాదియా న్యాయస్థానానికి అఫిడవిట్ సమర్పించారు. షఫీన్ జహాన్ సరైనవ్యక్తి కాదని, మోసగించి పెండ్లి చేసుకున్నాడని హాదియా తండ్రి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపా రు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఆమె వివాహంపై మేమేమీ మాట్లాడలేం. తాను ఇష్టపూర్వకంగా పెండ్లి చేసుకున్నట్లు అంటున్న ఆమె మాటలు నిజమైనవా, కాదా అని కోర్టు తేల్చలేదు. ఆమె నిర్ణయాన్ని తప్పుబట్టడం అసాధ్యమన్నది. కేసు తదుపరి విచారణను వచ్చేనెల 8కి వాయిదా వేసింది.

రాజకీయ నేతలు దేవుళ్లు కాదు: బాంబే హైకోర్టు

ముంబై: రాజకీయ నేతలు దేవుళ్లు కాదని, చట్టానికి అతీతులు కారని బాంబే హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. మడ అడవుల ఆక్రమణపై ఇద్దరు స్థానిక కార్పొరేటర్లపై కేసులు నమోదు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మడ అడవుల పరిరక్షణకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని పేర్కొంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం గురువారం విచారించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ బీజేపీ కార్పొరేటర్ పరశురాం మాత్రే, శివసేన కార్పొరేటర్ అనిత పాటిల్ మడ అడవులను నరికి కార్యాలయం, బంగ్లా నిర్మించడానికి చర్యలు ప్రారంభించారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు.

'పద్మావత్'లో 'సతి'పై దాఖలైన పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: 'పద్మావత్' సినిమాలో 'సతి' దురాచారాన్ని పెద్దదిగా చేసి చూపిన నిర్మాత, దర్శకుడిపై చర్యలు తీసుకోవాలని దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. సతీసహగమనం దురాచారాన్ని ప్రశంసిస్తున్నట్లుగా చూపారని, ఇలాంటి దృశ్యాలను తొలగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని సామాజిక ఉద్యమకారుడు స్వామి అగ్నివేష్ ఢిల్లీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని విచారించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గీతా మిట్టల్‌నేతృత్వంలోని ధర్మాసనం సినిమాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)ని సంప్రదించాలని పిటిషన్‌దారుకు సూచించింది.



హైదరాబాద్ కమిషనరేట్‌లో హవాలా కేసు వివరాలను వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్‌రావు

గుజరాతీ గల్లీలో హవాలా దందా!

ఢిల్లీలో చెల్లించేందుకు ఇక్కడి ఏజెంట్‌కు నగదు


నిర్మాణ సంస్థకు చెందిన రూ.27.9 లక్షలు స్వాధీనం

సంస్థ సీనియర్ మేనేజర్, ఇద్దరు ఏజెంట్లు అరెస్ట్ • పరారీలో ప్రధాన సూత్రధారి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కోఠీలోని గుజరాతీ గల్లీ అడ్డాగా సాగుతున్న హవాలా దందాను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించారు. గురువారం ఓ నిర్మాణ సంస్థకు చెందిన భారీ నగదును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు. హవాలా ద్వారా డబ్బు మార్పిడి చేస్తున్నారని హైదరాబాద్ మధ్యమండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారం ప్రకారం కోఠి గుజరాతీ గల్లీలోని కృష్ణా మొబైల్ దుకాణంలో సోదాలు జరిపారు. రూ.27.90 లక్షల నగదు ఉన్నట్టు గుర్తించి సరైన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. అక్కడున్న డీ మధుసుదన్ ప్రసాద్, కిషోర్‌కుమార్, సోహన్‌లాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా హవాలా దందా బయటికి వచ్చింది. మాదాపూర్ కావూరి హిల్స్‌లోని కేఎన్ఆర్ నిర్మాణ సంస్థలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్న మధుసుదన్ ప్రసాద్ నగదును హవాలా రూపంలో ఢిల్లీకి పంపేందుకు ఏజెంట్స్ సోహన్‌లాల్, కిషోర్‌కుమార్‌ను సంప్రదించినట్టు గుర్తించారు. లక్షకు 0.6 నుంచి 0.8 శాతం కమీషన్ మీద దందా చేస్తున్నట్టు నిందితులు తెలిపారు. ఈ మేరకు నగదును తదుపరి విచారణ కోసం ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించినట్టు సీపీ వివరించారు. కేఎన్ఆర్ నిర్మాణ సంస్థ నిర్వాహకులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ హవాలా దందా ప్రధాన సూత్రధారిని బల్వంత్ సింగ్‌గా గుర్తించినట్టు చెప్పారు. రాజస్థాన్‌కు చెందిన బల్వంత్ సింగ్ హైదరాబాద్‌కు వలస వచ్చి అశోక్‌బజార్‌లో ఉంటున్నాడు. గాజుల దుకాణం పెట్టి నష్టపోయాడు. తర్వాత ఢిల్లీకి చెందిన విక్రమ్, ముంబైకి చెందిన శంకర్, కమల్‌తో పరిచయం ఏర్పడగా వారి నుంచి హవాలా దందా గురించి తెలుసుకున్నాడు. స్వయంగా కోఠి, గుజరాతీ గల్లీ, అశోక్ బజార్, గౌలిగూడ ప్రాంతాల్లో ఏజెంట్లను పెట్టుకొని హవాలా దందాను ప్రారంభించాడు. దేశంలోని మెట్రోపాలిటన్ నగరాల్లో ఉన్న ఇతర ఏజెంట్లతో నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొని దందాను విస్తరించాడు. దేశంలోని ఎక్కడికైనా ఐదు నిమిషాల్లో డబ్బు పంపగలడని, వాట్సప్ ద్వారా సంప్రదింపులు జరుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు.

కాలుష్యజలాలను శుద్ధి చేసి తీవ్రత తగ్గించవచ్చు

- సీఎస్ఐఆర్ ఐఐసీటీ శాస్త్రవేత్త శ్రీధర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శ్రీధర్

ఘట్‌కేసర్: రసాయన పరిశ్రమల నుంచి వెలువడే నీటిని శుద్ధి చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని సీఎస్ఐఆర్ ఐఐసీటీ శాస్త్రవేత్త శ్రీధర్ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం రసాయన నీటిని శుద్ధి చేసే విధానంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యజలాలతో భూమిలో ఫ్లోరైడ్ నీటి శాతం పెరుగుతున్నదన్నారు. నల్లగొండ, ఏపీలోని ప్రకాశం జిల్లాల్లో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉన్నదన్నారు. పరిశ్రమల నుంచి వెలువడే నీటిని ఎలా శుద్ధి చేయాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ కేఎస్ రావు, హెచ్‌వోడీ ముకుందవాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరో స్టీల్ బ్రిడ్జికి బల్దియా గ్రీన్‌సిగ్నల్

నల్లగొండ క్రాస్‌రోడ్స్-ఒవైసీ జంక్షన్ మధ్య రూ.523 కోట్లతో నిర్మాణం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నల్లగొండ క్రాస్‌రోడ్డు నుంచి ఒవైసీ జంక్షన్ వరకు నాలుగు కిలో మీటర్ల మేర నాలుగు లేన్ల స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి జీహెచ్ఎంసీ స్థాయీసంఘం గురువారం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.523.37 కోట్ల అంచనా వ్యయంతో దీనిని నిర్మించనున్నారు. నల్లగొండ క్రాస్‌రోడ్స్ నుంచి సైదాబాద్, ఐఎస్ సదన్ మీదుగా ఒవైసీ జంక్షన్ వరకు నిర్మించనున్న ఈ వంతెన సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఇప్పటికే సిద్ధమైంది. తాజాగా స్థాయీసంఘం కూడా ఆమోదం తెలుపడంతో ప్రభుత్వం నుంచి పరిపాలనా అనుమతులు తీసుకొని టెండర్ల ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నది. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే సంతోష్‌నగర్, ఐఎస్ సదన్, మాదన్నపేట్, సైదాబాద్, చెంచల్‌గూడ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గిపోయే అవకాశం ఉన్నది. అత్యంత రద్దీ మార్గం కావడంతో ఇక్కడ ట్రాఫిక్‌కు ఎక్కువరోజులు ఇబ్బందులు ఎదురుకాకుండా త్వరితగతిన పూర్తిచేసేందుకు స్టీల్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రతిపాదించినట్టు అధికారులు తెలిపారు. ప్రభుత్వం నుంచి పరిపాలనా అనుమతులు వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులు చేపడుతామని అధికారులు పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ఇందిరాపార్కు-వీఎస్‌టీ మార్గంలో త్వరితగతిన ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తిచేసేందుకు కూడా స్టీల్ బ్రిడ్జిని నిర్మించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి ప్రణాళిక(ఎస్ఆర్డీపీ)లో భాగంగా సుమారు రూ. 21 వేల కోట్ల అంచనా వ్యయంతో నగరంలో పెద్ద ఎత్తున ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపడుతున్నారు. మొదటిదశలో చేపట్టిన అయ్యప్ప సొసైటీ అండర్‌పాస్‌ను ఇప్పటికే ప్రారంభించారు. ఎల్బీనగర్, మాదాపూర్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో చేపట్టిన పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.



వాచీ @ 2,60,00,000!

వజ్రాలు, ప్లాటినం, వైట్‌గోల్డ్ మిశ్రమంతో తయారైన ఈ వాచీ ధర ఎంతో తెలిస్తే మతి పోవాల్సిందే. ప్రముఖ సినీనటి శ్రద్ధాదాస్ ధరించిన ఈ వాచీ ఖరీదు అక్షరాలా రూ.2.6 కోట్లు! ప్రపంచ ప్రఖ్యాత చొపార్డ్ సంస్థ హైదరాబాద్‌లో తన ఉత్పత్తులను తొలిసారిగా ప్రవేశపెట్టింది. గురువారం జూబ్లీహిల్స్‌లోని కమల్‌వాచ్ సెంటర్ లక్సరీయాలో శ్రద్ధాదాస్ చేతుల మీదుగా సరికొత్త ప్రీమియం 'లీ హెయురే డు డైమంట్' వాచీలను విడుదల చేశారు. 612 వజ్రాలు, 160 గ్రాముల వైట్‌గోల్డ్‌తో రూపొందించిన ఈ వాచీతోపాటు పలురకాల డిజైనర్ వాచీలను అందుబాటులో ఉంచినట్టు చోపార్డ్ ఇంటర్నేషనల్ సేల్స్ మేనేజర్ జేవియర్ లీజర్ తెలిపారు. **- బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ**

మనది సాహిత్య ఉద్యమ గడ్డ

- తెలంగాణ చైతన్యం ప్రపంచ సాహిత్యాన్ని ప్రభావితం చేసింది
- రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి
- నిజాం కళాశాలలో రెండు రోజుల సాహిత్య సదస్సు ప్రారంభం



నిజాం కళాశాలలో జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తెలంగాణలో జరిగినన్ని సాహిత్య, సామాజిక ఉద్యమాలు మరో ప్రాంతంలో జరుగలేదని, మన చైతన్యం ప్రపంచ సాహిత్యాన్ని ప్రభావితం చేసిందని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో తెలంగాణ, దక్షిణ భారత సాహిత్య ఉద్యమాల సమాలోచన ప్రారంభమైంది. నిజాం కళాశాల, రాష్ట్ర సాహిత్య అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సును నందిని సిధారెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలో జరిగిన రైతాంగ సాయుధ పోరాటాన్ని శ్లాఘిస్తూ అనేక భాషల్లో సాహితీ సృజన జరిగిందన్నారు. పాకిస్థాన్‌లోనూ సాయుధ పోరాట నేపథ్య సాహిత్యం వచ్చిందని, ప్రపంచ ప్రఖ్యాత కవి పాబ్లో నెరుడా, బెంగాలీ రచయిత హరీంద్రనాథ్ చటోపాధ్యాయ తదితరులు సాయుధ పోరాటాన్ని ప్రస్తావిస్తూ కవిత్వం రాసినట్టు, మలయాళంలోనూ ఓ నవల వచ్చినట్టు విన్నానని పేర్కొన్నారు. నేటి పరిశోధకులు వాటన్నింటినీ పరిశీలించి నిర్ధారించాల్సిన అవసరం ఉన్నదన్నారు.

పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడాలి

సదస్సుల్లో సమర్పించే పత్రాల్లో అధ్యయనం మిషన్ కాకతీయలో పూడిక తీసినట్టు లోతుగా, మిషన్ భగీరథలా ప్రజలందరికీ ఉపయోగడేలా ఉండాలని బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ సూచించారు. తెలంగాణలోని పోరాటాలు దర్బారుల నుంచి కాకుండా అక్షరాల నుంచి వచ్చాయని గుర్తుచేశారు. ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదకుడు కే శ్రీనివాస్ మాట్లాడుతూ.. జాతీయోద్యమం దేశ చరిత్ర పరిశోధనకు, రచనకు ప్రేరణనిచ్చిందని, అదేవిధంగా తెలుగువారి చరిత్ర కోసం ఆంధ్ర ప్రాంతంలో కృషి జరిగిందన్నారు. ఇందులో బ్రిటీష్ ఆంధ్రలోని తెలుగు వారి చరిత్ర కోసం మాత్రమే అన్వేషణ జరిగిందని, హైదరాబాద్ స్టేట్‌లోని తెలుగు ప్రజలను తమవారిగా భావించక పోవడంతో తెలంగాణ ప్రాంత చరిత్ర పుస్తకాలకెక్కలేదన్నారు. ఈ లోపాల వల్లే తెలంగాణ సాహిత్యానికి సరైన గుర్తింపు లభించలేదన్నారు. తెలంగాణలోని తెలుగు సాహిత్య వికాసాన్ని తెలుగు సాహిత్య వికాసంగా పరిగణించకుండా ప్రత్యేకంగా చర్చించాలన్నారు. అనంతరం ప్రొఫెసర్ మాసన చెన్నప్ప అధ్యక్షతన 'తెలంగాణ ఉద్యమం-పద్య కవిత', ప్రొఫెసర్ ఎస్వీ రామారావు అధ్యక్షతన 'తెలంగాణ ఉద్యమం-నాటకాలు', తెలంగాణ సారస్వత పరిషత్ కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య అధ్యక్షతన 'తెలంగాణ ఉద్యమం-కథ' సదస్సులు జరిగాయి. కార్యక్రమంలో నిజాం కళాశాల ప్రధానాచార్యుడు ప్రొఫెసర్ సయ్యద్ రెహమాన్, అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ఓయూ తెలుగు శాఖ అధ్యక్షుడు సూర్య ధనంజయ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీ కాశీం, కే చిరంజీవి శాస్త్రి, శ్యాంసుందర్, కసప నరేందర్, డాక్టర్ జీ విజయకుమార్, శ్రీధర్ బిచురాజు, కేపీ అశోక్‌కుమార్, డాక్టర్ కోట్ల హనుమంతరావు, సంగనబట్ల నర్సయ్య, పీ వారిజారాణి, సీతారామ్, డాక్టర్ సాగి కమలాకర శర్మ, నలిమెల భాస్కర్, ప్రొఫెసర్ శ్రీదేవి, డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ కాలువ మల్లయ్య, డాక్టర్ వీ త్రివేణి, డాక్టర్ ఏ విజయలక్ష్మి, ఎన్ రజని పాల్గొన్నారు.

మీరాలం ఈద్గాలో సున్నీ దావతే ఇజ్తేమా

- ఏర్పాట్లను పరిశీలించిన డిప్యూటీ సీఎం మహమూద్ అలీ



ఈద్గాలో ఏర్పాట్లపై మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/చార్మినార్: హైదరాబాద్‌లోని చారిత్రాత్మక మీరాలం ఈద్గాలో ఈ నెల 24 నుంచి రెండు రోజులపాటు సున్నీ దావతే ఇస్లామీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి 'ఇజ్తేమా' (ధార్మిక) సభ జరుగనున్నది. వివిధ ఇస్లామిక్ అంశాలపై ఇస్లామిక్ పండితులు పవిత్ర ఖురాన్ గ్రంథం, మహ్మద్ ప్రవక్త ప్రవచనాలపై చర్చించనున్నారు. ఇజ్తేమాకు రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి ముస్లింలు తరలి వచ్చే అవకాశం ఉండటంతో వివిధ ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో మీరాలం ఈద్గా, దాని పరిసరాల్లో చురుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. డిప్యూటీ సీఎం మహమూద్ అలీ గురువారం మీరాలం ఈద్గా ప్రాంతాన్ని సందర్శించారు. జీహెచ్ఎంసీ, విద్యుత్, వాటర్ వర్క్స్, పోలీస్ అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా నిర్వాహకులకు పూర్తిగా సహకరించాలని ఆదేశించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు.. ఏ మతం వారి సభలు, ధార్మిక కార్యక్రమాలైనా రాష్ట్ర ప్రభుత్వం ముందుండి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ దృష్టిలో అన్ని మతాల వారు సమానమన్నారు. నిర్వాహకుల్లో ఒకరైన మౌలానా హసన్ ఫారుఖీ మాట్లాడుతూ సున్నీ దావతే ఇస్లామి సంస్థ రాజకీయాలకు అతీతంగా ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్నదన్నారు. శాంతి, సామరస్యం నెలకొల్పడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఇస్లామిక్ గ్లోబల్ అధ్యక్షుడు మౌలానా షాకేర్ నూరి(ముంబై), మౌలా నా రిజ్వాన్ ఖాన్ (ముంబై), మౌలానా సయ్యద్ అమీనుల్ ఖాద్రీ(మాలేగావ్), మౌలానా సయ్యద్ రిజ్వాన్ పాషా, మౌలానా సయ్యద్ మమ్‌షద్ పాషా, మౌలానా ముఫ్తీ హనీఫ్ ఖాద్రీ, మౌలానా నయిముద్దీన్ నయిమీ, సయ్యదా అతియా ఫాతిమా(జామే నిజామియా), రిజ్వానా జరీన్(జమియతుల్ మోమినాత్), సమీనా బాజీ(కర్ణాటక) తదితరులు సందేశాలిస్తారన్నారు. మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వివరించారు.

మూడు గ్రామాల అభివృద్ధికి 60 కోట్లు

- సీఎం కేసీఆర్ కృషితో మహర్దశ
- ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
- మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి, కేశవరం, లక్ష్మాపూర్‌లో అభివృద్ధి పనులకు భూమి పూజ



మూడుచింతలపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

శామీర్‌పేట: బంగారు తెలంగాణ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని మల్కాజిగిరి ఎంపీ చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని సీఎం కేసీఆర్ దత్తత గ్రామాలైన కేశవరం, మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల్లో ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని కొనియాడారు. ప్రజా సమస్యలు తెలుసుకుందామని పలుకరించడంతోనే సరిపెట్టకుండా లక్ష్మాపూర్, మూడుచింతలపల్లి, కేశవరం గ్రామాలకు ప్రత్యేకంగా రూ.60 కోట్లు కేటాయించారన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు శామీర్‌పేటను మోడల్ మండలంగా తీర్చిదిద్దేందుకు రూ.314 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. తండాలు, గూడాల అభివృద్ధిని కాంక్షిస్తూ గ్రామ పంచాయతీలుగా మార్చనున్నారని, దీంతో తండాల్లో వంద శాతం చదువు, ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ రూ.60 కోట్లతో మొదటి విడత కింద మూడు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, గ్రామ మహిళా వేదిక, షాపింగ్ కాంప్లెక్స్, వైకుంఠ ధామం నిర్మించనున్నారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్డీఎఫ్)లో కేశవరానికి రూ.5.32 కోట్లు, మూడుచింతలపల్లికి రూ.4.35 కోట్లు, లక్ష్మాపూర్‌కు రూ. 6.78 కోట్లు కేటాయించి బీటీ రోడ్లు అభివృద్ధి చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, సర్పంచులు మంజులాహరిమోహన్‌రెడ్డి, పద్మాలక్ష్మారెడ్డి, శ్యామల, బీ కిశోర్‌యాదవ్, ఈ శ్రీనివాస్‌ముదిరాజ్, ఎంపీటీసీలు సక్రిలక్ష్మణ్, వీరప్ప, మల్లేశ్‌గౌడ్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్నేషనల్ యానిమేషన్ డే కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

యానిమేషన్ రంగంతో యువతకు ఉపాధి

ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్

మాదాపూర్: ప్రభుత్వం యానిమేషన్‌రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఇమేజ్ టవర్స్‌ను నిర్మించనున్నదని ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ పేర్కొన్నారు. గురువారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో ఆసిఫా ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ యానిమేషన్ డేలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో ఇమేజ్ టవర్స్‌తో యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయని, యానిమేషన్ రంగాల్లో రాణించాలని చెప్పారు. ప్రముఖ సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ యానిమేషన్ తరహా సినిమాలు చేయాలంటే విదేశాలకు వెళ్లాల్సి వస్తున్నదని, ఇమేజ్ టవర్స్ ఏర్పాటుతో హైదరాబాద్‌లో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్‌ను పూర్తిస్థాయిలో అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ యానిమేషన్ రంగం అభివృద్ధికి కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫా ఇండియా అధ్యక్షుడు శేషప్రసాద్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధులు రాజశేఖర్, మాధవరెడ్డి, శ్రీధర్, బసిరెడ్డి, శ్రీకాంత్, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రేటర్ మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి టీఆర్ఎస్ సభ్యత్వం రద్దు


జీడిమెట్ల: మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పలు భూకబ్జాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ కార్పొరేటర్, టీఆర్ఎస్ నాయకుడు జీ సురేశ్‌రెడ్డి పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేశారు. 2014లో జరిగిన భూ కుంభకోణంతో ఆయనకు సంబంధం ఉన్నట్టు విచారణలో తేలడంతో ఈమేరకు చర్యలు తీసుకున్నట్టు ఎమ్మెల్సీ, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు శంభీపూర్ రాజు చెప్పారు. 2014లోనే ఆయన కుంభకోణానికి పాల్పడినట్టు విచారణలో తేలింది. ఆయన 2016 మే 2న టీఆర్ఎస్‌లో చేరారు. ఆయనపై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణ చేయించిందని, అక్రమాలు నిజమని తేలడంతో ఆయన సభ్యత్వాన్నే రద్దు చేస్తున్నట్టు శంభీపూర్ రాజు పేర్కొన్నారు. ఇదే విషయంపై సుభాష్‌నగర్ డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షుడు దేవగారి రాజేందర్‌రెడ్డి గురువారం సూరారంకాలనీలో మీడియాకు వెల్లడించారు.

ముందు 57 ఊళ్లకు నీళ్లు!

అర్బన్ భగీరథ పథకం అమలులో కీలక నిర్ణయం

ట్యాంకర్లు, బోర్లపై ఆధారపడిన గ్రామాలకు తొలి ప్రాధాన్యం

మే నెలలో సరఫరాచేయాలి: జలమండలి ఎండీ దానకిశోర్



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఔటర్ రింగు రోడ్డుకు లోపలున్న గ్రామాలకు తాగునీరు అందించే పట్టణ మిషన్ భగీరథ పథకం అమలులో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఓఆర్ఆర్ లోపలి 190 గ్రామాల్లో భగీరథ పనులు పరుగులు పెడుతున్నాయి. ఆగస్టునాటికి ఇంటింటికీ నల్లాల ద్వారా సమృద్ధిగా తాగునీరు అందించేందుకు రూ.628 కోట్ల అంచనా వ్యయంతో జలమండలి ఈ పనులకు శ్రీకారం చుట్టింది. 12 మండలాల పరిధిలోని 190 గ్రామాలకు చెందిన 30లక్షల మందికి తాగునీరు అందించేలా యాన్యుటీ విధానంలో చేపడుతున్నారు. ఈ పథకం పురోగతిపై గురువారం జలమండలి కార్యాలయంలో సమీక్షించిన ఎండీ దానకిశోర్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా ట్యాంకర్లు, బోర్లు, చేతిపంపులపైనే ఆధారపడుతున్న 57 గ్రామాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. 190 గ్రామాల స్థితిగతులను అధ్యయనం చేసిన తర్వాత 57 గ్రామాలను ఎంపిక చేశామని, భగీరథ ఫలాలు ముందుగా వాటికే అందించాలని ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు.

ప్రత్యేక బృందాలతో..

ఎంపిక చేసిన 57 గ్రామాలకు మే నెలాఖరు నాటికి మిషన్ భగీరథ నీళ్లు అందించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగనున్నాయి. ఇప్పటికే ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ విస్తరణ పనులకు సంబంధించిన మెటీరియల్‌ను కాంట్రాక్ట్ సంస్థ దిగుమతి చేసింది. నిర్వహణ సంస్థలు, ప్రాజెక్టు విభాగం అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని ఎండీ దానకిశోర్ ఆదేశించారు. ఔటర్‌కు లోపలున్న గ్రామాలకు నీటి సరఫరా బాధ్యతలను ప్రభుత్వం ఏడాది కిందట గ్రామీణ నీటి సరఫరా విభాగం నుంచి బదలాయించి జలమండలికి అప్పగించింది. ఈ మేరకు ఔటర్ లోపలి 12 మండలాల పరిధిలోని 190 గ్రామాలకు మంచినీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. 174 ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించి నిత్యం 44,700 కిలోలీటర్ల నీటిని నిల్వ చేయనున్నారు. ఈ ట్యాంకుల నుంచి 1,733 కి.మీ మేర పైపులైన్లు ఏర్పాటుచేసి నీటిని సరఫరా చేయనున్నారు.

మే నెలాఖరుకు నీరందించనున్న గ్రామాలు

మండలం	గ్రామాలు
రాజేంద్రనగర్	పుప్పాలగూడ, నెక్నాపూర్, మంచిరేవుల, బీరాజిగూడ
రామచంద్రాపురం	ఉస్మాన్‌నగర్, తెల్లాపూర్, ఇందిరానగర్
పటాన్‌చెరు	పట్టి క్రాస్‌రోడ్ కాలనీ
కుత్బుల్లాపూర్	నిజాంపేట డబ్ల్యూఎస్‌హెచ్‌సీ, బాచుపల్లి, ఇందిరానగర్, రాజీవ్‌గాంధీ నగర్, సాయినగర్, బహదూర్‌పల్లి, శ్రీరాం నగర్ తండా, దొమ్మర పోచంపల్లి, సారాగూడ
గండిమైసమ్మ	పురుష కాలనీ, బౌరంపేట
ఘట్‌కేసర్	చెంగిచర్ల, నారపల్లి, అన్నోజిగూడ, ఇస్మాయిల్ ఖాన్‌గూడ, యానంపేట
కీసర	గోడుమకుంట
శామీర్‌పేట	దేవరయాంజల్, హకీంపేట, ఎగలగూడ, ఉప్పర్‌పల్లి, పోతాయిపల్లి, సింగల్‌పల్లి, ఎత్తాయిపల్లి, మేడిపల్లి
మేడ్చల్	ఘన్‌పూర్, మైసమ్మగూడ, బసూరిగాడి
సరూర్‌నగర్	సాహెన్ నగర్, సన్‌రైజ్ కాలనీ, ఉస్మాన్ నగర్, వాహీద్ గూడ
మహేశ్వరం	ఆర్‌సీఐ కాలనీ, సర్ధార్ నగర్, తుక్కుగూడ, మక్తకంచ తండా
శంషాబాద్	చిన్నగొల్లపల్లి, బహదూర్ గూడ, రశీద్ గూడ, పోశెట్టి గూడ, హమీదుల్లా నగర్, చిన్న గోల్కొండ, లక్ష్మీ తండా
హయత్‌నగర్	మన్నగూడ, ఎంఎం కుంట
ఇబ్రహీంపట్నం	మమ్మరాజ్ గూడ, మరియపురం

సీబీఐ కస్టడీలో టీజీబీ ఉద్యోగులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రంగారెడ్డి జిల్లా అజీజ్‌నగర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో రూ.8.94 కోట్ల గోల్‌మాల్‌కు సంబంధించి సీబీఐ అధికారులు గురువారం ఐదుగురిని కస్టడీలోకి తీసుకొని విచారించారు. దీంతో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను సీబీఐ కస్టడీలోకి తీసుకున్నది. ఈ కుంభకోణంలో 10 మంది బ్యాంకు ఉద్యోగులతోపాటు, ఇతరుల పాత్ర కూడా ఉన్నదని సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నది. ప్రధాన నిందితుడిగా భావిస్తున్న జైపాల్‌రెడ్డి కూడా సీఐబీ కస్టడీలోనే ఉన్నట్టు సమాచారం. శుక్రవారం మిగతా వారిని విచారించి నిందితుల అరెస్ట్‌ను చూపించే అవకాశం ఉన్నది. ఈ బ్యాంకులో 2010-2018 మధ్య రూ.8.94 కోట్లు గోల్‌మాల్ జరిగినట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించిన సంగతి తెలిసిందే.



మాదిగ యువజన సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పిడమర్తి రవి

కేంద్రం మెడలు వంచైనా వర్గీకరణ సాధిస్తాం

వచ్చే నెలలో చలో ఢిల్లీ: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి పేర్కొన్నారు. రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు సాధిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 28న నిర్వహించనున్న మాదిగ యువజన సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 28న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ సదస్సును నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెలలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ప్రకటించారు. అనేక ఏండ్లుగా మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌కు ఓట్లు వేయబోమని, ఏప్రిల్ నుంచి ప్రతి మాదిగ గూడెంలో ప్రతిజ్ఞ చేయిస్తామన్నారు. మాదిగ యువజన సదస్సుకు మాదిగ, మాదిగ ఉపకులాల యువకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వడ్డె ఎల్లన్న, ఎర్రవెల్లి కృష్ణమాదిగ, వేల్పుకొండ వెంకటేశ్, అంకని రంజిత్, ఆలూరి సుధాకర్, మంగళపల్లి ప్రవీణ్, ప్రశాంత్, అంబేద్కర్, యాకయ్యా, నరేశ్, మహేశ్, డాక్టర్ వెంకట్‌వర్మ, ఇటికాల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi
హైదరాబాద్
శుక్రవారం 23 ఫిబ్రవరి 2018
WWW.NTNEWS.COM



అందానికే అందం!

లోకం పోకడ మారుతున్నది.. దానికి తగ్గట్లుగా యువతుల డ్రెస్‌ల్లోనూ మార్పు వస్తున్నది.. అనార్కలీతో అదరగొట్టేట్లుగా రెడీ అవుతున్నారు.. లాంగ్ స్కర్ట్‌లతో లల్లీగా కనిపిస్తున్నారు.. క్రాప్‌టాప్‌లతో మతి పోగొడుతున్నారు.. స్టైల్ స్టేట్‌మెంట్‌లా మారిన ఆ డ్రెస్‌లు మీకోసం..

బుట్ట బొమ్మలా మెరిసేందుకు ఇలాంటి డ్రెస్ మీ వార్డ్‌రోబ్‌లో ఉండాల్సిందే! ఎర్రని ప్యూర్ సిల్క్‌తో పొడువైన అనార్కలీ డిజైన్ చేసి సెల్ఫ్ బార్డర్ ఇచ్చాం. పైన మాత్రం జర్దోసీ, ముత్యాలతో హెవీగా హ్యాండ్ ఎంబ్రాయిడరీ చేయించాం. బోట్ నెక్, కోల్డ్ షోల్డర్ ఈ డ్రెస్‌కి అదనపు ఆకర్షణగా నిలిచాయి. దీనికి యెల్లో, రెడ్ కాంబినేషన్‌లో ఉన్న ప్యూర్ సిల్క్ ఇక్కత్ దుపట్టాని ఇచ్చాం.

అందరిలో ఆకర్షణగా కనిపించాలా? అయితే ఈ డ్రెస్ ఎంచుకోండి. రెడ్ కలర్ ప్యూర్ కాటన్ సిల్క్‌తో సింపుల్‌గా స్కర్ట్ కుట్టేశాం. ఇది మెటీరియల్‌తో స్లీవ్ లెస్ క్రాప్‌టాప్ డిజైన్ చేశాం. దాని మీద మాత్రం హెవీగా ఉండాలనుకున్నాం. అందుకే థ్రెడ్, జర్దోసీలతో మెషీన్ ఎంబ్రాయిడరీ చేయించాం.

ట్రెండ్‌కి తగ్గట్లు ఉండాలంటే ఇలాంటి డ్రెస్‌లు వేయాల్సిందే! నల్లని కాటన్ సిల్క్‌ని స్ట్రెయిట్ కట్ ప్యాంట్‌గా కుట్టాం. గోల్డెన్ బుటీస్ వచ్చిన బ్లాక్ బెనారస్‌ని టాప్‌గా ఎంచుకున్నాం. ఈ టాప్‌ని కూడా బోట్, కోల్డ్ షోల్డర్‌తో హైలైట్ చేశాం. పైగా ఫ్రంట్ స్లిట్ ఇవ్వడంతో స్టైలిష్ లుక్ వచ్చేసింది.

ఎవర్ గ్రీన్ కలర్ కాంబినేషన్ ఇది. పింక్ కలర్ ప్యూర్ సిల్క్‌ని లాంగ్ టాప్‌గా కుట్టాం. దానికి 3/4 హ్యాండ్స్ ఇచ్చాం. ఎడమవైపు , స్లిట్ దగ్గర జర్దోసీతో మగ్గం వర్క్ చేయించాం. దీంతో అందంగా మెరిసిపోతున్నది. బార్డర్‌లా కనిపించేందుకు గోల్డెన్ ప్యూజింగ్‌తో బార్డర్ ఇచ్చాం. ఆకుపచ్చని ప్యూర్ జార్జెట్‌తో స్కర్ట్ ఇవ్వడంతో పర్ఫెక్ట్‌గా ఉంది.

పింక్ కలర్ ప్యూర్ బెనారస్‌తో అనార్కలీ కుట్టాం. దీనికి పై భాగంలో పింక్ రాసిల్క్‌ని ఉపయోగించాం. చేతులకు కూడా ఇదే మెటీరియల్‌తో పాటు బెనారస్‌ని బార్డర్‌గా వేశాం. బెనారస్‌తోనే నెక్ లైన్ డిఫరెంట్‌గా డిజైన్ చేశాం. క్రీమ్ కలర్ బెనారస్ దుపట్టాకి పింక్ కలర్ రాసిల్క్ బార్డర్‌తో పాటు ముత్యాలను అటాచ్ చేశాం. దుపట్టా నాలుగు చివరలకు టస్సెల్స్‌తో హైలైట్ చేశాం.

నిహారికా రెడ్డి
శ్రీ వైదికి డిజైనర్ స్టూడియో
శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్
ఫోన్ : 040-44008089
https://www.facebook.com/sreevaidiki

మీరాదేవి.. అరుదైన విలేకరి!



మహిళా జర్నలిస్టులు డెస్క్ ఉద్యోగం ఇబ్బంది లేకుండా చేసుకోవచ్చు. బీట్ రిపోర్టింగ్ కొంత ఇబ్బంది ఉన్నా బాగానే నిర్వర్తించొచ్చు. కానీ రూరల్ రిపోర్టింగ్?

రూరల్ రిపోర్టింగ్ అంటే గ్రామీణ ప్రాంతాల్లో, అటవీ ప్రాంతాల్లో తిరిగి వార్తలు సేకరించాల్సి ఉంటుంది. ఇది దాదాపు వార్ జర్నలిజంతో సమానం. అలాంటి కష్టతరమైన విధిని నిర్వర్తిస్తున్నది మీరాదేవి. ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్‌కు చెందిన మీరాదేవి ఖబర్ లహారియాలో చీఫ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ అక్కడి జీవన స్థితిగతులు, బతుకుల మీద ప్రత్యేక కథనాలను రాస్తున్నది. అంతేకాదు.. మొబైల్ ఫోన్‌కు ట్రై పాడ్ పెట్టి ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నది. 'ఇది 2018. ఇంటర్నెట్ వాడుతున్న రోజులు. ఎలాంటి కష్టమొచ్చినా క్షణాల్లో పరిష్కరించుకొనే నేటితరంలో ఇలాంటి ఉద్యోగం పెద్ద కష్టమేం కాదంటున్నది మీరా. ఉత్తరప్రదేశ్‌లోని వివక్షత, కుల రాజకీయాలు, వేధింపులు వంటి అంశాల మీద ప్రత్యేక కథనాల ద్వారా వెలుగులోకి తీసుకొస్తున్నది. వార్తా సేకరణ క్రమంలో కొన్నిసార్లు అనేక ఇబ్బందులు కూడా ఎదుర్కొన్నది. భూస్వాములు, రాజకీయనేతలు ఒత్తిళ్లను అధిగమిస్తూ.. మహిళల్లో సాధికారత తీసుకురావడం కోసం, వెనుకబడిన తరగతుల ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం మీరాదేవి ప్రయత్నిస్తున్నది.

ఎలాంటి వ్యాయామం చేస్తున్నారు?



రుచికరంగా తినడం.. తీరికలేకుండా పనిచేయడమే కాదు శరీరానికి ఎంతోకొంత పని చెప్పాలనేది ఫిట్‌నెస్ ఎక్స్‌పర్ట్స్ సలహా. వయసుతో సంబంధం లేకుండా పిల్లలు.. పెద్దవాళ్లు ఎవరైనా కనీసం ఓ అరగంట పాటు వ్యాయామం చేయాలంటున్నారు. అయితే వయసును బట్టి వ్యాయామ తీవ్రతలో మార్పులు చేయాలని సూచిస్తున్నారు.

విశ్రాంత వయసు మహిళలు అతి సాధారణ వ్యాయామానికి స్వస్తి చెప్పి కొంచెం తీవ్రత పెంచాలని బ్రిటీష్ రీజినల్ సైంటిస్ట్‌లు చెప్తున్నారు. విశ్రాంత మహిళల జీవనవిధానంపై పరిశోధక బృందం అధ్యయనం చేసింది. 'ఖాళీగా ఉండకుండా ఏదో ఒక పని చేస్తూనే ఉన్నాం.. అవసరాన్ని బట్టి ఇంటి పనికి కూడా ఆసరా అవుతున్నాం, ఇంకా ప్రత్యేకంగా వ్యాయామం ఎందుకు' అనే ధోరణి కలిగినవాళ్లు చాలామంది ఉన్నట్లు వాళ్లు గుర్తించారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఓ నాలుగు రౌండ్లు వాకింగ్ చేసి రిలాక్స్ అయ్యేవాళ్లూ ఉన్నారట. ఇలా తేలికపాటి వ్యాయామాలతో విశ్రాంత మహిళలకు పెద్దగా ప్రయోజనం ఉండదనీ.. ఆరోగ్యాన్ని.. ఆయుష్షును పెంచుకోవాలనుకుంటే తప్పనిసరిగా మధ్యతర వ్యాయామం చేయాలని సూచించారు. అంటే పార్క్‌ల్లో పరుగెత్తడం.. ట్రెడ్‌మిల్ వాడటం.. తోట పనులు చేయడం వంటివి పాటించాలంటున్నారు. వారానికి 150 నిమిషాలు తగ్గకుండా వ్యాయామం చేయాల్సిందే అంటున్నారు. 60-70 ఏండ్ల మధ్యనున్న సుమారు 1200 మందిని ఈ అధ్యయనంలో భాగంగా పరిశీలించారు. వీరిలో కేవలం 16 శాత మంది మాత్రమే బ్రిటీష్ ఎక్సర్‌సైజ్ గైడ్‌లైన్స్ పాటిస్తున్నారట.



అవాంఛిత రోమాలే కారణమా?

అడుగండి చెబుతా

నా వయసు 22 సంవత్సరాలు. కొంత కాలంగా నా ముఖంపై మొటిమలు ఎక్కువగా వస్తున్నాయి. చెంపల మీద కూడా వెంట్రుకలు వస్తున్నాయి. ముఖం జిడ్డుగా ఉంటున్న భావన కలుగుతున్నది. ఈ మధ్య బరువు కూడా చాలా పెరిగిపోయాను. మెడదగ్గర చర్మం మందంగా నల్లగా అవుతున్నది. అలసటగా కూడా ఉంటున్నది. అందువల్ల చురుకుగా ఉండలేకపోతున్నాను. ఈ సమస్యలతో నాకు నలుగురిలోకి వెళ్లేందుకు చాలా ఇబ్బందిగా అనిపిస్తున్నది. దయచేసి నా సమస్యలకు సరైన పరిష్కారం చూపించగలరు?

రష్మీ, జనగాం

మీరు కేవలం ముఖం మీద కనిపిస్తున్న సమస్యల గురించి మాత్రమే ప్రస్తావించారు. మీ నెలసరులు ఎలా ఉన్నది తెలియజేయలేదు. ఈ సమస్యలన్నీ పరిశీలించిన తర్వాత మీకు పీసీఓడీ అనే హార్మోన్ సమస్య ఉందని అనిపిస్తున్నది. యుక్తవయస్కుల్లో ఎక్కువగా కనిపించే సమస్య ఇది. పీసీఓడి అంటే పాలిసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్ అని అర్థం. అంటే అండాశయంలో చిన్నచిన్న నీటి బుడగల వంటివి ఏర్పడుతాయి. అందువల్ల హార్మోన్లలో అసమతుల్యత ఏర్పడుతుంది. ఫలితంగా మీరు చెప్పిన సమస్యలతో పాటు నెలసరులు కూడా క్రమంతప్పుతాయి. ఇలా జరుగడానికి చాలా కారణాలు ఉన్నాయి. ప్రస్తుత ఒత్తిడి కలిగిన జీవనశైలి కూడా అందుకు ఒక కారణం కావచ్చు. ఈ సమస్య వంశపారంపర్యంగా కూడా రావచ్చు. రక్త సంబంధీకుల్లో ఎవరైనా అధిక బరువు, షుగర్ వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటే చిన్న వయసులోనే ఈ సమస్య రావచ్చు. దీనిని నిర్ధారించడానికి టెస్టోస్టీరాన్ హార్మోన్ పరీక్ష, పెల్విక్ అల్ట్రాసౌండ్ పరీక్షలతో పాటు బ్లడ్‌షుగర్, థైరాయిడ్ స్థాయిలను కూడా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. సమస్య పరిష్కారం కోసం కేవలం మందులు వాడితే సరిపోదు. జీవన శైలిలో మార్పులు కూడా తప్పనిసరి. క్రమం తప్పకుండా వ్యాయామం చెయ్యడం, సమతుల ఆహారం తీసుకోవడం, వీలైనంత వరకు కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండడం, తాజా పండ్లు, కూరగాయలు తప్పనిసరిగా ఆహారంలో భాగం చేసుకోవడం, శరీర బరువు అదుపులో ఉంచుకోవడం వంటివన్నీ తప్పనిసరిగా పాటించాలి. ఇప్పటికే వచ్చిన అవాంఛిత రోమాల సమస్య పరిష్కారానికి చర్మ వైద్యులను సంప్రదించి వారి సలహా మేరకు లేజర్ చికిత్స ద్వారా వాటిని తొలగించుకోవాల్సి ఉంటుంది. వీటన్నింటికంటే ముందు మానసిక ఒత్తిడిని తగ్గించుకొని ఉల్లాసంగా ఉండేందుకు ప్రయత్నించాలి. ఈ చర్యలన్నీ తీసుకుంటే మీ సమస్యకు పరిష్కారం దొరికినట్టే అని భావించవచ్చు.



డాక్టర్ సుధాకర్ రెడ్డి. పి
ఎండోక్రైనాలజిస్ట్
సన్‌షైన్ హాస్పిటల్స్
సికింద్రాబాద్

నమస్తే తెలంగాణ
చింతన
[హైదరాబాద్]
శుక్రవారం 23 ఫిబ్రవరి 2018

అంతరాళంలోనే విశ్వం ఉన్నది. ఇదే ఋషి దర్శనం. సత్య దర్శనం భౌతిక విజ్ఞానం నుండి తేలికగా లభించదు. దానికున్న పరిమితులే కారణం. మూల భావన నుండి అంతర క్షేత్ర కేంద్రం నుండి దూరమవుతున్న కొద్దీ ఆవరణ శక్తి పలుచనై శక్తిహీనమవుతుంది. నిజానికి మనకు అనుభవంలో ఉన్న ఈ ప్రపంచం, కంటికి ఇంకా కనపడని ప్రపంచంలో అత్యల్ప భాగమే. ఈ కనిపిస్తున్నది సమగ్రం కాదు.

మరణమెరుగని స్థితి...

సమగ్రము, సంపూర్ణము అయిన దానిని తెలుసుకోవాలన్న జిజ్ఞాస, ఊహ, అనల్ప కల్పనా శక్తే స్వర్గలోక వర్ణనకు దారితీసింది. స్వర్గమంటే ఇంద్రియాతీత భావనే తప్ప అది మరొకలోకం కాదంటూనే, యమధర్మరాజు నచికేతసుడికి అగ్నికార్య విధానాన్ని బోధించి, అతడి మనస్సును కల్పనా భూమిక వైపు నడిపిస్తాడు. లోకంలో వినిపించే శోకం అక్కడ వినబడదని, శరీరంలో ఏ మార్పూ జరగదని, ముసలితనం తగలదని, సుఖం సంతోషం సమృద్ధంగా ఉంటాయని వివరిస్తాడు.

'నచికేతా! అటువంటి స్వర్గం వైపు నడిపించగల అగ్ని యజ్ఞం నీకు బోధిస్తాను. హోమకుండాన్ని నిర్మాణం చేసే విధానాన్ని వివరిస్తాను' అంటుండగానే నచికేతసుడు ఆ విజ్ఞానాన్ని గ్రహించాడు. యముడికి ఆశ్చర్యం, ఆనందం కలిగి ఇకపై ఈ అగ్ని కార్యం 'నచికేతాగ్ని'గా పిలువబడుతుందని ఆశీర్వదించాడు.

భూలోకంలోనే స్వర్గం!

నచికేతాగ్ని అంటే స్వర్గానికి చేర్చే హోమమని అర్థం కాదు. జీవుడు, తన తనువు ఏర్పడడానికి కారణమైన తల్లిని, తన తనువు పోషింపబడడానికి కారణమైన తండ్రిని, తన తనువును, మనస్సును, బుద్ధిని సత్యాన్వేషణ వైపు గంభీరంగా నడిపించే గురువును గౌరవిస్తూ జీవించడం ప్రారంభించాలి. అంతేకాదు, ఆత్మవిద్య కోసం ఆరాటపడుతూ నిత్య నైమిత్తిక కర్మలను సత్యవ్రతంగా ఆచరిస్తూ, త్యాగ భావనతో జీవిత కాలాన్ని యజ్ఞ కర్మగా భావిస్తుంటారో వారందరూ తామున్న భూలోకంలోనే స్వర్గ భావాన్ని అనుభవించగలరు.



యమబోధ నచికేతసుడి నిర్ణయాన్ని మరింత దృఢతరం చేసింది. స్వర్గ దర్శనం తన లక్ష్యం కాదు, గమ్యం అసలే కాదు. ప్రాపంచిక ఆకర్షణా వలయాన్ని దాటి, ఈ ప్రపంచం కల్పిస్తున్న మాయను దాటి సత్యాన్ని అనుభవ పరిధిలోకి తెచ్చుకోవడమే తన లక్ష్యం. గమ్యం.

సత్యాన్వేషణ మార్గాలు...

మరణం మనిషిని చింతనాత్మకుడిగా తీర్చిదిద్దుతుంది. జీవితమంటే ఏమిటి? మరణానంతరం జీవుడి స్థితి ఏమిటి? ఈ ప్రశ్నలన్నీ అందరూ ఎదుర్కొనేవే. నిజానికి ఇంతటి లోతైన ప్రశ్నలు కలగడానికి కూడా ఎంతో సాధన కావాలి. ఆంతరంగిక మథనం తీవ్రతరం కావాలి. నచికేతసుడి విషయంలో ఈ పూర్వరంగం ఇప్పటికే ఏర్పడింది. అందునా సాక్షాత్ ధర్మదేవతైన యముడి ఆధ్వర్యంలో!

సత్యాన్వేషణకు రెండే మార్గాలున్నాయ్. ప్రపంచ భావనలోనే నిలబడి, దాని పరిమితులను ఎరిగి, వెదుకులాటను కొనసాగిస్తూ ఉండడం, లేదా లౌకిక పరిధిని దాటి ఆలోచించగలగడం. హేతువాదులు, చార్వాకులు, ఆచార్యులు, యతులు, అవధూతలు, యోగులు, శోధకులు, తాత్వికులు ఒకరేమిటి అన్వేషణను గురించి చర్చించని వారు లేరు. దారులు వేరు కావచ్చు. తీరుతెన్నులు వేరు కావచ్చు.

నచికేతసుడి సాధనా ఫలితం యమ దర్శనంతో ఆగక, ఆయనతో మాట్లాడగల అవకాశ రూపంలో లభించింది. క్షణం ఆలస్యం చేయకుండా యమధర్మరాజును సూటిగా నచికేతసుడు ప్రశ్నించాడు, 'మరణానంతరం మనలో ఉన్న ఆత్మ ఏమౌతుంది?' అని.

'ఈ ధర్మం నీకు అర్థం కాదు. ఈ మర్మం అంత తేలికగా బోధపడదు' అన్నాడు యముడు.

'మృత్యుదేవతవైన నీకంటే గురువెవరున్నారు? ఎవరు ఈ గుట్టు విప్పగలరు? దీన్ని వివరించలేని వరాలు నాకెందుకు? కనుక ఈ రహస్యాన్ని కరుణతో నాకు వివరించు' అన్నాడు నచికేతసుడు.

ఈ వరాలన్నీ నచికేతసుడిని పరీక్షించడానికే!

'నువ్విస్తానంటున్నవన్నీ నశించిపోయేవే! వాటి ప్రయోజనం పరిమితం. నీ దర్శనమే సౌభాగ్యం. నీతో ఉన్న ఈ కాలమే మరణమెరుగని శాశ్వత స్థితి. సుఖ సంతోషాల కంటే శాశ్వతానందాన్ని మనిషి కోరుకోవాలి. ఆ మార్గం చూపించు. మర్మం బోధించు. అది చాలు' అన్నాడు నచికేతసుడు.


యముడి మనసు ఆనంద తరంగితమైంది.

నచికేతసుడి వైపు కరుణతో చూశాడు. తన కర్తవ్య నిర్వహణకు యముడు ఉపక్రమించాడు.

... వి. ఎస్. ఆర్. మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

ఓం నమో నరసింహాయ: అనే మంత్రాన్ని నిశ్చలమైన భక్తితో యాదాద్రి మహాక్షేత్రంలో 108 సార్లు భక్తితో పఠిస్తే చాలు..
శోక మోహాలు, అహంకార మమకారాలు, రాగద్వేషాలు, ఋణరోగాలను పటాపంచలవుతాయక్కడ...

ముక్తిని ప్రసాదించే యాదాద్రి బ్రహ్మోత్సవాలు



అనంత పరాక్రమంతో... అనంత బాహుబలంతో... సూర్యచంద్రుల జ్యోతిర్నయనాలతో... అగ్నిలా ప్రజ్వలించే ప్రచండ వదనంతో... అత్యద్భుతమైన రూపురేఖలతో... అన్ని వైపులా తన చూపుల్ని ప్రసరిస్తూ కరుణిస్తున్నాడు యాదాద్రి నారసింహుడు. లోకకల్యాణం కోసం భగవంతుడు దాల్చిన అవతారాలలో నరసింహుడు ఐదంటే ఐదే నిమిషాలు పుడమిపై కొలువుదీరినప్పటికి నృసింహక్షేత్రాలకున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, భక్త సంరక్షణ ఏకకాలంలో చేసిన స్తంభోద్భవుడైన ఉగ్రనరసింహుడు పంచరూపాల్లో దర్శనమిచ్చే మహాక్షేత్రం యాదాద్రి.
బ్రహ్మోత్సవాలు భక్తకోటికి ముక్తిని ప్రసాదిస్తాయి. శక్తిని, భక్తిని పెంపొందించుకునేందుకు భగవంతుని ఆరాధించి చేసేవే బ్రహ్మోత్సవాలు. శ్రీనారసింహుడు పంచరూపాల్లో దర్శనమిచ్చే యాదాద్రిలో ఈ నెల 17న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 27 తో ముగుస్తాయి..


శక్తిని, భక్తిని, ముక్తిని ప్రసాదించే పరమానంద స్వరూపుడైన శ్రీలక్ష్మీనరసింహుడు వెలసినదే యాదాద్రికొండ. నమ్మిన వారికి సకల భోగభాగ్యాలు ప్రసాదించే నారసింహుడు తెలంగాణలో ప్రతి ఇంట్లోనూ ఇలవేల్పుగా విరాజిల్లుతున్నాడు. యాదాద్రీశుడు పంచరూపాల్లో దర్శనమిస్తున్నాడు. యాదాద్రీశుడికి పూజలు జరిపితే సకల శుభాలు చేకూరుతాయని భక్తుల నమ్మకం. రాష్ట్ర రాజధానికి అతి చేరువలో గల యాదాద్రి క్షేత్రం...కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతున్న అపరవైకుంఠంలో పదకొండు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. విశ్వశాంతి, లోకకల్యాణం కోసం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలతో యాదాద్రి శోభాయమానమైంది. ..శ్రీలక్ష్మీనృసింహుని వైభవం ఉత్సవ శోభతో మరింత ద్విగుణీకృతమవుతున్నది.

వార్షిక బ్రహ్మోత్సవాలు ఎందుకంటే..?

కుల, మత, జాతి వర్గ భేదాలకు అతీతంగా ప్రజలకు సాక్షాత్కరించడం భగవంతుని స్వరూపం పరమోద్దేశం. మానవుడు నాగరికత పెరిగే కొద్దీ వర్ణాశ్రమ ధర్మాలను అనుసరించసాగాడు. వర్గాల వారీగా అడ్డుగోడల ధర్మాలను ఏర్పరచుకున్నాడు. ఏకాగ్రత, నిబద్ధతలకు విగ్రహారాధన మార్గమని తలచాడు. దాన్నే పాటించాలని ఎంచుకున్నాడు. ఆగమశాస్త్ర పద్ధతుల్లో నిర్మాణం చేపట్టిన ఆలయాల్లో మూల విరాట్టుల సందర్శనాన్ని అప్పట్లో వృత్తి రీత్యా అట్టడుగున ఉన్న వర్గాన్ని నిషేధించారు. అయినా జనహితమే అవతార పరమార్థమని, భగవంతున్ని ప్రజలకు దూరం చేయడంపై విజ్ఞులు అభ్యంతరాన్ని లేవనెత్తారు. ఈ పరిస్థితుల్లో జనావళికి సందర్శన కలిగించేందుకు ఉత్సవాల నిర్వహణ చేపట్టారు. ఏటేటా ఉత్సవాల్లో పాల్గొన్న వారికి అదేరీతిలో పుణ్యం దక్కుతుందని పురాణాలు వెల్లడిస్తున్నాయి. ఏటేటా బ్రహ్మోత్సవాలను ఐదు రోజుల పాటు నిర్వహించే ఆలయాలను క్షేత్రాలంటారు. స్వయంభువులైన క్షేత్రాలలో బ్రహ్మోత్సవాలను 11 రోజుల పాటు జరిపితే వాటిని మహా పుణ్యక్షేత్రమంటారు. స్వయంభువుయైన శ్రీలక్ష్మీనరసింహస్వామికి ఏటా 11 రోజుల బ్రహ్మోత్సవాల నిర్వహణతో యాదాద్రి క్షేత్రం మహాపుణ్యక్షేత్రంగా విలసిల్లుతోంది.

యాదాద్రి క్షేత్ర మహాత్యం...

కృతయుగంలో హిరణ్యకశ్యపుని అంతమొందించిన తరువాత ప్రహ్లాదుని తపస్సుకు మెచ్చి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు యాదాద్రి శిఖరాగ్రమందలి విశాలమైన పర్వతగుహలో కొలువుదీరారు. బ్రహ్మాది దేవతలు శ్రీవారిని ఆరాధించారు. నేటికీ మహర్షులు అదృశ్యంగా విచ్చేసి ఆరాధిస్తున్నారని ప్రతీతి. రుషులు ఆరాధించే క్షేత్రం కాబట్టి రుషి ఆరాధన క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. పూర్వం రుష్యశృంగుని పుత్రుడైన శ్రీయాదమహర్షి శ్రీఆంజనేయస్వామి వారి ఆశీస్సులతో మహాతపస్సు చేశారు. తపస్సుకు మెచ్చి భగవానుడైన శ్రీనరసింహస్వామి వారు సాక్షాత్కారం చేశారు. యాదరుషి ప్రార్థనతో శ్రీవారు శ్రీ జ్వాలానరసింహ, యోగానంద నరసింహ, గండభేరుండ నరసింహ, శ్రీలక్ష్మీనరసింహ, శ్రీ ఉగ్రనరసింహ స్వామిగా అర్చారూపంలో ఆవిర్భవించారు. అందువల్ల ఈ క్షేత్రానికి పంచనారసింహ క్షేత్రమని, స్వయంభు క్షేత్రమని ప్రసిద్ధి. జ్వాలా నరసింహస్వామి వారు రెండు శిలాఫలకముల మధ్య దీర్ఘమైన శ్రీచూర్ణరేఖవలె భక్తులకు దర్శనమిస్తున్నారు. గ్రహబాధలు, శారీరక, మానసిక ఈతిబాధలు గలవారు 40 రోజులు ప్రదక్షిణలు చేసి అనుగ్రహానికి పాత్రులవుతున్నారు.



యాదాద్రి చరిత్ర సమస్తం ఆసక్తికరం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ చరిత్ర అంతా ఆసక్తికరం. కాకతీయ రాజవంశీయులు కూడా స్వామి వారికి పూజలు జరిపారు. ఈ ఆలయాన్ని సందర్శించి అభివృద్ధికి బాటలు వేశారు. యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురంలో లభించిన శాసనాల్లో ఈ విషయం వెలుగు చూసింది. 15 వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు శ్రీవారిని దర్శించుకున్నట్లు కొలనుపాకలో లభించిన శాసనం ద్వారా తెలుస్తున్నది. కీసరగుట్ట త్రిభువనమల్లుడు కూడా స్వామి వారిని సేవించిన వాడే. 13 వ శతాబ్దంలో కాకతీయ వంశీయులు ఒక ఆయుర్వేద వైద్యుడికి ఈ స్థలాన్ని దానమిచ్చినట్లు చెప్తున్నా, అందుకు తగిన ఆధారాలేవి లేవు. 600 సంవత్సరాల క్రితం నుంచి ఈ ప్రాంతంలోని శాసనాలను ఆర్కియాలజీ డిపార్టుమెంట్ భద్రపరిచింది. ఆలయ చరిత్రను శాసనాల ద్వారా వెల్లడి చేసి ప్రచురించాల్సిన అవసరముంది. సింహాకారంలో యాదాద్రి గుట్టపైన స్వయంభువుడిగా వెలసిన నరసింహుడు ఐదు అవతారాల్లో నెలకొని ఉన్నాడు.

విశేష పర్వాలు:

- పదకొండు రోజుల బ్రహ్మోత్సవాలలో విశేష పర్వాలను మూడు రోజుల పాటు నిర్వహిస్తారు.
- ఉత్సవాలు మొదలైన ఏడో రోజు ఈ నెల 23న రాత్రి అశ్వవాహనంపై శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని అలంకరించి ఎదుర్కోలు పర్వాన్ని నిర్వహించే మండపానికి చేరుస్తారు. ఈ పర్వంలో పెళ్లి చూపులు, మాటామంతి.. ముహూర్తం ఖరారు జరుగుతుంది.
- ఎనిమిదో రోజు 24 నాటి రాత్రి తిరుకల్యాణోత్సవ పర్వాన్ని చేపడతారు. అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం నడుం బిగించింది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొని ప్రభుత్వ పక్షాన శ్రీవారు అమ్మవారలకు పట్టువస్త్రాలను అందజేస్తారు.
- తొమ్మిదో రోజు 25న రాత్రి దేవుడి జాతరలో భాగంగా దివ్యవిమాన రథోత్సవాన్ని చేపడతారు. తిరువీధులలో జరిగే దేవుడి బరాత్‌లో భక్తులు అధికంగా పాల్గొంటారు.

నాడు భక్తోత్సవాలు...నేడు బ్రహ్మోత్సవాలు...

యాదాద్రి చరిత్ర గమనిస్తే...కాలానుగుణంగా వచ్చే మార్పులతో పాటు శ్రీలక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు కూడా మార్పు చెందుతూ వస్తున్నాయి. జనసందోహం బహుస్వల్పంగా ఉన్న పూర్వకాలంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులే ఉత్సవాలను నిర్వహించేవారు. కచ్చితంగా అందుతున్న ఆధారాల ప్రకారం యాదాద్రిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 110 సంవత్సరాలు కావస్తున్నట్లు సమాచారం. మార్గశిర మాసంలో జరిగే బ్రహ్మోత్సవాలు శాస్త్రీయ రీతికి అనుగుణంగా లేవని, అవి అశాస్త్రీయమని, వాటిని 1964 నుంచి ఫాల్గుణ మాసంలో జరుపుతున్నారు. శ్రీలక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలను గతంలో నాలుగు రోజుల పాటు నిర్వహించేవారు. 1964 వరకు శ్రీలక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు ఐదు రోజుల పాటు జరిగేవి.

పుష్కరిణిలో స్నానం మహాపుణ్యం

శ్రీమహావిష్ణువు పాదాలను బ్రహ్మదేవుడు కడుగగా ఏర్పడినదే విష్ణుపుష్కరిణి అని స్కంద పురాణంలో పేర్కొనబడింది. పంచనారసింహ క్షేత్రమైన ఈ ఆలయాన్ని గురించి స్కంద, బ్రహ్మాండ పురాణాలలో చంద్రవంశపు రాజు సహస్ర నాయకుడగు భృగుమహర్షి ఇక్కడి నారసింహ మంత్రానుష్ఠాన విధానాన్ని, ఆలయ నిర్మాణ క్రమాన్ని ఫలాన్ని వివరించినట్లు ఈ పురాణాలలో పేర్కొన్నారు. హిరణ్యకశ్యపుడి వధ అనంతరం...దేవతలు, రుషులు వైకుంఠనాథుడైన శ్రీమహావిష్ణువు ఎల్లవేళలా దర్శనం చేసుకోవడానికి అవకాశమివ్వాల్సిందిగా వేడుకుంటారు. దాంతో రాక్షసవధ జరిగిన చోట ప్రసన్నంగా దర్శనం కావడం భావ్యం కాదని, దక్షిణాపథాన గల ఈ కొండ గుహలో లక్ష్మీ సమేతంగా వెలిసి యోగ, జ్ఞాననేత్రాలకు దర్శన మివ్వగలనని వారికి ఇచ్చిన హామీ మేరకే ఇక్కడ వెలసినట్లు చెబుతారు. ఆ ఆనందంతో దేవతలు, రుషులు, సృష్టికర్త బ్రహ్మ శ్రీవారి పాదాలను కడిగితే ఏర్పడినదే పుష్కరిణి.

పుష్కరిణిలో స్నానం సకల శుభప్రదం. 40 దినాలు శ్రీవారికి ప్రదక్షిణలు చేస్తే దీర్ఘకాలంగా బాధిస్తున్న రోగాలు నయమవుతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ తీర్థం సన్నిధిలో పితృకార్యాలు జరిపితే పితృదేవతలు తరించి వైకుంఠవాసులై సుఖిస్తారని, వ్రత క్రతువులు చేసినచో అశ్వమేధయాగం చేసిన పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. విష్ణుపుష్కరిణిలో స్నానమాచరిస్తే సమస్త పుణ్యక్షేత్రాల్లోని తీర్థాల్లో స్నానం చేసినంత ఫలం వస్తుందట. బ్రహ్మోత్సవాలు జరిగే రాత్రులందు ఈ తీర్థానికి మధ్య అఖండ దివ్యమైన దివ్యజ్యోతి ప్రకాశిస్తుంది. ఈ జ్యోతిని సావిత్రి – గాయత్రి – అరుణ దేవతలుగా ఆరాధిస్తారు. ఈ జ్యోతి ప్రకాశం నుంచి సుదర్శన జ్యోతి వెలుగొంది సమస్తమైన దీర్ఘకాలమైన వ్యాధుల నుంచి భక్తులను విముక్తి చేస్తుందని విశ్వాసం.

... గొట్టిపర్తి భాస్కర్ గౌడ్

పదకొండు రోజుల పసందైన పండుగ

తొలిరోజు : ఎలాంటి ఆటంకాలు రాకుండా ఉండడం కోసం మహావిష్ణువు సేనాధిపతి విష్వక్సేనుడిని ఆరాధించాకే పూజలు చేపట్టడం ఆచారం. అగ్నిప్రతిష్ఠ జరిపి జలాన్ని పూజిస్తారు. ఆ జలంతో ఆలయం, తిరువీధులు శుద్ధి జరిపి ఉత్సవాలకు శ్రీకారం చుడుతారు. రాత్రి పుట్ట బంగారం(మట్టి)లో నవధాన్యాలు నాటి అంకురార్పణ చేస్తారు.

రెండో రోజు ఆలయోత్సవాలలో సకల దేవతలను రప్పించే బాధ్యత భగవంతుడికి ఇష్టమైన వాహనం గరుత్మంతుడి ద్వారా కొనసాగిస్తారు. ఇందులో భాగంగా జరిగే ధ్వజారోహణం ద్వారా రాత్రి సకల దేవతలను ఆహ్వానిస్తూ గరుడుడిని ఉత్సవ ప్రాంగణానికి చేరుస్తారు. విచ్చేసిన దేవతలకు ఇష్టమైన రాగాల మధ్య అతిథి మర్యాదలతో సత్కరించే పర్వాన్ని భేరిపూజ అంటారు.

మూడో రోజు: నిరంతర మంత్ర పఠనం నరసింహుడిని శాంతిపజేస్తుంది. అందుకే వేద పారాయణం నిర్వహిస్తారు. ఇందుకు ప్రత్యేక రుత్వికులను రప్పిస్తారు. శ్రీదేవి, భూదేవితో భగవంతుడు ఆదిశేషునిపై విహరిస్తూ తీర్థజనానికి ఆహ్లాదాన్ని అందించే అలంకారోత్సవాలు శేషవాహనంతో ఆరోజు రాత్రి మొదలవుతాయి.

నాలుగో రోజు ద్వాపర యుగపురుషుడైన శ్రీకృష్ణ అవతార దర్శనం కలిప్రభావం సోకకుండా మోక్షప్రాప్తినిస్తుంది. దీనికి ప్రతీక హంస వాహనం. నీటిని, పాలను వేరు చేసే హంసవాహనంపై రాత్రి శ్రీస్వామి విహరిస్తూ జ్ఞాన బోధన చేస్తారు.

ఐదో రోజు సృష్టి ప్రారంభదశలో మర్రి ఆకుపై పవళించిన విష్ణుమూర్తి అవతారాన్ని వటపత్రశాయుడిగా కొలుస్తారు. రాత్రి నిర్వహించే సేవలో కోర్కెలు తీర్చే కల్పవృక్షంపై యాదాద్రీశుడు అలంకృతుడై విహరిస్తారు.

ఆరో రోజు: దేవతల గర్వాన్ని అణిచేందుకు గోవర్ధనగిరిధారిగా అవతరించిన పర్వాన్ని నిర్వహిస్తారు. ఇంద్రుడి గర్వాన్ని అణిచి లోకులకు నేను అండగా ఉంటానని చాటి చెప్పే అలంకార తిరువీధి సేవోత్సవాన్ని చేపడతారు.

ఏడో రోజు ప్రకృతి పరంగా అందే ఫలాలను కృషి చేసిన వారికే దక్కాలన్నది జగన్మోహిని అవతార లక్ష్యం. అసురుల నుంచి సురులకు అమృతాన్ని అందజేసిన విశిష్టతే జగన్మోహిని అలంకార సేవోత్సవం. చంచల గుణం గలది అశ్వం. ఆ అశ్వాన్ని అదుపులో ఉంచేందుకు శ్రీస్వామి అశ్వవాహనరూఢుడై విహరిస్తూ ఎదుర్కోలు సంబురానికి మండపానికి చేరుతారు.

ఎనిమిదో రోజు: గజేంద్ర మోక్షానికి తార్కాణంగా గజవాహనంపై శ్రీస్వామి కల్యాణోత్సవానికి భక్తుల కేరింతల మధ్య విచ్చేస్తారు.

తొమ్మిదో రోజు: గరుడాళ్వారుడిని వేద స్వరూపుడంటారు. కర్మ, జ్ఞానం బోధించే లక్ష్యంతో భగవంతుడు నరసింహుడి రూపంలో తిరువీధుల్లో ఊరేగుతూ..కనువిందుగొలుపుతాడు. మోక్షప్రాప్తికి ఈ సేవోత్సవం నిదర్శనమని ఆచార్యులు చెబుతున్నారు. మోక్షానికి అత్యంత ప్రాధాన్యంగా ఆలయ దేవుడు రథంపై రాత్రి ఊరేగుతూ తన భక్తజనానికి నూతన దంపతులుగా దర్శనమిచ్చే ఉత్సవాన్ని రథోత్సవం అంటారు.

పదో రోజు: మహావిష్ణువు ఆయుధం శ్రీసుదర్శనుడు. నిరంతరం స్వామికి అండగా ఉంటూ సేవలందించిన శ్రీచక్ర ఆళ్వారుడితో తీర్థస్నానం చేస్తారు. పుష్కరిణిలో విశేష పర్వం నిర్వహిస్తారు. ఆగమశాస్త్రంలో పుష్పయాగానికి అత్యంత ప్రాధాన్యమిస్తారు. వినోద భరితంగా హాస్యపు పర్వాన్ని ఆ రోజు రాత్రి ఘనంగా నిర్వహిస్తారు.

పదకొండో రోజు: చివరి రోజు గర్భాలయంలోని స్వయంభువులకు వేదమంత్ర పఠనాల మధ్య అష్టోత్తర శతఘటాభిషేకం జరుగుతుంది. స్వస్తివాచనంతో మొదలయ్యే శ్రీస్వామి బ్రహ్మోత్సవాలు విశేష అభిషేకంతో ముగుస్తాయి.

ఖురాన్ మాట

పరనింద మహా పాపం



చాడీలు చెప్పటం, నిందలు మోపడం కొంత మందికి అలవాటు. ఈ అలవాటు వల్ల భయానకమైన దుష్పరిణామాలు ఎదురు కావచ్చు. కానీ వీటిని పట్టించుకోకుండా నిందలు వేసి పైశాచికానందం పొందుతుంటారు కొందరు.

ఒకరి చాటుగా మరొకరి గురించి ప్రస్తావించడం, నిందలు మోపడం వల్ల వారి గౌరవ మర్యాదలకు భంగం ఏర్పడవచ్చు, ఆత్మగౌరవం దెబ్బతినవచ్చు. నిందల వల్ల విద్వేషపు బీజాలు రాజుకుంటాయి. దీని ఫలితంగా కొన్ని సందర్భాల్లో భయానక ఫలితాలు వెలువడే అవకాశం ఉంటుంది. అందుకే నిందను మహా పాపంగా పరిగణిస్తారు. మృత సోదరుడి మాంస భక్షణతో సమానంగా ఖురాన్, హదీసులు అభివర్ణించాయి.

ప్రవక్త మహనీయుల ప్రవచనం

'హృదయాల్లో ఈమాన్ సారం దిగకుండా, నోటి మాటగా విశ్వసించిన జనులారా! విశ్వాసులపై నిందలు వేయకండి. కనబడని వారి దోషాల వెంట పడకండి. ఎవరైతే ఇలా చేస్తారో వారి పట్ల అల్లాహ్ కూడా అలాగే వ్యవహరిస్తాడు. ఎవరి పట్లనైతే దైవం ఇలా భావిస్తాడో వారిని వారి గృహాల్లోనే పరాభవం పాలు చేస్తాడు'

అంటే ఇతరులపై నిందలు మోపడం, వారి తప్పులు, బలహీనతల వెంటపడి కూపీలు లాగడం కపటులు చేసే పని. కపట విశ్వాసులు మాత్రమే ఇలాంటి దుస్సాహసాలకు తెగబడతారు. అందుకే వారు కేవలం 'నోటితో మాత్రమే విశ్వాసవచనం పలికారని, నామమాత్రపు విశ్వాసులని, విశ్వాస సారం వారి హృదయాల్లో దిగనే లేదని, వారిలో మానవత్వ వికాసం ఏకోశాన లేదని ప్రవక్త మహనీయులు చెప్పారు.


'నేను మేరాజ్ యాత్రకు వెళ్లినపుడు అక్కడ కొంత మంది నాకు తారసపడ్డారు. వారి గోళ్లు ముదురెరుపు రంగులోని రాగిగోళ్లలా ఉన్నాయి. వాటితో వారు తమ ముఖాలను, ఎదురొమ్ములను గీరుకొని రక్తసిక్తం చేసుకుంటున్నారు. అప్పుడు నేను 'వీళ్లెవరు? ఇంతటి భయంకరమైన శిక్ష అనుభవిస్తున్నారు? అని జిబ్రీల్ (అ)ను అడిగాను. ' వీళ్లు తమ ఇహలోక జీవితంలో ప్రజల మాంసాన్ని భక్షించే వారు. అంటే పరులపై నిందలు వేసేవారు, అపనిందలు మోపేవారు, వారి గౌరవమర్యాదలతో చెలగాటమాడే వారు' అని జిబ్రీల్ చెప్పారు.

కొంత మందికి ఇతరులను నిందించడం, రకరకాల వ్యాఖ్యలు చెయ్యడం, పరోక్షంలో ఉన్నవి, లేనివి ఊహించుకొని, కల్పించుకొని చెప్పుకోవడం ఒక కాలక్షేపం. అదొక పైశాచిక ఆనందం. నోటి నుంచి వెలువడే ఒక్కొక్క మాటకు, చేసిన ఒక్కొక్క పనికి దైవానికి సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది. నోటికొచ్చినంత మాట్లాడతామంటే కుదరదు. మనసు గాయపరిచే వారిని దైవం ఎంత మాత్రం క్షమించడు. చేతనైతే నాలుగు మంచి మాటలు మాట్లాడాలి. మంచి ఆలోచనలు కలిగి ఉండాలి. చేయగలిగితే మేలు చేయాలి. లేకపోతే మౌనంగా ఉండాలి. మనసులో ఏ మాత్రం కుళ్లు, కుట్ర, దుర్మార్గపు ఆలోచనలు ఉన్నా దేవుని ఆగ్రహానికి గురికాక తప్పదు. కనుక కొన్నాళ్ల ఈ ప్రాపంచిక జీవితంలో మనసును కల్మషాలతో నింపుకొని, పైశాచిక ఆనందం అనుభవిస్తే, శాశ్వతంగా దుర్భర శిక్షను అనుభవించవలసి ఉంటుందని గ్రహించాలి.

... మదీహా అర్జుమంద్

దేవుని భయం అన్ని భయాలను జయిస్తుంది

సువార్త



యేసుక్రీస్తు ఒకసారి తన శిష్యులతో 'పరిసయ్యుల వేషధారణ అను పులిసిన పిండిని గూర్చి జాగ్రత్తపడుడి' అని చెప్పాడు (లూకా 12:1). వేషధారణ అంటే నటించడం. తమ సహజ స్వభావానికి భిన్నంగా వ్యవహరించటం, తమ వాస్తవ జీవితాలను దాచిపెట్టి ఇతరులను మభ్యపెట్టేందుకు ప్రయత్నించే వారు వేషధారులు. వారికి తాము నటిస్తున్నామని తెలుసు. కానీ ఇతరులు ఆ విషయాన్ని గ్రహించడం లేదని అనుకుంటారు. ఇతరులు మనలను ఇష్టపడాలని కోరుకుంటాం. అందుకోసం చాలామంది ఇతరుల మెప్పు పొందటానికి నటిస్తూ ఉంటారు. ఈ వేషధారణను యేసు పులిసిన పిండితో పోల్చాడు. రొట్టెను తయారుచేసే పిండికి పులిసిన పిండిని చేరిస్తే రొట్టెలు బాగా పొంగుతాయి. అలాగే వేషధారణ మనిషిలో అహాన్ని ఉప్పొంగజేస్తుంది (1కొరింథీ 4:6, 5:2). దీంతో ఆ వ్యక్తిలోకి గర్వం ప్రవేశించి అతని గుణాన్ని క్షీణింపజేస్తుంది. అందువల్ల మన జీవితాలను నటనకు దూరంగా ఉంచాలంటే మనలోని పులిసిన పిండిని తీసివేయాలి. వేషధారణ బుద్ధిహీనమైంది, నిష్ఫలమైనది. నటించడం ద్వారా మనం దేనినీ నిజంగా దాచిపెట్టలేం. 'మరుగైనదేదియు బయలుపరచబడకపోదు; రహస్యమైనదేదియు తెలియబడకపోదు. మీరు చీకటిలో మాటలాడుకొనునవి వెలుగులో వినపడును' అని యేసు అన్నాడు. వేషధారణకు ప్రాథమిక కారణం భయం. ఆ భయం వల్లనే, ఇతరులు మెచ్చుకోవాలి లేదా ఇష్టపడాలి అనే ఆతృతతో స్వభావానికి విరుద్ధంగా నటిస్తూ ఉంటాం. కొందరు ప్రాణభయంతో తమ సహజ స్వభావానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుంటారు. ఇతరులు తమకు ఏదో హాని తలపెడతారని భయపడినప్పుడు వారి అనుగ్రహం పొందేందుకు ప్రయత్నిస్తాం. అవసరమైతే అబద్ధాలు కూడా ఆడుతాం. ఇదే వేషధారణ. మనుషుల స్వభావం దేవునికి తెలుసు, అయినా ప్రజల మెప్పు పొందటానికి నటించే వారిని యేసు ఇలా హెచ్చరించాడు.. 'దేహమును చంపిన తరువాత మరేమియు చేయనేరని వారికి భయపడకుడి.ఎవరికి మీరు భయపడవలెనో మీకు తెలియజేయుదును; చంపిన తరువాత నరకములో పడద్రోయ శక్తిగల వానికి భయపడుడి, ఆయనకే భయపడుడని మీతో చెప్పుచున్నాను' అన్నాడు (లూకా 12:4–5). వేషధారణకు పరిష్కారం దేవునికి మాత్రమే భయపడటం. దేవుని భయం అన్ని భయాలను జయిస్తుంది. దేవునికి భయపడే వ్యక్తి దేని గురించి, ఎవరి గురించి భయపడే అవసరం రాదు.

... జాషువా

నమస్తే తెలంగాణ
విహారం
[హైదరాబాద్]
శుక్రవారం 23 ఫిబ్రవరి 2018

వేగం

రెండువందల ఏళ్ల క్రితం ప్రజలు గుర్రాల మీద, గుర్రబ్బళ్ళ మీద ప్రయాణించే వారు. హైద్రాబాద్ నించి నిజామాబాద్‌కి రోజుకి 25 కిలోమీటర్ల చొప్పున ఏడెని మిది రోజులకి గానీ చేరే వారు కారు.

ఈరోజు వ్యోమగాములు అంతరిక్షంలో గంటకి 25వేల మైళ్ళ వేగంతో ప్రయాణిస్తున్నారు. ఈ వేగంతో న్యూయార్క్ నించి శాన్‌ఫ్రాన్సిస్కోకి ఎనిమిది నిమిషాల్లో చేరొచ్చు. ఆకాశ గమన సౌకర్యం వల్ల న్యూఢిల్లీలో బ్రేక్‌ఫాస్ట్, బెంగుళూరులో లంచ్, కలకత్తాలో డిన్నర్ తీసుకోవచ్చు. (లగేజ్ జైపూర్‌కి వెళ్లొచ్చు).

అంతరం

ఒకతను ఇలా చెప్పాడు.

'మా ముత్తాత గుర్రం మీద ప్రయాణించేవాడు. రైలంటే భయపడేవాడు. మా తాత రైల్లో ప్రయాణించేవాడు. కారంటే భయపడేవాడు. మా నాన్న కార్లో ప్రయాణించేవాడు. విమానం అంటే భయపడేవాడు. నేను విమానంలో ప్రయాణిస్తాను. కానీ గుర్రం అంటే భయపడతాను'. భలే చిత్రం కదూ...!



రైలు పట్టాల మధ్య దూరం ఎలా నిర్ణయించారు?

ఇండియాలో రైలు పట్టాల మధ్య దూరం (గేజ్) నాలుగడుగుల ఎనిమిదిన్నర అంగుళాలు. ఈ దూరాన్ని ఎందుకు ఎంచుకున్నారు? ఎందుకంటే ఇంగ్లండ్‌లో పట్టాల మధ్య దూరం అది. ఇండియాలో బ్రిటిష్ ఇంజనీర్లు రైలు పట్టాలని నిర్మించారు.

ఇంగ్లీష్ వాళ్లు పట్టాల మధ్య ఈ దూరాన్ని అసలు ఎలా నిర్ణయించారు? ఎలా అంటే రైలు పట్టాల నిర్మాణానికి మునుపు గుర్రాలు లాగే ట్రామ్ పట్టాల మధ్య దూరం అది.

ట్రామ్ పట్టాలకి ఆ దూరం ఎందుకు ఎన్నుకున్నారు అంటే, వాళ్లు గుర్రబ్బళ్ళని నిర్మించేటప్పుడు చక్రాల మధ్య దూరాన్ని నాలుగడుగుల ఎనిమిదిన్నర అంగుళాలుగా ఎంచుకున్నారు.

గుర్రబ్బళ్ళకి చక్రాల మధ్య ఆ దూరాన్ని ఎందుకు ఎంచుకున్నారు? రోమన్ చక్రవర్తులు యూరప్‌లో మొదటిసారి నగరాలని కలిపే రోడ్లని, సైనికుల రవాణా కోసం నిర్మించినప్పుడు, రోమన్ యుద్ధ రథాలు పట్టేంత వెడల్పు గల రోడ్లనే నిర్మించారు. వాటి వెడల్పు నాలుగడుగుల ఎనిమిదిన్నర అంగుళాలు. రథానికి కట్టే రెండు గుర్రాల వెనుక భాగం పడే నిడివి అది.

... డి.పద్మజ

ట్రావెలాగ్ 8

మరకతంతో ఓరోజు..

3వ రోజు..

ఉదయం ఆరున్నరకి నిద్ర లేచాం. బాత్‌రూం ముందున్న మేట్ మీద Tamhtab అని రాసి ఉండడం గమనించి, 'దీనర్థం చైనీస్ భాషలో వెల్‌కం అయి ఉంటుంది' అన్నాను పద్మజతో.

'కాదు. బాత్‌మేట్‌ని తలకిందులుగా వేశారు' దాన్ని సరిచేసి చెప్పింది.



తయారై ఏడు నలభైకి కిందకి వచ్చాం. అప్పటికే హేరిస్ లాబీలో ఉన్నాడు. బ్రేక్‌ఫాస్ట్ హాల్‌లో వెజిటేరియన్ ఐటమ్స్ కోసం వెదికాను. ఫ్రైడ్ బీన్స్, ఏవో ఆకులు కలిపి చేసిన పొటాటో ఫ్రై, బ్రెడ్, మార్మలేడ్, చిన్న టొమాటోలు మాత్రమే మేము తినగలిగినవి. ఆరెంజ్ జ్యూస్, కాఫీ, గ్రీన్ టీ కూడా ఉన్నాయి. ఎనిమిది కల్లా బ్రేక్‌ఫాస్ట్ ముగించి లాబీలోకి వచ్చాం. ఇంకా ఎవరూ రాకపోవడంతో హోటల్ బయట కొద్ది దూరంలో ఉన్న చిన్న పళ్ళ దుకాణానికి వెళ్లి, నాలుగు యువాన్స్‌తో వాటర్ బాటిల్ కొన్నాం. డబ్బు చెల్లించడానికి పర్స్ తీస్తే, అందులోని పది రూపాయల నోటుని చూసి దుకాణం వాడు ఆసక్తిగా చూసిస్తానని అడిగాడు. దాన్ని అతనినే ఉంచుకోమని చెప్తే మారక విలువ ఎంతో తెలియకుండానే ఐదు యువాన్స్ నోటుని తీసి ఇవ్వబోయాడు. అది గిఫ్ట్‌గా ఉంచుకోమని చెప్పి నేను ఆ నోటు తీసుకోలేదు. ఎనిమిది యాభైకి బస్‌లో కూర్చున్నాం.

క్యూలో ఎవరు ముందు వెళ్తే సీటు వారిది అన్నది అభివృద్ధి చెందిన దేశాల్లోని పద్ధతి. థాయ్‌లాండ్‌లో కౌంటర్ల ముందు నేల మీద పాదరక్షలు తప్ప మనుషులు కనిపించరు. క్యూలో నించోవాల్సిన చోట తమ చెప్పులకి వదిలి బెంచీల మీద కూర్చుంటారు. వారి వంతు రాగానే వెళ్లి తమ పాదరక్షలని తొడుక్కుని క్యూలో నించుంటారు. కాని ఇండియా పద్ధతి ఎవరు కర్చీఫ్ వేస్తే సీటు వారిదే.

సాధారణంగా ఎస్ఓటీసీ టూర్లలో బస్లో రొటేషన్ పద్ధతిలో ముందు వరుసలో కూర్చున్నవారు మర్నాడు ఓ వరుస వెనక్కి, చివరి వరుసలోని వారు ముందు సీట్‌కి వెళ్తుంటారు. కానీ చైనా ట్రిప్‌లో అజింక్యా దీన్ని అనుసరించకపోవడంతో ఖాళీ ఉన్న



రెండు సీట్లలో కూర్చున్నాం. అజింక్యా కాంప్లిమెంటరీగా అందరికీ తలో వాటర్ బాటిల్ ఇచ్చాడు.

జేడ్ (మరకత మణి) ఫ్యాక్టరీ

ఈరోజు నించి చైనా టూర్ మొదలైంది. ముందు బీజింగ్ నగరాన్ని సందర్శిస్తారు. మూడు వేల సంవత్సరాలకి పైబడ్డ చరిత్ర గల బీజింగ్ అసలు పేరు చియన్. ఆరు ప్రాచీన రాజరికాలకి బీజింగ్ రాజధాని. దాని విస్తీర్ణం 16,800 చదరపు కిలోమీటర్లు. బీజింగ్‌తో పోలిస్తే షాంఘై వయసు బచ్చాతో సమానం. మూడు వందల ఏళ్ల క్రితమే పుట్టిందంటూ చెప్పాడు హేరిస్.

ఇరవై నిమిషాల్లో మా బస్ జేడ్ ఫ్యాక్టరీకి చేరుకుంది. నిజానికి మా టూర్‌లో ఇది లేదు. ఐనా పర్యాటకులు కొనేవాటి మీద కమీషన్ వస్తుందని స్థానిక ట్రావెల్ ఏజెన్సీలు జేడ్ ఫ్యాక్టరీకి తీసుకెళ్తారు. 'చైనాలో జియాంగ్, అన్ ఎంగ్ అనే ప్రాంతాల్లో జేడ్ బాగా దొరుకుతుంది. అక్కడి నించి జేడ్ చైనా అంతటా సరఫరా అవుతుంది. రోడ్డు మీద అమ్మే జేడ్ వస్తువులు చవకగా అనిపించినా అవి నకిలీలు తప్ప అసలైనవి కాదు. ఇది గవర్నమెంట్ షాప్ కాబట్టి నకిలీలుండవు. కాబట్టి కొద్దిగా ధర ఎక్కువైనా అసలైన జేడ్ వస్తువులు కొనొచ్చు. కావాల్సింది ఎంపిక చేసుకున్నాక నాకు చెప్తే బేరం ఆడతాను. హేరిస్ ఈజ్ యువర్ ఫ్రెండ్' బస్ దిగబోయే ముందు హేరిస్ చెప్పాడు.

బస్ దిగగానే బయట సిద్ధంగా ఉన్న టాంగ్డీ సుపీరియర్ జేడ్ ఫ్యాక్టరీ రిప్రజెంటేటివ్ మాకు ఐడెంటిటీ కార్డులిచ్చాడు. షాపు బయట పనిచేసే వర్కర్ల కంచు విగ్రహాలున్నాయి. అతను జేడ్ గురించి వివరించాడు. 'జేడ్ ఏడు వేల ఏళ్ల నించి మనుషులకు తెలుసు. ప్రపంచంలో జేడ్ సాధారణంగా ఆకుపచ్చ రంగులోనే దొరుకుతుంది. కాని చైనాలో మాత్రం ఎరుపు, తెలుపు, పసుపు, నలుపు, వయొలెట్ లాంటి ఇతర రంగుల్లో కూడా ఉంటుంది. పింక్ జేడ్‌ని మాత్రం తైవాన్ నించి దిగుమతి చేసుకుంటాం. జేడ్‌ని లైట్ ముందు ఉంచితే అందులోంచి లైట్ కనిపిస్తే అది నిఖార్సైన మరకతం అని అర్థం' అని చెప్పి జేడ్ వెనుక నించి లైట్‌ని ప్రసరించి చూపించాడు.

షాపులోకి వెళ్లే దారిలో జేడ్‌ని చెక్కే యంత్రాలు, పాలిష్ చేసే యంత్రాల మీద మనుషులు పని చేస్తున్నారు. షాప్ లోపలికి తీసుకెళ్లి గనుల నించి వచ్చిన జేడ్ ముడి రాళ్లు, వాటిని పాలిష్ చేసి వివిధ ఆకారాల్లోకి మలచడాన్ని చూపించాడు. చాలామంది శిల్పులు యంత్రానికి ఉన్న ఓ ఉలి లాంటి పరికరం తో కుడిచేత్తో రాళ్లని చెక్కుతున్నారు. రేగే దుమ్ము పర్యాటకుల మీదకి రాకుండా వాళ్లు అద్దాల కేబిన్స్‌లో పనిచేస్తున్నారు. రాయి వేడెక్కకుండా దాని మీద పంపులోంచి సన్నటి నీటి ధార యాంత్రికంగా పడుతోంది.

రాశిని బట్టి పెండెంట్..

షాప్‌లోని అద్దాల కౌంటర్స్‌లో జేడ్‌తో చేసిన చాలా రకాల వస్తువులున్నాయి. అన్నీ బాగా ఖరీదుగా ఉన్నాయి. ఓ డ్రాగన్ ఖరీదు రెండువేల డాలర్లు (లక్షా నలభై వేల రూపాయలు)! లాఫింగ్ బుద్ధాలు ఎక్కువగా ఉన్నాయి. జేడ్ బ్రేస్‌లెట్స్ వేసుకుంటే ఈవిల్ స్పిరిట్స్ రావని వారి నమ్మకం. కుటుంబం సంతోషంగా ఉండడానికి, వ్యాపారం అభివృద్ధి చెందడానికి అదృష్ట మండూకాల లాంటి ఫెంగ్‌షుయ్ వస్తువులు కూడా ఆ దుకాణంలో ఉన్నాయి. ఒక్కోదాని నోట్లో, కాళ్ల కింద కూడా నాణాలున్నాయి. ఫెంగ్‌షుయ్ ప్రకారం అది ఇంట్లో ఉంటే డబ్బు వస్తుందని నమ్మకం. చైనాలోని పిల్లలు పన్నెండో ఏడు రాగానే వారి జన్మ రాశికి చెందిన జంతువుల పెండెంట్స్‌ని మెళ్లో ధరిస్తారు. వారికి మొత్తం పన్నెండు రాశులు, పన్నెండు జంతువులు ఉన్నాయి. ఇవి అనేక రంగులు, పరిమాణాల్లో చెక్కి ఉన్నాయి.

హేరిస్ హ్యాపీనెస్ బాల్‌ని చూపించాడు. రంధ్రాలున్న పెద్ద బంతిలో ఒకదానిలో ఒకటి చొప్పున అనేక చిన్న బంతులున్నాయి. పైన పెద్ద బంతి, లోపల కదిలే చిన్న బంతులని ఒకదాంట్లో మరోటి ఉండేలా చెక్కడం అద్భుతమే. పై పెద్ద బంతి మీద డ్రాగన్ (చక్రవర్తి లేదా పురుషుడు), ఫీనిక్స్ (మహారాణి లేదా స్త్రీ) బొమ్మలు చెక్కారు. ఈ రెండు గుర్తులనీ చైనీస్ ఆనందకరమైన వివాహానికి గుర్తుగా భావిస్తారు. పెద్ద బంతుల్లోని చిన్న బంతులు కుటుంబంలోని ఒక్కో తరానికి ప్రాతినిధ్యం వహిస్తాయని చెప్పాడు.

సేల్స్ గర్ల్ ఓ గాజు వస్తువుని తీసుకుని ఇంకో గాజు వస్తువుతో కొట్టింది. అలా అనేక గాజు వస్తువులని కొడితే దాదాపు ఒకే రకం శబ్దం వినిపించింది. జేడ్‌ని జేడ్‌తో కొడితే వేరే రకం శబ్దం వినిపించింది. అసలైన జేడ్‌కి ఆ రకం శబ్దం వస్తుందని చెప్పింది.

'ప్లాస్టిక్‌కి, పాలరాయికి, జేడ్‌లకి మధ్య గల తేడా తెలుసుకోవాలంటే ఆ వస్తువు మీద నాణెంతో కొట్టాలి. అది ఎక్కువ శబ్దం చేస్తే జేడ్ అని, తక్కువ స్థాయి శబ్దం చేస్తే పాలరాయి అని అర్థం. ప్లాస్టిక్‌కి ఇంకా తక్కువ శబ్దం వస్తుందంటూ చూపించింది.

(ఇంకా ఉంది)

... మల్లాది వెంకట కృష్ణమూర్తి

తొలి నగరం ఇదే!



యూరప్ ఖండంలోని విస్తారమైన దేశాలలో జర్మనీ ఒకటి. మరి జర్మనీ అనగానే బెర్లిన్, మునిచ్, హాంబర్గ్, ఫ్రాంక్‌ఫర్ట్ వంటి అందమైన నగరాలు గుర్తొస్తాయి. కానీ వీటన్నింటినీ మించిన చారిత్రక నగరం ఇంకోటుందక్కడ. అదేమిటో దాని విశేషాలేమిటో తెలిస్తే.. మీరూ ఒక ట్రిప్పేసుకుందామని ప్లాన్ చేసేసుకుంటారు.

పశ్చిమ జర్మనీలో వెలిసిన ట్రైయర్ నగరంతో ఆ దేశంలోని మిగతా నగరాలు పోటీపడలేవు. చారిత్రక నేపథ్యంలోనూ, పురాతనమైన సంస్కృతీ సంప్రదాయాల్లోనూ ట్రైయర్‌ను మించిన సిటీ జర్మనీలో లేదు. అసలు ఆ దేశంలో వెలిసిన తొలినగరమే ట్రైయర్. అందుకే అన్నింటా ఈ అందమైన నగరానికి ప్రత్యేకమైన స్థానమున్నది. టూరిస్టులకు ఈ నగరం ఒక కనులవిందు. ట్రైయర్‌కు వెళ్లడమంటే చిన్న విషయంగా కొట్టిపారేయలేం. చారిత్రక నేపథ్యం కలిగిన ఈ నగరంలో ఎటు చూసినా జర్మన్ కల్చర్ దర్శనమిస్తుంది. ఆకర్షణీయమైన ప్రదేశంలో అద్భుతమైన కట్టడాలు కళ్లెదుట మరింత అద్భుతాన్ని ఆవిష్కృతం చేస్తాయి.




ట్రైయర్‌లోని క్యాథడ్రిల్ చర్చ్ యాత్రికులు సందర్శించాల్సిన ముఖ్యమైన ప్రదేశాలలో ఒకటి. మంత్రముగ్ధులను చేసే ఆర్కిటెక్చర్‌తో మూడో శతాబ్దంలో నిర్మితమైన ఈ కట్టడం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నది.




ఈ నగరంలో పూర్తిగా గాజుతో నిర్మితమైన ఒక కార్యాలయ సముదాయం (భవంతి) మరో మిరాకిల్. ఇక్కడి కొత్త, పాత ప్రదేశాల వెనుక చారిత్రక నేపథ్యం ఉన్నది. ఇంతకు ముందు పూర్తి నిషేధిత ప్రాంతంగా ఉన్నా, ఇప్పుడు చారిత్రక ప్రదేశంగా యాత్రికులకు వెల్‌కమ్ చెబుతున్నది.



ఈ నగరానికి ప్రధానంగా నాలుగు ద్వారాలు ఉంటాయి. వాటిలో ఒకటి పోర్టా నిగ్రా (ది బ్లాక్ గేట్). క్రీ.శ 186-200 మధ్య ఇసుక రాయితో నిర్మితమైన ఈ కట్టడం శిలానైపుణ్యం ఒక అద్భుత విశేషం.



ట్రైయర్‌లో ప్రతి ప్రదేశమూ పురాతన చరిత్ర కలిగినదే. నగరం గుండా పారే మోసెల్ల నదిపై కట్టిన రోమన్ బ్రిడ్జే అందుకు ప్రత్యక్ష నిదర్శనం. అందమైన ఆ పురాతన బ్రిడ్జి ఇప్పటికీ వాడుకలో ఉండడం విశేషం. జర్మనీ వెళ్లిన యాత్రికులు తప్పక చూడవలసిన ప్రదేశమిది.



పాతనగరంలో ఉండే బాత్‌హౌస్‌లు మరీ ప్రత్యేకం. రోమన్ పాలనలో రాజవంశీయులు ఇక్కడే సేదతీరేవారట. వీటి నిర్మాణశైలి రోమన్ల శిల్పకళా నైపుణ్యాన్ని తెలియజేస్తుంది. ఇక నగరంలో ఉన్న భారీ యాంఫిథియేటర్ వెరీ వెరీ స్పెషల్. గ్లాడియేటర్స్‌కు, లయన్స్‌కు మధ్యలో పోరాటాలు ఇక్కడే జరిగేవట.

జర్మనీలో వెలిసిన తొలి నగరంగానే కాదు.. చూడదగిన అందమైన ప్రదేశాలు, పురాతన మఠాలు, చర్చిలతో విశిష్టతను సంపాదించుకున్నది ట్రైయర్. చరిత్ర సాక్ష్యంగా నిలిచే భూగర్భ అవశేషాలను తన గర్భంలో దాచుకున్న అతి పురాతన నగరమిది. జర్మనీకి వెళ్లాలనుకొనే యాత్రికులు.. విజిటింగ్ స్పాట్స్ లిస్టులో తప్పక చేర్చుకోవాల్సిన నగరం ట్రైయర్.



సుడోకు

డైలీ సుడోకు 135 సమాధానం

3	7	4	2	8	9	6	5	1
9	6	8	3	1	5	4	2	7
1	5	2	6	7	4	9	8	3
6	4	3	8	5	2	7	1	9
2	9	5	1	6	7	8	3	4
7	8	1	9	4	3	2	6	5
4	3	9	5	2	6	1	7	8
8	2	7	4	3	1	5	9	6
5	1	6	7	9	8	3	4	2

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు - 136

8			9		5		4	
	2	5			3			
3	9			6				
					1	7		8
			3		6			
6		7	5					
				1			2	4
			4			8	9	
	4		8		9			3

ట్వీట్



సద్గురు
@SadhguruJV

ముగింపు కన్నా గందరగోళం మేలు. గందరగోళంలో అవకాశం ఉంటుంది. ముగింపు అయితే ఇంకో అవకాశం ఉండదు.



సద్గురును ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

1,441,853

కామన్‌మ్యాన్ వాయిస్


నిజమే.. బ్లాక్ అచ్చు ద్రవిడ మహారాజ్ అయిన రజనీకాంత్ ద్రవిడ హార్ట్‌బీట్ తెలుసుకోకుండా 'ఆర్యన్ సిద్ధాంతం'ను ఫాలో అయితే, ఆర్యుడయిన 'కమల్' రాజకీయాల్లోకి వచ్చి ద్రవిడ సిద్ధాంతం గురించి చెప్పి అధికారం చేజిక్కించుకొని అధికారంలోకి వచ్చాక 'ఆర్యన్ సిద్ధాంతం' ఇంప్లిమెంట్ చేస్తాడు. మన చరిత్ర మనం తెలుసుకోకపోతే అంతే సంగతులు.

-aruna queen

తమ ఆందోళనలనో, ఉద్వేగాలనో, ఆవేదనలనో, ఆనందాలనో ఇతరులతో పంచుకోవాలనుకునే వారితో పేచీ లేదు. వారానికి ఒకసారి అయినా ఫేస్‌బుక్‌లోనో, పత్రికలలోనో కవిత్వం పేరుతో ఏదో ఒకటి కనిపించకపోతే, జనం మనల్ని గుర్తించరేమో అనుకునే వారితోనే అసలు సమస్యలన్నీ!

-Shivaramakrishna Penna

వైరల్ వీడియో



గాల్లో జంపింగ్‌లు.. యుద్ధ విన్యాసాలు. కర్ర, కత్తి సాములు టైగర్ ష్రాఫ్‌కి వెన్నతో పెట్టిన విద్య. భాగీ 2లో వాటితో ప్రయోగాలు చేసే అవకాశం వచ్చింది. ఇంకేం, దుమ్ము దుమారమే!

Baaghi 2 Official Trailer | Tiger Shroff | Disha Patani | Sajid Nadiadwala | Ahmed Khan

Total views : 12,300,161+

Published on Feb 21, 2018

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
శుక్రవారం 23 ఫిబ్రవరి 2018



బెల్లంకొండ శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నవీన్, శ్రీనివాస్

బెల్లంకొండ రొమాంటిక్ థ్రిల్లర్

బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా నటిస్తున్న రొమాంటిక్ థ్రిల్లర్ గురువారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ శొంటినేని నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా శ్రీనివాస్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, శాసన సభ్యులు జీవన్‌రెడ్డి చిత్ర దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందజేశారు. హీరో బెల్లంకొండ శ్రీనివాస్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వి.వి.వినాయక్ క్లాప్ నివ్వగా, ఏపీకి చెందిన గురజాల శాసన సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు కెమెరా స్విఛాన్ చేశారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ పుస్కూరు రామ్మోహన్‌రావు గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం హీరో బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ 'నవీన్, నేను కలిసి సినిమా చేయాలని చాలా కాలంగా అనుకుంటున్నాం. దీని కోసం చాలా కథలు విన్నాం. శ్రీనివాస్ చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. ఇప్పటి వరకు నేను చేయని యాక్షన్ థ్రిల్లర్ ఇది. తెలుగు తెరపై రాని సరికొత్త కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. 'అల్లుడు శీను' తరువాత ఛోటా కె. నాయుడుతో కలిసి పనిచేస్తున్నాను' అన్నారు. 'మా సంస్థలో నిర్మిస్తున్న తొలి చిత్రమిది. కొత్త పంథాలో సాగుతుంది' అని నిర్మాత తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక రొమాంటిక్ థ్రిల్లర్. నవ్య పంథాలో సాగుతుంది. మార్చి 2 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. బెల్లంకొండ శ్రీనివాస్ సరసన ఇద్దరు పేరున్న కథానాయికలు నటిస్తారు. వారి వివరాలు త్వరలో తెలియజేస్తాం' అన్నారు. 'మంచి కథ, కథను మించిన అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో దర్శకుడు మమ్మల్ని ఆశ్చర్యపరిచాడు' అని సినిమాటోగ్రాఫర్ ఛోటా కె. నాయుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఆర్ట్: చిన్నా, ఎడిటింగ్: ఛోటా కె.ప్రసాద్, మాటలు: కేశవ్ పప్పల, ఫైట్స్: స్టన్ శివ, వెంకట్.



శ్రీనివాస్‌పై క్లాప్‌నిస్తున్న వినాయక్



హరీష్‌శంకర్

సీటీమార్

జనాదరణ పొందిన గీతాలను సినిమా టైటిల్స్‌గా ఎంచుకునే ట్రెండ్ గతకొంతకాలంగా ఎక్కువయింది. తాజాగా హరీష్‌శంకర్ దర్శకత్వం వహించనున్న ఓ చిత్రానికి 'సీటీమార్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఆయన దర్శకత్వంలో రూపొందిన 'దువ్వాడ జగన్నాథమ్' చిత్రంలోని 'సీటీమార్ సీటీ మార్..' అనే గీతం చక్కటి పాపులారిటీని సంపాదించుకుంది. ఇప్పుడు అదే గీతాన్ని తన సినిమా టైటిల్‌గా ఎంచుకున్నారు హరీష్‌శంకర్. ఈ చిత్రాన్ని అరుణాచల్ క్రియేషన్స్ పతాకంపై కొమ్మలపాటి కృష్ణ నిర్మించబోతున్నారు. యువకథానాయకుడు నటిస్తారు. ఈ సినిమాకు సంబంధించిన వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు. ప్రస్తుతం హరీష్‌శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు 'దాగుడు మూతలు' చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్వ నిర్మాణపనులు జరుగుతున్నాయి. నితిన్, శర్వానంద్ కథానాయకులుగా నటిస్తారు. ఈ సినిమా పూర్తయిన తర్వాతే 'సీటీమార్' సెట్స్‌పైకి వెళ్తుందని తెలిసింది.



మహేష్‌బాబు



అల్లు అర్జున్

రాజీ కుదిరింది!

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న 'భరత్ అనే నేను', అల్లు అర్జున్ 'నా పేరు సూర్య–నా ఇల్లు ఇండియా' చిత్రాలను ఏప్రిల్ 26న విడుదలచేయబోతున్నట్లు ఇటీవలే చిత్ర నిర్మాతలు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే రెండు భారీ చిత్రాలు ఒకే సమయంలో విడుదలకావడం పరిశ్రమకు శ్రేయస్కరం కాదని భావించిన నిర్మాతలు ఓ అవగాహనకు వచ్చారు. దిల్‌రాజు, కె.ఎల్.నారాయణ, నాగబాబు ఆధ్వర్యంలో ప్రత్యక్ష్యంగా సమావేశమైన నిర్మాతలు ఏప్రిల్ 20న 'భరత్ అనే నేను', మే 4న 'నా పేరు సూర్య–నా ఇల్లు ఇండియా' చిత్రాల్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా లగడపాటి శ్రీధర్, బన్నీవాసు మాట్లాడుతూ 'ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలన్న అభిప్రాయంతో తీసుకున్న నిర్ణయమిది. ఇందుకు సహకరించిన హీరోలు, దర్శకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం' అని తెలిపారు. 'రెండు భారీ చిత్రాల మధ్య కనీసం రెండు వారాల గ్యాప్ ఉంటే పరిశ్రమకు చాలా మంచిది. సంక్రాంతి సీజన్‌ని మినహాయిస్తే మిగిలిన సందర్భాల్లో భారీ చిత్రాల మధ్య ఇలా రెండు వారాల గ్యాప్ ఇచ్చి విడుదల చేయడం వల్ల పరిశ్రమకు ఎంతో మేలు జరుగుతుంది. ఇరు చిత్రాల నిర్మాతలు ఓ అవగాహనకు రావడం శుభపరిణామం' అని నాగబాబు. కె.ఎల్ నారాయణ పేర్కొన్నారు.

ప్రేమలో 'సమ్మోహనం'

సుధీర్‌బాబు, అదితిరావ్ హైదరీ జంటగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రానికి 'సమ్మోహనం' అనే పేరును ఖరారు చేశారు. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'సమ్మోహనం అంటే మంత్రముగ్ధులను చేసే ఒక అందమైన ఆకర్షణ. ఈ సినిమాలో నాయకానాయికల మధ్యన సమ్మోహనకరమైన రొమాన్స్ ఉంటుంది. మిగతా పాత్రలు భిన్న ఆకర్షణలతో మెప్పిస్తాయి' అన్నారు. 'మూడు షెడ్యూళ్లు పూర్తయ్యాయి.



అదితిరావ్, సుధీర్‌బాబు

నేటి నుంచి మార్చి 3 వరకు నాలుగో షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో జరుపుతాం. అనంతరం హిమాచల్ ప్రదేశ్, ముంబయిలో చిత్రీకరణ జరుపుతాం. మే నెల మూడోవారంలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. వి.కె.నరేష్, తనికెళ్ల భరణి, పవిత్రలోకేష్, రాహుల్ రామకృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పి.జి.విందా, సంగీతం: వివేక్‌సాగర్, రచన–దర్శకత్వం: మోహనకృష్ణ ఇంద్రగంటి.

విధి నడిపించినట్లే..!



శ్రీకాంత్

'నేను నటిస్తున్న 125వ చిత్రమిది. ఇప్పటి వరకు అన్ని రకాల చిత్రాల్లో నటించాను. అయితే నా కెరీర్‌లోనే తొలిసారి నటించిన హారర్ సినిమా 'రారా..'. ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. ఈ తరహా ఎంటర్‌టైన్‌మెంట్ వున్న సినిమాను ఈ మధ్యకాలంలో నేను చేయలేదు. కొత్తగా వుంటుందని ప్రయత్నించాను. సినిమా ఆలస్యమైనా ఎక్కడా రాజీపడకుండా పేరున్న నటీనటులతో చేశాం' అన్నారు హీరో శ్రీకాంత్. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'రారా..'. శ్రీమిత్ర చౌదరి, విజయ్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ 'దయ్యాలతో సినిమాలు తీసి సక్సెస్ సాధించే వ్యక్తిగా కనిపిస్తాను. ఈ క్రమంలో ఓ దయ్యాన్ని ప్రేమిస్తాను. ఆ తరువాత ఏం జరిగింది?. దయ్యం బారి నుంచి ఆ దర్శకుడు ఎలా బయటపడ్డాడు అన్నదే ప్రధాన ఇతివృత్తం. మనుషులకు దయ్యాలు భయపడితే ఎలా వుంటుందనే పాయింట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించాం. చిత్రీకరణ కొంత పూర్తయిన తరువాత చిత్ర దర్శకుడికి, నిర్మాతలకు మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఆ గొడవకు ముగింపు పలికి సయోధ్య చేయాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా నా వల్ల కాలేదు. సినిమా ఆగిపోతే నిర్మాతలైన నా మిత్రుల పరువుపోతుంది. ఎలా అనుకుంటున్న సమయంలో నిర్మాతలే దర్శకుడిని తొలగించారు. ఆ తరువాత మిగిలిన చిత్రాన్ని పేరున్న ఓ దర్శకుడు పూర్తి చేశారు. పేరు వేస్తామని చెప్పినా ఆయన అంగీకరించలేదు. ఒకసారి విలన్‌గా..ఇప్పుడు హీరోగా విధి ఎలా నడిపిస్తే అలా నడుస్తున్నాను. ప్రస్తుతం నా చేతుల్లో ఏమీ లేదు. నచ్చింది చేసుకుంటూ ముందుకు సాగుతున్నాను' అన్నారు.



గురువారం సచివాలయంలో కెనడా ప్రతినిధులతో భేటీ అయిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. చిత్రంలో ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్ శర్మ, ఈఎన్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ఉన్నారు.

కెనడా ప్రతినిధులతో మంత్రి తుమ్మల భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రహదారుల అభివృద్ధి కోసం నిధుల సేకరణపై కెనడా ప్రతినిధులతో రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు గురువారం సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రోడ్ల అభివృద్ధికి ఏ రకంగా నిధులను తీసుకోవచ్చనే అంశంపై చర్చించారు. నిధుల సేకరణ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకుంటామని కెనడా ప్రతినిధులకు తుమ్మల వివరించారు. సమావేశంలో ఆర్ అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ రవీందర్‌రావు, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీగా కోఠి ఉమెన్స్ కాలేజీ

- విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తాం
- డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి
- అధికారులతో కలిసి కళాశాలలో వసతుల పరిశీలన



గురువారం కోఠి ఉమెన్స్ కళాశాలలో వసతులను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో తొలి మహిళా యూనివర్సిటీగా ఏర్పాటుచేసేందుకు కోఠి ఉమెన్స్ కళాశాలకు అన్ని అర్హతలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. త్వరలో సీఎం కేసీఆర్ ఆమోదంతో మహిళా కళాశాలను మహిళా యూనివర్సిటీగా ఏర్పాటుచేసి, రాబోయే విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తామని చెప్పారు. కావాల్సిన మౌలిక సదుపాయాలపై నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను కడియం ఆదేశించారు. నివేదిక అందాక ఇతర వసతులను కల్పిస్తామని చెప్పారు. విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ఎస్ రామచంద్రం, రిజిస్ట్రార్ గోపాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతాత్మతో కలిసి కోఠిలోని మహిళా కళాశాలను కడియం గురువారం సందర్శించారు. సుమారు 40 ఎకరాల స్థలంలో ఉన్న ఉమెన్స్ కాలేజీ పరిసరాలను, వసతులు, భవనాలు, విద్యాబోధన తీరును పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఈ కాలేజీలో బోధన వసతులు సంతృప్తికరంగా ఉన్నాయని, విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అనుగుణంగా వాతావరణం ఉన్నదని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యార్థినులతోపాటు సోమాలియా వంటి విదేశీయులు కూడా ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉండేదని, ఇప్పుడు తెలంగాణలో మహిళా విశ్వవిద్యాలయం లేకుండాపోయిందని, ఇదే విషయాన్ని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ దృష్టికి తీసుకువెళ్లామని కడియం పేర్కొన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం తోడ్పాటునందించాలని కోరామని తెలిపారు. ప్రస్తుతం కళాశాలలో స్వయంప్రతిపత్తితో నడుస్తున్న 42 అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులతోపాటు ఓయూ పరిధిలో నడిచే పీజీ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇక్కడ ఒక్క పరిశోధన మాత్రమే లేదని, విశ్వవిద్యాలయంగా మారితే అది కూడా ప్రారంభమవుతుందని చెప్పారు. ఇటీవల నిర్వహించిన ఓయూ స్వర్ణోత్సవాల సందర్భంగా సీఎం కేసీఆర్ రూ.200 కోట్లు నిధులు కేటాయించారని, దీనికి అనుబంధంగా ఉన్న కోఠి మహిళా కాలేజీకి రూ.37 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు.

దవాఖానాల్లో పేషెంట్‌కేర్ సర్వీస్ ప్రొవైడర్ల భర్తీ

150 పోస్టులు అనుమతిస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని సర్కారు దవాఖానల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల దృష్ట్యా.. రోగుల సంఖ్య పెరుగుతున్నది. దీంతో రోగులకు పూర్తిస్థాయి సేవలు అందించేందుకు పేషెంట్ కేర్ సర్వీస్ ప్రొవైడర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలో నిర్వహిస్తున్న సర్కారు దవాఖానల్లో పనిచేసేందుకు ఔట్‌సోర్సింగ్ విధానంలో 150 పేషెంట్‌కేర్ సర్వీస్ ప్రొవైడర్ పోస్టులు మంజూరు చేస్తూ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఏ శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాల వారీగా నల్లగొండ 32, ఖమ్మం 17, కరీంనగర్ 15, వరంగల్ 3, హైదరాబాద్ 40, రంగారెడ్డి 6, మహబూబ్‌నగర్ 26, ఆదిలాబాద్ 7, నిజామాబాద్ 4 పోస్టులు మంజూరు అయ్యాయి.

ఆక్రమణల నుంచి భూములకు విముక్తి

భూరికార్డుల ప్రక్షాళనలో వెలుగుచూసిన భూ ఆక్రమణ

మంచిరేవుల గ్రామంలో పేదల భూములను పెద్దల చేతుల్లో పెట్టిన సమైక్య పాలకులు

ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి భూములను పేదలకు అప్పగించిన తెలంగాణ సర్కారు

రికార్డుల్లో పేదల పేర్లు ఎక్కించిన అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర ప్రభుత్వం పతిష్ఠాత్మకంగా చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన సీమాంధ్ర పాలకుల భూఆక్రమణలను బట్టబయలు చేసింది. తెలంగాణ రైతులు సీమాంధ్రపాలనలో ఏ విధంగా దగా పడ్డారో వెలుగులోకి వచ్చింది. కోట్ల రూపాయల విలువచేసే భూములు భూరికార్డుల ప్రక్షాళనతో పేదలకు దక్కాయి. రెవెన్యూ అధికారులు పాతదస్త్రాలను బయటకు తీసి వాస్తవాలను నిగ్గుతేల్చారు. రికార్డులను సరిచేసి, భూమి యజమానులైన పేదరైతులకు భూములను అప్పగించిన ఘటన నగర శివారు ప్రాంతమైన రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామంలో వెలుగు చూసింది.

బాధితుల్లో ఆనందం

భూరికార్డుల ప్రక్షాళనలో అధికారుల బృందం ఇంటింటికి తిరిగి 1(బి) నకలు పంపిణీ చేసే సమయంలో ఈ విషయం వెలుగు చూసింది. రెవెన్యూ అధికారులు స్వయంగా అక్రమాన్ని వెలుగులోకి తీసుకురావడంతో బాధితులు ముందుకు వచ్చారు. తమభూమిని తమపేరుతో రికార్డుల్లో ఎక్కించాలని దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారులకు చెందిన భూమిని ఫైనల్‌గా రికార్డుల్లోకి ఎక్కించారు. ఈ మేరకు గండిపేట తహసీల్దారు ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారు. దీంతో ఈ భూమికి వారసులైన 30 కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది.

నిజాం కాలంలో జాగీర్దార్‌గా ఉన్న హైదరలీ మీర్జాకు సాయిబాబానగర్, బుద్వేల్, మంచిరేవుల, గోపనపల్లి గ్రామాల్లో వందల ఎకరాల భూములున్నాయి. అయితే మంచిరేవుల గ్రామంలోని 477 నుంచి 480 వరకు, 483 నుంచి 494తో పాటు 497 సర్వేనంబర్లలో ఉన్న 76 ఎకరాల 7 గుంటల భూమిని ఇదే గ్రామానికి చెందిన కొల్లూరు అంజయ్యకు విక్రయించారు. వివిధ కారణాల వల్ల ఈ భూమి మ్యుటేషన్ కాలేదు. ఆ తరువాత హైదరలీ మీర్జా చట్టప్రకారంగా మ్యుటేషన్ జరుపకుండా తాత్సారం చేయడంతో కొల్లూరు అంజయ్య ఆనాడు భూవివాదాలు పరిష్కరించే నిజాం-ఇ-అత్యాత్‌ను ఆశ్రయించారు. అన్ని విషయాలను పరిశీలించిన ఈ కోర్టు 1959లో కొల్లూరు అంజయ్య కొనుగోలు చేసిన 76 ఎకరాల 7 గుంటల భూమిని అంజయ్య పేరున మ్యుటేషన్ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు 1961లో అప్పటి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ (అప్పటికి రంగారెడ్డి జిల్లా ఏర్పాటు కాలేదు) ఆనాటి హైదరాబాద్ వెస్ట్ తహసీల్దార్‌కు న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నాటి తహసిల్దార్ హైదరలీ మీర్జాకు నోటీసులు ఇచ్చి స్టేట్‌మెంట్ రికార్డు చేశాడు. ఈ మేరకు ఆనాడు హైదరలీ మీర్జా తాను విక్రయించిన భూమిని కొల్లూరు అంజయ్య కొనుగోలు చేశాడని, ఆస్తిని అంజయ్య పేరున బదిలీ చేయాలని లిఖితపూర్వకంగా రాసిచ్చారు. తహసీల్దార్ భూ రికార్డులలో మార్పులు చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కానీ నాటి రెవెన్యూ అధికారులు, సీమాంధ్ర పాలకులతో కుమ్మక్కయి భూరికార్డులు మార్చలేదు. హైదరలీ మీర్జా పేరును పహణీల్లో కొనసాగించారు. మర్రిచెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 1991లో వ్యవసాయ రైతుల ప్రయోజనాల కోసం గ్రామాలు తిరిగి ఆర్వోఆర్ చట్టం కింద రికార్డుల్లో మార్పులుచేర్పులు చేశారు. ఆనాడు కొల్లూరు అంజయ్య కొనుగోలు చేసిన భూములను పరిశీలించిన రెవెన్యూ అధికారులు వారిపేరున రికార్డుల్లో మార్పులు చేయాలని ఆదేశించారు. కానీ అప్పటికే సీమాంధ్ర భూకబ్జాదారులు 26 ఎకరాల భూమిని కాజేశారు. దీనిపై అంతగా పరిజ్ఞానం లేని కొల్లూరు అంజయ్య వారసులు మిగిలిన భూమినైనా తమ పేరున నమోదు చేస్తే చాలని భావించి ఆమేరకు రికార్డుల్లో మార్పులు చేయాలని చెప్పారు. నాటి ఆర్వోఆర్‌లో చేసిన విజ్ఞప్తి మేరకు 1993లో పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇచ్చారు. కానీ 1(బి) రికార్డులో మార్పులు చేయలేదు. సీమాంధ్ర భూ ఆక్రమణదారులు చేసిన నిర్వాకం ఫలితంగానే పాస్ పుస్తకాలు ఇచ్చినా రికార్డుల్లో మార్పులు చేయలేదు. అయిన కాడికి ఈ భూమిని కబ్జా చేశారు. దీంతో పేదల భూమి ఆక్రమణకు గురయ్యింది. మిగిలిన కొద్దిపాటి భూమిని కూడా కాజేయడానికి హైదరలీ మీర్జా వారసులమంటూ కొందరు తమపేరుతో ఈ భూమిని రికార్డుల్లో నమోదు చేయాలని భూరికార్డుల ప్రక్షాళనలో దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తు ఆధారంగా ఏదో అనుమానం వచ్చిన రెవెన్యూ అధికారులు మొత్తం అన్ని రికార్డులను పరిశీలించి.. గ్రామంలో విచారించారు. రికార్డుల్లో తమ భూమికి ఇతరుల పేర్లు రావడం ఏమిటని వెంటనే తహసీల్దార్‌కు బాధితులు దరఖాస్తు చేశారు. ఈ రెండు దరఖాస్తులపై లోతైన విచారణ చేసిన అధికారులు కొల్లూరు అంజయ్య వారసులకు చెందిన భూమిని అక్రమంగా కాజేస్తున్న విషయాన్ని బట్టబయలు చేశారు. ఈ భూమి కొల్లూరు అంజయ్య వారసులకు చెందుతుందని తేల్చారు. ఈ మేరకు రికార్డుల్లో మార్పులు చేయాలని గత ఫిబ్రవరి 14న గండిపేట తహసీల్దారుకు ఉత్తర్వులు జారీచేశారు. దీంతో మంచిరేవుల గ్రామ రైతులు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

దశాబ్దాల సమస్యకు మోక్షం లభించింది



గత యాభైఏండ్లుగా మా కుటుంబ పెద్దలకు సంబంధించిన భూమిని రికార్డులలో నమోదు చేయాలంటూ అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేకపోయింది. ఫలితంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించి దశాబ్దాలపాటు న్యాయం కోసం పోరాటం చేశాం. తెలంగాణ సర్కారు చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనలో అది మాకు చెందిన భూమిగా అధికారుల విచారణలో తేలింది. ఏండ్ల తరబడి చేస్తున్న పోరాటానికి కేసీఆర్ ప్రభుత్వంలో న్యాయం జరిగినందుకు సంతోషంగా ఉంది. **- కొల్లూరు క్రిష్ణ-పట్టాదారు**

భయపెట్టినా..ఎక్కడా జంకలేదు



మంచిరేవుల-నార్సింగి గ్రామాల పరిధిలోని తమ కుటుంబానికి చెందిన భూములను కాపాడుకునే సమయంలో అనేకమంది బడా బాబులు మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేశారు. అయినా న్యాయం కోసం పోరాటం చేశాం. భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమంలో తామే అసలైన పట్టాదారులుగా రెవెన్యూ అధికారులు గుర్తించి న్యాయస్థానం తీర్పు ఆధారంగా హక్కులను కల్పించి మా కుటుంబంలో వెలుగులు నింపారు. **- కొల్లూరు ప్రేంకుమార్-పట్టాదారు**

అప్పలు చేసి న్యాయపోరాటం చేసినం



మా తాతలు సంపాదించిన భూములను కాపాడుకునేందుకు ఎంతోమందిని వేడుకున్నాం. భూవివాదాలపై చేస్తున్న పోరాటం కోసం అప్పులుచేసి కోర్టుచుట్టూ తిరిగాం. ఎంతోమంది వేధింపులను భరించాం. ప్రజాసంక్షేమాన్ని ఆకాంక్షించే సీఎం కేసీఆర్ ఆలోచనావిధానంతో ప్రవేశపెట్టిన భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమం ద్వారా దీర్ఘకాలిక సమస్యకు మోక్షం లభించింది. మా పూర్వీకుల భూములు కొల్లూరు కుటుంబ సభ్యులకు చెందడం సంతోషంగా ఉంది. **-కొల్లూరు ఆనంద్**

భూరికార్డుల ప్రక్షాళనలో వెలుగులోకి వచ్చింది



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమంలో యాభై ఏండ్ల క్రితం నుంచి వివాదంలో ఉన్న భూమికి న్యాయపరిష్కారం లభించినట్టయింది. ఇరువురి ఆరోపణలపై విచారణ జరుపగా కిందిస్థాయి రెవెన్యూ అధికారులు రికార్డుల నమోదులో జాప్యం చేయడంతో తప్పిదాలు జరుగుతూ వచ్చాయి. భూరికార్డుల ప్రక్షాళనలో రికార్డులను పరిశీలించగా అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి. న్యాయస్థానం ఆదేశాలతో తహసీల్ కార్యాలయం నుంచి భూమి కొల్లూరు అంజయ్య కుటుంబీకులకు చెందినదిగా ధ్రువీకరించాం **-సరిత-తహసీల్దారు, గండిపేట**

కంగుతిన్న ఏపీ సాక్షి..!

కృష్ణా ట్రిబ్యునల్‌కు ఇచ్చిన అఫిడవిట్‌లో తప్పులు

తెలంగాణ క్రాస్‌ఎగ్జామినేషన్‌లో తడబాటు

హైదరాబద్, నమస్తే తెలంగాణ: కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ ముందు జరిగిన విచారణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ తరపున హాజరైన సాక్షి సరైన సమాధానాలు చెప్పలేక తడబడ్డారు. ట్రిబ్యునల్‌కు సాక్షి దాఖలుచేసిన రెండు అఫిడవిట్లలో పేర్కొన్న అంశాలు పరస్పర విరుద్ధంగా తప్పులతడకగా ఉన్నట్టు విచారణలో బయటపడింది. జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు గురువారం ఏపీ తరపున సాక్షి వ్యవసాయ రంగనిపుణుడు పీవీ సత్యనారాయణ క్రాస్ ఎగ్జామిన్ జరిగింది. ఆయన ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాలయంలో అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ట్రిబ్యునల్‌కు ఆయన అందజేసిన అఫిడవిట్లలో పేర్కొన్న అంశాల్లో నిజానిజాలపై తెలంగాణ తరపున న్యాయవాది వీ రవీందర్‌రావు ప్రశ్నల వర్షం కురిపించగా, పొంతనలేని సమాధానాలు చెప్పారు. కొన్నింటికి జవాబులు దాటవేశారు. వ్యవసాయ రంగంలో బ్రీడర్ విభాగంలో పనిచేసే మీరు పలురకాల వరిని అభివృద్ధి చేశామనడంలో ఎంత వరకు నిజం ఉందన్న ప్రశ్నకు ఏపీ సాక్షి కంగారు పడ్డారు. తాను అసోసియేట్ డైరెక్టర్‌గా వివిధ స్థాయిల్లోని పరిశోధనా సిబ్బందితో సాంకేతిక అంశాలను పర్యవేక్షిస్తానని, పరిశోధనల్లో పాలు పంచుకుంటానని చెప్పారు. తెలంగాణలో ఎంటీయూ1010, 1153, 1156 లాంటి సన్నరకాల వంగడాలను 1995 ప్రాంతంలో అభివృద్ధి చేశానన్నారు. మరి ఆంధ్రా కోసం ఏంచేశారని అడిగితే అవే వంగడాల పేర్లు తెలిపారు. భిన్నమైన భౌగోళిక, వాతావరణం ఉన్న రెండు ప్రాంతాలకు ఒకే రకమైన వరి వంగడాలను ఎలా సూచించారంటే మాత్రం వివరించలేకపోయారు.

ఎన్సీసీ డిప్యూటీ డీజీగా ఎన్‌ఎన్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్సీసీ) డైరెక్టరేట్ (ఏపీ, తెలంగాణ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా ఎయిర్ కమాండర్ ఎన్ ఎన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1984లో ఎయిర్ కమాండర్‌గా సైన్యంలో చేరారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఆయన.. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తిచేశారు. మద్రాస్ యూనివర్సిటీలో డిఫెన్స్ అండ్ స్ట్రాటజీస్ స్టడీలో ఎంఫిల్, ఇగ్నో న్యూఢిల్లీ నుంచి ఎంబీఏ, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ పూర్తిచేశారు. చేతక్, చీతా, ఎంఐ-8/17/17 హెలికాప్టర్లను నడుపడంలో మంచి ప్రావీణ్యం సాధించారు. క్యాటగిరీ 'ఏ' ఫ్లైయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా గుర్తింపు పొందిన ఎన్‌ఎన్‌రెడ్డికి 5,100 గంటలకుపైగా హెలికాప్టర్ నడిపిన అనుభవం ఉన్నది. డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్ ఎయిర్‌ఫోర్స్ ఎగ్జామినర్‌గా, అండమాన్ నికోబార్ కమాండ్ అండ్ డిప్యూటీ టెక్నికల్ మేనేజర్ (ఎయిర్) కమాండ్‌స్టాఫ్ ఆఫీసర్ (ఆపరేషన్స్)గా పనిచేశారు.

పెరిగిన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్: క్రెడాయ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వరుసగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సుల నేపథ్యంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరిగిందని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు కే రాంరెడ్డి తెలిపారు. దీంతో భూముల ధరల్లో ఒక్కసారిగా పెరుగుదల కన్పిస్తున్నదని చెప్పారు. గురువారం క్రెడాయ్ హైదరాబాద్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే రెండేండ్లలో 4 లక్షల చదరపు అడుగుల నివాస గృహాలకు హైదరాబాద్‌లో గిరాకీ ఉంటుందని పేర్కొన్నారు. మార్చి మొదటివారంలో జరిగే ప్రాపర్టీషోలో సుమారు 130 మంది డెవలపర్లు పాల్గొంటారని, మూడు రోజుల పాటు జరిగే ఈ షోకు యాభై వేల మందికిపైగా సందర్శకులు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు.

ఆరురోజుల కస్టడీకి పురుషోత్తంరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తులు కల్గియున్న కేసులో హెచ్‌ఎండీఏ మాజీ అధికారి పురుషోత్తంరెడ్డిని విచారించేందుకు ఆరు రోజుల కస్టడీకి అనుమతిస్తూ ఏసీబీ ప్రత్యేక కోర్టు గురువారం ఆదేశాలిచ్చింది. వారం రోజుల కస్టడీ కోరుతూ ఏసీబీ ఈనెల 16న కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై బుధవారం వాదనలు ముగిశాయి. శుక్రవారం నుంచి ఈనెల 28 వరకు ఏసీబీ అధికారులు పురుషోత్తంరెడ్డిని విచారించనున్నారు. కాగా, పురుషోత్తంరెడ్డికి బినామీగా ఉన్న అతడి బావమరిది శ్రీనివాస్‌రెడ్డిని ఏసీబీ అధికారులు గురువారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడికి మార్చి 7 వరకు రిమాండ్ విధించింది. శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో సోదాలు చేయగా విలువైన బంగారు ఆభరణాలు, కొన్ని డాక్యుమెంట్లు లభించినట్టు తెలిసింది. ఆస్తులకు సంబంధించిన పలు డాక్యుమెంట్లు దొరక్కుండా దాచిపెట్టినట్టు ఏసీబీ గుర్తించింది.

సీసీ కెమెరాలతోనే సేఫ్ తెలంగాణ



గురువారం మారియట్ హోటల్లో డిజిథాన్ లోగోను ఆవిష్కరిస్తున్న రాష్ట్రహోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సీసీ కెమెరాలతోనే 'సురక్షిత తెలంగాణ' సాధ్యమని రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అభిప్రాయపడ్డారు. ఒక్క కెమెరా 100 మంది కానిస్టేబుళ్లతో సమానమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 10 వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని మారియట్ హోటల్లో గురువారం 'సెక్యూర్ డిజిథాన్', 'మేక్ తెలంగాణ సేఫ్' కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిథాన్ లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణలో శాంతిభద్రతలను పూర్తిగా అదుపుజేయగలిగామన్నారు. నేరం జరిగిన 24 గంటల్లోనే నేరస్థులను అదుపులోకి తీసుకుంటున్నామని చెప్పారు. కేబీఆర్ పార్క్ వద్ద కాల్పులు, కిడ్నాప్, బేగంబజార్ ప్లాస్టిక్ వ్యాపారి కుమారుడి కిడ్నాప్‌లను సీసీ కెమెరాల సహకారంతోనే ఛేదించినట్లు పేర్కొన్నారు.

భద్రతకు అధిక ప్రాధాన్యం..

రాష్ట్రంలో శాంతియుత వాతావరణం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని భావించి సీఎం కేసీఆర్ భద్రతకు ప్రాధాన్యమిస్తున్నారని నాయిని పేర్కొన్నారు. అమెరికాలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ తరహా సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటుచేయబోతున్నామని చెప్పారు. నేరస్థులను వేగంగా గుర్తించడం, తీవ్రవాద, ఉగ్రవాద కార్యకలాపాలను అదుపుజేయడంలో రాష్ట్రం ముందంజలో ఉందని తెలంగాణ వాటర్ రీసోర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీ ప్రకాశ్ అభిప్రాయపడ్డారు.

టిటాతో జైకామ్ ఎంఓయూ..

సెక్యూరిటీ డిజిథాన్ కార్యక్రమంలో భాగంగా జైకామ్ ఎలక్ట్రానిక్ సెక్యూరిటీ సిస్టమ్స్, తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టిటా) అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. హోం మంత్రి నాయిని సమక్షంలో జైకామ్ ఎండీ ప్రమోద్‌రావు, టిటా వ్యవస్థాపక అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాల ఒప్పందపత్రాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీశాఖ జాయింట్ డైరెక్టర్ ముస్తఫా షేక్, తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాణాప్రతాప్, శ్రీలత, జైకామ్ ప్రతినిధి ప్రదీప్, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు గోపిరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

339 మంది హజ్ యాత్రికుల సీట్లు రద్దు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర హజ్‌కమిటీ ద్వారా హజ్‌యాత్రకు ఎంపికైనయాత్రికుల్లో 339 మంది సీట్లు ప్రయాణఖర్చు వాయిదా చెల్లించకపోవడం, ఎటువంటి సమాచారం లేని కారణంగా రద్దయ్యాయి. వీరి స్థానంలో వెయిటింగ్ జాబితాలో ఉన్న యాత్రికులకు అవకాశం లభించనున్నది.

రాష్ట్రవ్యాప్తంగా ఈ-పాస్

- పౌరసరఫరాలశాఖలో అత్యున్నత సాంకేతికత
- దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ
- ఇది క్లిష్టమైన ప్రాజెక్టు: కమిషనర్ సీవీ ఆనంద్



గురువారం పౌరసరఫరాలశాఖలో మీడియాతో మాట్లాడుతున్న కమిషనర్ సీవీ ఆనంద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాలశాఖలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అత్యున్నత సాంకేతిక ప్రయోగం సత్ఫలితాలిస్తున్నది. అక్రమాలకు అడ్డుకట్ట వేసి, ప్రతి గింజా లబ్ధిదారులకే చేరాలన్న లక్ష్యంతో చేపట్టిన ఈ-పాస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్నది. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని 17 వేల రేషన్ దుకాణాల్లో ఈ-పాస్ మెషిన్ల ఏర్పాటై ఆహారభద్రత కార్డుదారులకు సేవలు అందుతున్నాయి. 'ఇది అత్యంత కష్టమైన, క్లిష్టమైన ప్రాజెక్టు. దేశంలో ఎవరూ చేయలేదు. ఎంతో కష్టపడి ప్రాజెక్టును విజయవంతం చేశాం. పౌరసరఫరాలశాఖలో అత్యున్నత సాంకేతికతను వినియోగించడం గర్వకారణం. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, పౌరసరఫరాల మంత్రి ఈటల రాజేందర్ ఎంతో సహకరించారు' అని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ చెప్పారు. గురువారం పౌరసరఫరాలశాఖలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'ఈ- పాస్ వినియోగంతో పూర్తిస్థాయిలో అక్రమాలకు చెక్ పడుతున్నది. దీర్ఘకాలికంగా ఉన్న అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతున్నది. ప్రభుత్వం పెద్దఎత్తున ఖర్చుచేస్తున్న నిధులను లబ్ధిదారులకు చేర్చేందుకు అందరూ సహకరించాలి. బియ్యం తీసుకోని వారు ఆహారభద్రత కార్డులను తిరిగి ఇచ్చేయాలి. కచ్చితంగా ఉండాల్సిన గుర్తింపు పత్రంగా వాటిని చూడవద్దు. నూతన విధానం వినియోగం వల్ల గడిచిన 23 నెలల్లో రెండులక్షల టన్నుల బియ్యం రూపంలో రూ.578 కోట్లు ఆదా అయ్యాయి' అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టును విజయవంతం చేసేందుకు కృషిచేసిన అధికారులకు ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు.

200 కోట్లతో రాష్ట్ర రైతు సమన్వయ సమితి కార్పొరేషన్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రైతును రాజుగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. వ్యవసాయానికి దన్నుగా నిలుస్తూ రైతు సమన్వయ సమితుల పేరుతో రైతులందరినీ సంఘటితం చేస్తున్నది. వారి కోసం ఇప్పుడు 'తెలంగాణ రైతు సమన్వయ సమితి' పేరుతో రూ.200 కోట్ల మూల ధనంతో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. 30 జిల్లాలో జిల్లా రైతు సమన్వయ సమితులను కూడా ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ కార్పొరేషన్‌కు చైర్మన్‌గా వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి, డైరెక్టర్లుగా వ్యవసాయ శాఖ కమిషనర్, ఉద్యానవనశాఖ కమిషనర్లు ఉంటారు. రైతు వేదిక నుంచి వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్లు నియమితులవుతారు. ఆర్థికశాఖ ప్రతినిధి నామినిగా ఉండే ఈ కార్పొరేషన్‌లో 6 నుంచి 15 మంది రైతులు ప్రతినిధులుగా ఉంటారు. ఈ ప్రకారం రైతు కార్పొరేషన్‌కు మొదటి డైరెక్టర్లుగా వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి, వ్యవసాయశాఖ కమిషనర్ ఎం జగన్ మోహన్, హార్టికల్చర్ కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి, అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్ జీ లక్ష్మీబాయి ఉంటారు. రాష్ట్ర రైతుసమితికి పూర్తిస్థాయి మేనేజింగ్ డైరెక్టర్ నియమితులయ్యే వరకు వ్యవసాయశాఖ కమిషనర్ ఆ బాధ్యతలు నిర్వహిస్తారు.రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని శరవేగంగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతోపాటు, పంటల ఉత్పత్తి సామర్థ్యం పెంపు, ధాన్యం కొనుగోలు, రైతు ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం పెంపు, ధాన్యం ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఉద్యానవనాల ఉత్పత్తులు పెంచడం లక్ష్యంగా రైతు సమితి ఆవిర్భవించింది. వ్యవసాయానికి, పండ్ల తోటల ఉత్పత్తులకు సంబంధించి తెలంగాణ అతి ముఖ్యమైన రాష్ట్రం. ఇటువంటి రాష్ట్రంలో అన్ని రకాల పంటల ఉత్పత్తులు, ఉత్పాదకతలు పెంచడంతోపాటు రైతులకు ఆదాయం పెంచడం, వారి సంక్షేమం కోసం ఈ సమితి ఏర్పాటైంది. ముఖ్యంగా వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం, అందుబాటులో ఉన్న అపారమైన వనరులను వినియోగించుకోవడానికి సమ్మిళితమైన ప్రణాళికల రూపకల్పన కోసం కూడా సమితి సేవలను వినియోగిస్తారు. రైతు సమన్వయ సమితి ఏర్పాటు రాష్ట్రంలో రెండో హరిత విప్లవం వంటిది. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదని గమినించిన ప్రభుత్వం ఆ సమస్య పరిష్కారానికి సమితిని ఏర్పాటు చేసింది. రైతులకు లాభం వచ్చేలా మార్కెట్ పరిస్థితులను గుర్తించి వ్యాపారస్థులు, కంపెనీలతో చర్చలు జరిపి పంట ఉత్పత్తులకు మంచి ధరలు వచ్చేలా సమితి కృషి చేస్తుంది. రాష్ట్రంలో వరి, మక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి పంటలకు తగిన నేలలు, వాతావరణ పరిస్థితులు పరిశీలించి, ఏ సమయంలో ఏ పంటలు వేయాలి, ఉత్పత్తి పెంచడానికి పంట కాలనీల ఏర్పాటు తదితర పనులను ఈ సమితి చేపడుతుంది. రాష్ట్రంలో ఉద్యాన పంటల అభివృద్ధికి అనువైన పరిస్థితులు బలంగా ఉన్నాయి. ముఖ్యంగా మామిడి, సిట్రస్, కూరగాయలు, పాలీహౌస్ సాగు, పసుపు, మిరప పంటల ఉత్పత్తి పెంచి రైతులు లాభం పొందేలా చేయవచ్చు, ఈ దిశగా ఇప్పుడు సమితి పనిచేస్తుంది.అలాగే రాష్ట్రంలో ఇన్‌పుట్ అవసరం ఎంత? వాటిని సమర్థవంతమైన సరఫరాచేయడానికి కావాల్సిన ప్రణాళికలు రూపొందిస్తుంది.

సమితి ఉద్దేశాలు- లక్ష్యాలు

రైతుల పంటకు కనీస మద్దతు ధర, గిట్టుబాటు ధలు వచ్చేలా చూడడం, రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉండేలా చర్యలు, వినియోగ దారులకు, ప్రజలకు కల్తీ లేని స్వచ్ఛమైన వ్యవసాయ ఉత్పత్తులు అందించడం. హార్టికల్చర్, అగ్రికల్చర్ ఇతర అన్ని విభాగాలను సమన్వయం చేసి కన్సల్టేషన్ చేయడం, పంట ఉత్పత్తులను రైతుల నుంచి వినియోగదారులకు చేరేదాక ఒక చైన్ సిస్టమ్‌ను అభివృద్ధిచేయడం, పీపీపీ మోడల్లో ఫుడ్ పార్కుల ఏర్పాటుతోపాటు, ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతులు పెంచడం లక్ష్యంగా సమితి పాటుపడుతుంది.

రైతుసమితి విధులు, బాధ్యతలు..

రైతులు, రైతుసమితి సభ్యులు క్షేత్ర స్థాయిలో పరిశీలించే అవకాశం కల్పించడం, రైతులకు మెరుగైన వ్యవసాయ పద్ధతులు అవలంబించడానికి కావాల్సిన శిక్షణ, ఇతర రాష్ట్రాలలో మార్కెట్ యార్డులు పరిశీలించి కొత్త పద్ధతులు తెలుసుకునేలా చేయడం, చిన్న, సన్నకారు రైతులకు సాగు పెట్టబడి తగ్గించే విధంగా అవగాహన కలిగించడం, జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, నిపుణులు, ఐసీఏసీ ఇన్‌స్టిట్యూట్‌తోపాటు వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయాల సహకారాన్ని తీసుకుని వ్యవసాయఅభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం. వ్యవసాయం, హార్టికల్చర్ రంగాలలో జాతీయ అంతర్జాతీయ సంస్థలతో పాటు యూనివర్సిటీలతో ఎంఓయూలు కుదుర్చుకొని పని చేయడం.రైతులకు మెరుగైన సాగు పద్దతులు, మెళుకువలు తెలుసుకోవడానికి రాష్ట్రంలో ఇతర రాష్ట్రాలలో క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం, రైతులకు లాభం చేకూర్చే విధంగా సుస్థిరమైన వ్యవసాయం కోసం సమర్థవంతంగా వనరులను వినియోగించుకోవడాన్ని ప్రోత్సహించడం..

రైతు శిక్షణ కేంద్రాల బలోపేతం..

రైతులకు గిట్టుబాటు ధర లభించనప్పుడు కార్పొరేషన్ జోక్యం చేసుకొని రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చేస్తుంది. రైతులు నష్టాలను తగ్గించి ఆదాయాన్ని పెంచుకోవడానికి పంట సేకరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్‌కు ఉపయోగ పడుతుంది. కార్పొరేషన్ ఉత్పత్తి నుంచి స్థానిక వినియోగం కోసం గ్రేడింగ్, ప్రాసెసింగ్,ప్యాకింగ్, ఎగుమతి మార్కెటింగ్ కోసం కార్యకలాపాలు చేపడుతుంది. రైతులు పంటలను లాభసాటిగా అమ్ముకునే విధంగా సహాయ సహకారాలు అందించడం ప్రభుత్వ విభాగాలు ప్రభుత్వం బయట ఉన్న స్టేక్ హోల్డర్లను సమన్వయం చేయడం, వినియోగదారులకు, ఎగుమతి దారులకు కావాల్సిన ఏర్పాట్లు, పీపీపీల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, క్రాప్‌కాలనీల ఏర్పాటు ఇలా రైతులకు మేలైన మార్కెటింగ్, ఉత్పత్తి పద్ధతులు తీసుకువచ్చి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం కోసం రైతు సమన్వయ సమితి ఏర్పాటు జరిగింది.

జొన్నల కొనుగోలుకు మరో 5 కేంద్రాలు

- నేటినుంచే కొనుగోళ్ల ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎర్రజొన్నల కొనుగోలుకు మరో 5 కేంద్రాలను నూతనంగా ఏర్పాటుచేస్తున్నట్టు వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్‌లో డొంకేశ్వర్, ఆలూర్, ఖుద్వాన్‌పూర్, పిప్రి, గోవిందపేటలలో ఈ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ కేంద్రాల్లో శుక్రవారం నుంచి కొనుగోళ్లు జరుపనున్నట్టు మంత్రి చెప్పారు. ఎర్రజొన్నల రైతులను దృష్టి పెట్టుకుని కొనుగోలు కేంద్రాలను పెంచాలంటూ ఆర్మూరు శాసనసభ్యుడు ఆసన్నగారి జీవన్‌రెడ్డి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఎర్రజొన్నల కొనుగోలుకు ఐదుకేంద్రాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రైతుల నుంచి వస్తున్న డిమాండ్, శాసనసభ్యుల విజ్ఞప్తి మేరకు మరో 5 కేంద్రాలను ఏర్పాటుచేయాలని మార్క్‌ఫెడ్ అధికారులకు సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ కొత్త కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది.

బీఎస్‌ఈలో జీహెచ్‌ఎంసీ లిస్టింగ్

బాండ్లద్వారా నిధులు సమీకరించిన రెండో కార్పొరేషన్‌గా ఖ్యాతి

అట్టహాసంగా లిస్టింగ్ కార్యక్రమం • జీహెచ్‌ఎంసీ బాండ్లకు ఏఏ రేటింగ్

ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ద్వారా రూ. 200 కోట్ల సేకరణ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీలో జీహెచ్‌ఎంసీ బాండ్లు లిస్టింగ్ అయ్యాయి. గురువారం జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలో నగర మేయర్ బొంతు రామ్మోహన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషీ చేతులమీదుగా అత్యంత అట్టహాసంగా బీఎస్ఈ లిస్టింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలోనే మున్సిపల్ బాండ్లను జారీ చేయడం ద్వారా నిధులు సమకూర్చుకొన్న రెండో నగర కార్పొరేషన్‌గా జీహెచ్‌ఎంసీ రికార్డు నెలకొల్పింది. వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి పథకం(ఎస్ఆర్‌డీపీ) కోసం జీహెచ్‌ఎంసీ బాండ్లను జారీచేయడం ద్వారా రూ. 1000 కోట్లు సమీకరించడానికి నిశ్చయించి ఇటీవలే విజయవంతంగా రూ. 200 కోట్లు సేకరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు విజన్, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు మార్గదర్శకాలకు అనుగుణంగా బాండ్లను జారీచేసి నిధులు సమీకరించుకొంటున్నట్లు చెప్పారు. ఇతర మున్సిపాలిటీలకు దక్కని ఏఏ (స్టేబుల్) రేటింగ్ ఖ్యాతి మన నగరానికి దక్కడం గర్వకారణమని, ఆర్థిక క్రమశిక్షణ, స్థిరమైన అభివృద్ధితోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. నిధుల సమీకరణ తప్పుకాదని, తిరిగి చెల్లించే సామర్థ్యం ఉన్నందునే పెట్టుబడిదారులు పెద్ద సంఖ్యలో ముందుకొస్తున్నారని చెప్పారు. ఇటీవల బీఎస్ఈలో జీహెచ్‌ఎంసీ అధికారులు తొలి ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ చేసిన మూడు నిమిషాల్లోనే దాదాపు రూ. 455 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయని వివరించారు. అయినా తాము ప్రస్తుతానికి రూ. 200కోట్లు మాత్రమే సేకరించినట్లు వెల్లడించారు. సాక్షాత్తూ ప్రధాన మంత్రి, కేంద్రప్రభుత్వం కూడా స్థానిక సంస్థలు స్వయంసమృద్ధి సాధించాలని చెప్తున్నాయని గుర్తుచేశారు. నగరం శరవేగంగా విస్తరిస్తున్నదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని తెలిపారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎస్సార్‌డీపీ ప్రాజెక్టును చేపట్టామన్నారు. నిధుల రాకతో ఎస్సార్‌డీపీ పనులు మరింత వేగం పుంజుకుంటాయని మేయర్ ధీమా వ్యక్తంచేశారు. మౌలిక సదుపాయాల అభివృద్ధితోపాటు శాంతిభద్రతల విషయంలో నగరం ప్రథమ స్థానంలో ఉందని, అందుకే యావత్ దేశం దృష్టి మన నగరంపైనే ఉన్నదని పేర్కొన్నారు.



సాంకేతిక పరిజ్ఞానంతో ఆదాయ మార్గాలు

నూతన సాంకేతిక పరిజ్ఞానంద్వారా లోపాలను అరికట్టి, పన్నుల వ్యవస్థను పటిష్ఠంగా అమలు చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ పేర్కొన్నారు. పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో మున్సిపాలిటీలు స్వయంసమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని, దీనికోసం ఆర్థిక వనరులను పెంచుకునేందుకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. బాండ్ల జారీ ద్వారా బల్దియాకు జాతీయస్థాయిలో గుర్తింపువచ్చినట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ బీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. బీఎస్ఈలో లిస్టింగ్ కావడం పరపతితో కూడిన అంశమని ఆయన చెప్పారు. ఆర్థిక క్రమశిక్షణ, ఆదాయ మార్గాల పెంపు ద్వారా ఆర్థికాభివృద్ధిలో బల్దియాకు మెరుగైన రేటింగ్ వచ్చిందన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం నగరాల మేయర్లు రవీందర్‌సింగ్, ఆకుల లలిత, రూపాలాల్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి, భారతీయ స్టేట్ బ్యాంక్ కార్ప్స్, స్పా క్యాపిటల్ లిమిటెడ్, బీఎస్ఈ ప్రతినిధులతోపాటు పలువురు కార్పొరేటర్లు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

–అరవింద్‌కుమార్, మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి

అంతర్గత ఆదాయ మార్గాలను పెంచుకోవాల్సిందే

స్థానిక సంస్థలు తమ అంతర్గత ఆదాయ మార్గాలను పెంచుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధికి కృషిచేయాల్సిన ఆవశ్యకత ఉన్నదని రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు పేర్కొన్నారు. దేశంలోని 4,041 మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 39 లక్షల కోట్లు ఖర్చవుతుందని అహ్లూవాలియా కమిటీ నివేదికలో పేర్కొన్నట్లు గుర్తుచేస్తూ, ఇంత భారీస్థాయిలో నిధులను సమకూర్చడం ప్రభుత్వాలకు సాధ్యంకాదన్నారు. అందుకే ఆదాయ వనరులను పెంచుకోవడం, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా స్వయంసమృద్ధి సాధించాలని సూచించారు.

– రామకృష్ణారావు, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి

ట్రిపుల్ ఏ పాజిటివ్ స్థాయిని సాధించాలి

బల్దియా ఆర్థిక పరిస్థితి ప్రస్తుత ఏఏ (స్టేబుల్) నుంచి మరింత మెరుగైన ట్రిపుల్ ఏ (పాజిటివ్) స్థాయికి రావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆకాంక్షించారు. స్వయం సమృద్ధి సాధించడం ద్వారా జీహెచ్‌ఎంసీ ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచినట్లు పేర్కొన్నారు. దేశంలోనే తెలంగాణ అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని, నగరాల్లో హైదరాబాద్ సైతం అంతే వేగంగా అభివృద్ధి బాటలో పయనుస్తున్నదని చెప్పారు. బీఎస్ఈలో జీహెచ్‌ఎంసీ లిస్టింగ్ కావడం చారిత్రక ఘట్టమని అభివర్ణించారు.

– ఎస్కే జోషి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

వేగంగా 'పాలమూరు' పనులు

- పనులు ఆలస్యం చేసే ఏజెన్సీలపై చర్యలు
- జూలై తర్వాత గడువు పెంచే ప్రసక్తే లేదు
- కొత్త ఏజెన్సీలకు పనులు ఇవ్వాలి
- వానకాలం పంట ఆయకట్టుకు నీరివ్వాలి
- పాలమూరు ప్రాజెక్టుల సమీక్షలో మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నాలుగు ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. పనుల్లో ఆలస్యం చేసే ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం జలసౌధలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నాలుగు ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ ప్రాజెక్టుల పరిధిలోని ప్రతీ ప్యాకేజీ పనులను సుదీర్ఘంగా చర్చించారు. కొన్నిచోట్ల పనులు ఆలస్యం కావడంపై మంత్రి హరీశ్‌రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే వానకాలం నాటికి నాలుగు ప్రాజెక్టుల కింద నిర్ణీత ఆయకట్టుకు నీరందించాలని స్పష్టంచేశారు. శుక్ర, శనివారాల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యటిస్తానని, ప్రతీ ప్యాకేజీలో జరుగుతున్న పనులను సూక్ష్మస్థాయిలో పరిశీలిస్తానన్నారు. శుక్రవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులపై సమీక్షా సమావేశం నిర్వహిస్తానని మంత్రి చెప్పారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ ప్రక్రియ పెండింగ్‌లో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే భూసేకరణ అంశంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల పనులను షెడ్యూల్ ప్రకారం చేయకుండా జాప్యంచేస్తున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నత్తనడకన పనులు చేస్తున్న ఏజెన్సీలను గుర్తించి, ఆయా ఏజెన్సీలను 60 సీ నిబంధనల కింద టర్మినేట్ చేసి, వేరే ఏజెన్సీలకు పనులు అప్పగించాలని సూచించారు. కల్వకుర్తి లిఫ్ట్-3లో నాలుగు పంపులు పనిచేస్తున్నాయని, 5వ పంపు బిగింపు పనులను త్వరగా పూర్తిచేయాలని, మార్చి నెలాఖరుకు ఈ పనులు పూర్తికావాలని ఆదేశించారు. లిఫ్ట్-2 నుంచి లిఫ్ట్-3 వరకు తవ్విన టన్నెల్‌లో 1, 2 కిలోమీటర్ల లైనింగ్ పనులను జూలై వరకు పూర్తిచేయాలని స్పష్టంచేశారు. జూలై తర్వాత ఏజెన్సీలకు గడువు పెంచే ప్రసక్తే లేదని మంత్రి తేల్చిచెప్పారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల కింద ఇప్పటికే 5 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నామని వివరించారు. కల్వకుర్తి నుంచి 3.75 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాల్సి ఉండగా ఇప్పటివరకు 2.50 లక్షల ఎకరాలకు నీటిని అందించామన్నారు. భీమా కింద 2.03 లక్షల ఎకరాలకుగానూ లక్ష ఎకరాలకు సాగునీటిని అందించామని, నెట్టెంపాడు పరిధిలో 2 లక్షల ఎకరాలకుగాను లక్ష ఎకరాలకు, కోయిల్‌సాగర్ కింద 50 వేల ఎకరాలకుగాను 20వేల ఎకరాలకు సాగునీటిని అందించామని చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గంలో 15 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తలపెట్టిన చంద్రసాగర్ ఎక్స్‌టెన్షన్ కెనాల్ నిర్మాణ పనుల ఆమోదానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. సమావేశంలో ఈఎన్సీ మురళీధర్‌రావు, ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టుల సీఈ ఖగేందర్, ఎస్ఈలు భద్రయ్య, రఘునాథరావు పాల్గొన్నారు.

తొలి ప్రాధాన్యం రైతులే

ఎకరం కూడా ఎండనివ్వం

యాసంగిలో ఎల్ఎండీ పరిధిలో తడులవారీగా నీళ్లు

ఎస్సారెస్పీపై సమీక్షలో మంత్రి ఈటల రాజేందర్



గురువారం సచివాలయంలో ఎస్సారెస్పీ నీటి పంపిణీపై సమీక్షిస్తున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్ దేవసేన ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని, నాణ్యమైన కరెంటు, నీళ్లు, పంటకు గిట్టుబాటు ధర కోసం అనుక్షణం ఆరాటపడుతున్నామని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. యాసంగిలోఎకరం కూడా ఎండిపోకుండా పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. గోదావరిపై నిర్మిస్తున్న ప్రాజెక్టులతో కరీంనగర్ జిల్లాను సస్యశ్యామలం చేయబోతున్నామని గురువారం సచివాలయంలో ఎస్సారెస్పీ నీటి పంపిణీపై జరిగిన సమీక్ష మంత్రి ఈటల వెల్లడించారు. ప్రస్తుతం ఎగువ ఎల్ఎండీకి 5,6,7,8 తడులు, దిగువ ఎల్ఎండీకి మరో మూడు తడుల నీళ్లు ఇచ్చే అంశంపై చర్చించారు. ప్రస్తుతం ఎస్సారెస్పీలో 27 టీఎంసీలు, ఎల్ఎండీలో 10 టీఎంసీల నీళ్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎగువ ఎల్ఎండీలో 5, 6 తడులకు ఒక్కో తడి ఏడు రోజులు, 7, 8 తడులకు ఒక్కో దానికి 6 రోజులపాటు నీళ్లు ఇవ్వాలని, దిగువ ఎల్ఎండీకి 4వ తడికి 7రోజులు, 5, 6వ తడులకు 6 రోజులు నీళ్లు ఇవ్వాలని నిర్ణయించినట్టు మంత్రి ఈటల తెలిపారు. వానాకాలంలో దోమకాటుతో పంటలు నష్టపోయామని, యాసంగికి నీళ్లు ఇవ్వాలని సీఎం కేసీఆర్‌కు కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులు కలిసి విన్నవిస్తే.. మంజీర నీళ్లను సింగూరు నుంచి ఎస్సారెస్పీకి మీదుగా ఇచ్చారని గుర్తుచేశారు. ఆ నీటితో ఎగువ ఎల్ఎండీ పరిధిలో నాలుగు లక్షల ఎకరాలు, సరస్వతి కాల్వ ద్వారా ఆదిలాబాద్‌కు, ఎత్తిపోతల ద్వారా నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో రెండు లక్షల ఎకరాల పంటను కాపాడుతున్నామని చెప్పారు.

పొలాలపైనా ప్రతిపక్షాల రాజకీయం

పంట ఎండిపోకూడదని ప్రభుత్వం కష్టపడుతుంటే, కొందరు ప్రతిపక్ష నేతలు పొలాలు ఎండిపోవాలని.. వాటిపైన రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. సమీక్షలో పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, పెద్దపల్లి కలెక్టర్ దేవసేన ఉన్నారు.



గురువారం రంగారెడ్డి జిల్లా జీడిమెట్లలోని సెంట్రల్ ఆఫ్ ఎక్సెలెన్సీ ఫ్రూట్స్ అండ్ వెజిటెబుల్ సెంటర్‌లో జర్మనీ, నాబార్డు ప్రతినిధుల బృందం

ఉద్యానశాఖ పనితీరు భేష్

- జర్మనీ, నాబార్డు ప్రతినిధుల ప్రశంస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఉద్యానశాఖ పనితీరు ప్రశంసనీయంగా ఉన్నదని జర్మనీ, నాబార్డు ప్రతినిధుల బృందం కొనియాడింది. గురువారం రంగారెడ్డి జిల్లా జీడిమెట్లలోని సెంట్రల్ ఆఫ్ ఎక్సెలెన్సీ ఫ్రూట్స్ అండ్ వెజిటెబుల్ సెంటర్‌ను ఈ బృందం సందర్శించింది. కూరగాయల మొక్కలు, పండ్ల తోటలు, రైతులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను పరిశీలించి.. సాగులో వచ్చే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను బృంద సభ్యులు అడిగి తెలుసుకున్నారు. సీఎం కేసీఆర్, వ్యవసాయశాఖ మంత్రి పోచారం, వ్యవసాయశాఖముఖ్య కార్యదర్శి పార్థసారథి, కమిషనర్ వెంకట్రాంరెడ్డి ఈ శాఖపై తీసుకుంటున్న చర్యలను ప్రతినిధుల బృందం ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నది. ఉద్యాన పంటలపై ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను డిప్యూటీ డైరెక్టర్ భాగ్యలక్ష్మి.. విద్యుత్, పంట మొక్కల గురించి ఏడీహెచ్ రాజ్‌కుమార్, మైక్రో ఇరిగేషన్ పద్ధతులపై రంగారెడ్డి జిల్లా డీడీ బాబు ప్రతినిధుల బృందానికి వివరించారు. ఉద్యానశాఖ తరపున చేపట్టిన యూఐసీ ప్రాజెక్టు ఎందరికో ఆదర్శంగా ఉన్నదని జర్మనీ, నాబార్డు ప్రతినిధులు ప్రశంసించారు.


షీలాబిడే కమిటీకి నివేదికలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తొమ్మిదో షెడ్యూల్ సంస్థల విభజన కోసం రాష్ట్రంలోని వివిధశాఖలు నివేదికలను సిద్ధం చేస్తున్నాయి. 27న షీలాబిడే కమిటీకి ఈ నివేదికలను అందించనున్నారు. తొమ్మిదో షెడ్యూల్‌లో 90 సంస్థలు ఉన్నాయి. వీటిలో 70కి పైగా తెలంగాణలో ఉన్నాయి. వీటి ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విభజన అంశాలపై ఏపీ ప్రభుత్వం చట్టవ్యతిరేక నిర్ణయాలతో పీటముడి వీడటం లేదు. ఈ నేపథ్యంలో అన్నిశాఖల్లోని ఉద్యోగుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సేకరిస్తున్నారు. కమలనాథన్ కమిటీ ఏపీకి అనుకూలంగా వ్య వహరించిందని తెలంగాణ పబ్లిక్‌సెక్టార్ ఎంప్లాయిస్ నాయకులు ఆరోపిస్తున్నారు. వేల సంఖ్యలోని ఏపీ ఉ ద్యోగులు ఆప్షన్ పేరుతో తెలంగాణకు వచ్చినందున క మలనాథన్ కమిటీ మార్గదర్శకాలను తొమ్మిదో షె డ్యూల్ సంస్థల్లో వర్తింపచేయవద్దని కోరుతున్నారు. 7 0 సంస్థలలో పదివేల వరకు ఏపీ స్థానికత ఉన్న ఉద్యోగులు పనిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

రొటోమాక్ రుణాల ఎగవేత కేసులో

విక్రమ్ కొఠారీ అరెస్ట్

- ఆయన కుమారుడు కూడా..



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: రొటోమాక్ రుణాల ఎగవేత ఆరోపణల కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) స్పీడ్ పెంచింది. కంపెనీ యజమాని విక్రమ్ కొఠారీ, ఆయన కుమారుడు రాహుల్‌ని గురువారం అరెస్ట్ చేసింది. ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో బుధవారం నుంచి వీరిద్దర్ని ప్రశ్నించిన సీబీఐకి రాహుల్ నుంచి పూర్తిస్థాయిలో సహకారం లభించకపోవడంతో అరెస్ట్ చేయాల్సి వచ్చిందని ఆ వర్గాలు వెల్లడించాయి. 2008 నుంచి ఏడు జాతీయ బ్యాంకుల నుంచి రొటోమాక్ రూ.2,919 కోట్ల మేర రుణం పొందింది. ప్రస్తుతం వడ్డీతో కలుపుకొని ఇవి రూ.3,695 కోట్లకు చేరుకున్నాయి. ఇచ్చిన రుణాలు తిరిగి చెల్లించడం లేదని బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) చేసిన ఫిర్యాదు ఆధారంగా సీబీఐ ఈ చర్యలు తీసుకుంటున్నది. వీటిలో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) రూ.754.77 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) రూ.456.63 కోట్లు, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ రూ.771.07 కోట్లు, యూనియన్ బ్యాంక్ రూ.458.95 కోట్లు, అలహాబాద్ బ్యాంక్ రూ.330.68 కోట్లు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రూ.49.82 కోట్లు, ఓబీసీ రూ.97.47 కోట్ల మేర రుణం ఇచ్చాయి. రొటోమాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ విక్రమ్, ఆయన భార్య సాధన, రాహులు, పలువురు బ్యాంక్ ఉన్నతాధికారులపై బీవోబీ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. నేనేమి తప్పు చేయలేదని, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నది వాస్తవమే, నేనేమి చెల్లించలేదని అనడం లేదని సీబీఐ వర్గాలు అడిగిన పలు ప్రశ్నలకు కొఠారి ఇచ్చిన సమాధానం ఇదని తెలుస్తున్నది.

రేపటినుంచి 'టీ న్యూస్' గోల్డెన్ ప్రాపర్టీ షో

- ముఖ్యఅతిథిగా టీన్యూస్ ఎండీ సంతోష్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'టీ న్యూస్' చానెల్ ఈ నెల 24, 25 తేదీల్లో మాదాపూర్‌లోని శిల్పాకళావేదికలో ప్రప్రథమంగా 'గోల్డెన్ ప్రాపర్టీ షో' నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లో పేరెన్నికగన్న నిర్మాణ సంస్థలు తమ ప్రాజెక్టులను ప్రదర్శిస్తాయి. సొంతింటి కలను సాకారం చేసుకోవాలని భావించేవారి సౌలభ్యం కోసం 'టీన్యూస్'.. భాగ్యనగరంలోని ప్రాజెక్టుల సమాచారాన్ని ప్రజలకు ఒకచోట అందించాలన్న ఉద్దేశంతో దీనిని తలపెట్టింది. టీన్యూస్ ఎండీ సంతోష్‌కుమార్ చేతుల మీదుగా శనివారం ఈ ప్రాపర్టీ షో ప్రారంభమవుతుంది. గత కొంతకాలంగా భాగ్యనగరంలో అంతర్జాతీయ సదస్సులు విజయవంతమవుతుండడం.. మెట్రో మొదటిదశ ప్రారంభం కావడం.. బుద్వేల్‌లో సరికొత్త ఐటీ కారిడార్‌ను ప్రకటించడం.. ముచ్చర్లలో ఫార్మా కారిడార్ ఏర్పాటు చేస్తుండటం.. ఇలాంటి అనేక సానుకూలాంశాల కారణంగా కొనుగోలుదారుల ఆలోచనల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తున్నది. ఇండ్ల కొనుగోలుపై ఆసక్తి పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో 'టీ న్యూస్' నిర్వహిస్తున్న ప్రాపర్టీ షో.. ప్రజలకు చక్కగా ఉపయోగపడనున్నది.

నీరవ్‌కు బిగుస్తున్న ఉచ్చు

విలాసవంతమైన 9 కార్లు సహా.. మరో రూ.100 కోట్ల ఆస్తులు స్వాధీనం



ముంబై/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ.11,400 కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడిన ప్రముఖ వజ్రాల వ్యాపారులు నీరవ్ మోదీ, ఆయన మామ మెహుల్ చోక్సీపై జరుపుతున్న మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా వారికి చెందిన లగ్జరీ కార్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు, వారి గ్రూపు సంస్థలకు చెందిన రూ.100 కోట్లకుపైగా విలువైన షేర్లను, డిపాజిట్లను స్తంభింపజేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం వెల్లడించింది. వీటిలో మెహుల్ చోక్సీకి చెందిన రూ.86.72 కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్లు, షేర్లు, నీరవ్ మోదీకి చెందిన రూ.7.80 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు ఈడీ అధికారులు తెలిపారు. ఈ ఆస్తుల మొత్తం విలువ రూ.94.52 కోట్ల వరకూ ఉంటుందని, తాము అలాగే స్వాధీనం చేసుకున్న మరికొన్ని లగ్జరీ కార్ల విలువను కూడా కలుపుకుంటే ఈ ఆస్తుల మొత్తం విలువ రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని, దీంతో ఇప్పటికవరూ ఈ కేసులో ఇప్పటివరకూ రూ.5,826 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లయిందని వారు వివరించారు. నీరవ్ మోదీకి మామ అయిన మెహుల్ చోక్సీ గీతాంజలి జెమ్స్ గ్రూపుతో పాటు ఇతర జువెల్లరీ బ్రాండ్లకు ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్న విషయం విదితమే. పీఎన్‌బీ కుంభకోణంలో వీరిపై మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద కేసు నమోదు చేసి ఈ నెల 15వ తేదీ నుంచి దాడులు నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం వరుసగా ఎనిమిదో రోజు కూడా ఆ దాడులను కొనసాగించి, నీరవ్ మోదీకి చెందిన తొమ్మిది హై-ఎండ్ కార్లను స్వాధీనం చేసుకుంది. వీటిలో అత్యంత ఖరీదైన రోల్స్ రాయిస్ 'ఘోస్ట్' మోడల్ కారుతో పాటు మెర్సిడెస్ బెంజ్, పోర్షే బ్రాండ్లకు చెందిన రెండు కార్లు, హోండా బ్రాండ్‌కు చెందిన మూడు మోడళ్లు, టయోటా ఫార్చ్యూనర్, ఇన్నోవా కార్లు ఉన్నాయని ఈడీ అధికారులు వివరించారు.

బాకీలు తీర్చేందుకు తగిన ప్రణాళికతో రావాలి

- నీరవ్ మోదీకి పీఎన్‌బీ విన్నపం

తప్పుడు అండర్ టేకింగ్ లెటర్ (ఎల్‌వోయూ)లతో భారీగా రుణాలను పొందడం ద్వారా తమకు కలిగించిన నష్టాన్ని పూడ్చేందుకు స్పష్టమైన, అమలుకు యోగ్యమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు రావాలని వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) వేడుకున్నది. పీఎన్‌బీలోని కొంత మంది అధికారులతో కుమ్మక్కై రూ.11,400 కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడిన నీరవ్ మోదీ కొద్ది రోజుల క్రితం రాసిన లేఖకు సమాధానంగా ఆ బ్యాంకు గురువారం ఈ విజ్ఞప్తి చేసింది. 'అనధికార పద్ధతుల్లో మా బ్యాంకు అధికారుల నుంచి మీరు అక్రమంగా ఎల్‌వోయూలను పొందుతున్నారు. వాస్తవానికి మేము మీకు గానీ, మీ భాగస్వామ్య సంస్థలకు గానీ ఎన్నడూ ఇటువంటి రుణ సదుపాయాలను కల్పించలేదు' అని నీరవ్ మోదీకి రాసిన లేఖలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ అంతర్జాతీయ బ్యాంకింగ్ విభాగం జనరల్ మేనేజర్ అశ్వినీ వత్స్ స్పష్టం చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

హైదరాబాద్ శివారులో గీతాంజలి సెజ్ జప్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వేల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలను ఎగవేసి విదేశాలకు పారిపోయిన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ఆస్తులను ఆదాయం పన్ను శాఖ స్వాధీన పరుచుకుంటున్నది.. హైదరాబాద్‌లో నీరవ్ మోదీకి చెందిన గీతాంజలి గ్రూప్ ఆఫ్ కంపెనీకి చెందిన ఆస్తులను ఆదాయపు పన్ను శాఖ జప్తు చేసింది. హైదరాబాద్ శివార్లలో మహేశ్వరం వద్ద ఉన్న రూ.1,200 కోట్ల విలువైన కంపెనీ స్పెషల్ ఎకనామిక్ జోన్(సెజ్)ను తన ఆధీనంలోకి తీసుకున్నది. నీరవ్ మోదీకి చెందిన గీతాంజలి గ్రూప్‌కు 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మహేశ్వరంలో సెజ్‌ను ఏర్పాటు చేయడానికి 95 ఎకరాల భూమిని కేటాయించింది. అప్పట్లో కేవలం రూ.3.75కోట్లకు భూమిని సంస్థ కొనుగోలు చేసింది. దాని విలువ ఇప్పుడు భారీగా ఉంటుందని ఆదాయం పన్ను శాఖ అంచనా వేసింది. ఇప్పటికే సెజ్‌లోని గీతాంజలి వజ్రాల తయారీ యూనిట్‌ను ఆధీనంలోకి తీసుకుంది.



పాస్‌పోర్టు లేకుండా ఎలా..?

- విచారణకు ముఖం చాటేసిన నీరవ్
- మళ్లీ సమన్లు జారీ చేసిన ఈడీ

భారీ కుంభకోణంతో పంజాబ్ నేషనల్ బ్యాంకును నిట్టనిలువునా ముంచి, దేశం నుంచి జారుకున్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ అందరూ అనుకున్నట్లుగానే గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట విచారణకు హాజరు కాలేదు. తన పాస్‌పోర్టుపై ప్రభుత్వం తాత్కాలికంగా సస్పెన్షన్ విధించడం, పెండింగ్‌లో ఉన్న వ్యాపార సమస్యలు ఇందుకు కారణమని అతను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు అధికారికి సమాధానం పంపినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో నీరవ్ మోదీకి ఈడీ తాజాగా మరోసారి సమన్లు జారీచేసి, ఈ నెల 26వ తేదీన ముంబైలో తమ ఎదుట విచారణకు హాజరు కావాలని స్పష్టం చేసిందని ఆ వర్గాలు తెలిపాయి. ఇదిలావుంటే, పీఎన్‌బీ కుంభకోణంలో సహ నిందితుడిగా ఉన్న నీరవ్ మోదీ మామ మెహుల్ చోక్సీ శుక్రవారం ఈడీ ఎదుట హాజరు కావలసి ఉన్నది.

నీరవ్ పాస్‌పోర్టు రద్దుకు నోటీసు జారీ

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో భారీ కుంభకోణానికి పాల్పడి దేశం నుంచి జారుకున్న నీరవ్ మోదీ పాస్‌పోర్టును రద్దుచేసే విషయమై ఆయనకు నోటీసు పంపినట్లు విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) తెలిపింది. నీరవ్ సమర్పించిన ఈ-మెయిల్‌కు, అలాగే భారత్‌లోని అతని భౌతిక చిరునామాకు ఈ నోటీసును పంపినట్లు ఎంఈఏ గురువారం వెల్లడించింది. నీరవ్ మెయిలింగ్ అడ్రస్‌పై కొంత గందరగోళం ఉన్నప్పటికీ ఎంఈఏ పంపిన నోటీసు అందినట్లు అతను ధ్రువీకరించాడని, దీంతో ఈ నోటీసుపై అతను స్పందిస్తాడని ఎదురు చూస్తున్నామని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ తెలిపారు. నీరవ్‌తో పాటు ఈ కుంభకోణంలో మరో నిందితుడిగా ఉన్న అతని మామ మెహుల్ చోక్సీ పాస్‌పోర్టులను ఎంఈఏ ఇప్పటికే నాలుగు వారాల పాటు సస్పెండ్ చేసింది. దీనిపై నీరవ్, చోక్సీ నుంచి నిర్దిష్ట వ్యవధిలోగా సమాధానం రాకపోతే వారిపై తదుపరి చర్యలు చేపట్టడం ఖాయమని రవీష్ స్పష్టం చేశారు.



ఎయిర్‌సెల్ దివాలా!

తీవ్రంగా వేధిస్తున్న నిధుల కొరత.. తరచూ కాల్ డ్రాప్స్‌తో విసుగెత్తిపోతున్న కస్టమర్లు

ఒక్కరోజే 9 లక్షల మంది ఎంఎన్‌పీ ప్రయత్నాలు.. రూ.15,500 కోట్లకు చేరిన సంస్థ రుణభారం

న్యూఢిల్లీ/చెన్నై, ఫిబ్రవరి 22: ఓ వైపు కాల్ డ్రాప్స్.. మరోవైపు సంస్థ మూతబడుతున్నదన్న వార్తలు.. దీంతో దేశవ్యాప్తంగా ఒక్కరోజే లక్షలాది మంది వినియోగదారులు తమ మొబైల్ నంబర్లను ఇతర నెట్‌వర్క్‌ల్లోకి మార్చుకునేందుకు ప్రయత్నించారు. వీరంతా ఎయిర్‌సెల్ కస్టమర్లవగా, తరచూ వేధిస్తున్న కాల్ డ్రాప్స్‌తో బుధవారం దాదాపు 9 లక్షల మంది మొబైల్ నంబర్ పోర్టబులిటీ (ఎంఎన్‌పీ)కి వెళ్లారు. నిజానికి, గురుగ్రామ్‌కు చెందిన ఈ ప్రైవేట్‌రంగ టెలికం సంస్థ.. ప్రస్తుతం గడ్డు పరిస్థితులనే ఎదుర్కొంటున్నది. తీవ్ర నిధుల కొరతను చవిచూస్తున్న ఎయిర్‌సెల్.. ఇప్పటికే తమ ఉద్యోగులకు సంస్థ మూసివేతకు సంబంధించిన స్పష్టమైన సంకేతాలనిచ్చింది కూడా. ఎయిర్‌సెల్ సీఈవో ఖైజద్ హీర్జీ.. ఇటీవల ఉద్యోగులనుద్దేశించి పంపిన ఓ ఈ-మెయిల్‌లో నిధుల కొరత ఉన్నదని, ప్రస్తుత వ్యాపార కార్యకలాపాలపైనే సంస్థ భవితవ్యం ఆధారపడి ఉన్నదని చెప్పేశారు. ఇక దివాలా కోసం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వద్దకు వెళ్లే యోచనలోనూ ఎయిర్‌సెల్ ఉందన్న వార్తలు వినిపిస్తుండటం గమనార్హం. దీంతో కస్టమర్ల మదిలో ఇప్పుడు అనేక సందేహాలు మెదులుతున్నాయి.

కంపెనీ కథ కంచికేనా?

ఈ ప్రశ్నకు సమీప భవిష్యత్తులోనైతే కాదు అని సంస్థ సమాధానమిస్తున్నది. కంపెనీని మూసేస్తున్నారన్న దానిపై ఫేస్‌బుక్, ట్విట్టర్లలో పలువురు కస్టమర్లు ఆందోళన వ్యక్తం చేయడంపై ఎయిర్‌సెల్ స్పష్టత ఇచ్చింది. 'మా సేవల్ని కొనసాగిస్తాం. ఈ విషయంలో ఒకవేళ ఏవైనా అవాంతరాలు ఎదురైతే.. కస్టమర్లకు ముందే తెలియజేస్తాం' అని తెలిపింది. కాల్ డ్రాప్స్ అనేది వ్యవస్థీకృత అంతరాయం అంటూ ఓ సీనియర్ అధికారి 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా'కు తెలిపారు. త్వరలోనే పరిస్థితులు చక్కబడుతాయన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. ఈ అసౌకర్యానికి విచారిస్తున్నామంటూ క్షమాపణలు చెప్పారు. తమకు సహకరించాలని కస్టమర్లను కోరారు. అయినప్పటికీ భవిష్యత్తుపై సంస్థ నుంచి స్పష్టత రాకపోవడం, మూతపడబోదన్న విశ్వాసం కనిపించకపోవడం ఎయిర్‌సెల్ మనుగడను ప్రశ్నార్థకమే చేస్తున్నది.

కస్టమర్ల భయాలకు కారణం?

గడిచిన వారం రోజులుగా అన్ని ఎయిర్‌సెల్ సర్కిళ్లలో కస్టమర్లకు నెట్‌వర్క్ సమస్యలు ఎదురవుతున్నాయి. రాజస్థాన్, కోల్‌కతా, చెన్నై, ఒడిశా, ఢిల్లీల్లోని కొద్దిమంది మొబైల్ వినియోగదారులు తమ నంబర్లపై నెట్‌వర్క్ పనిచేయడం లేదని, తరచూ కాల్ డ్రాప్స్ అవుతున్నాయని ఇప్పటికే ఫేస్‌బుక్, ట్విట్టర్ల ద్వారా వెల్లడించారు. ఇదే సమయంలో ఎయిర్‌సెల్ దివాలా తీయనుందని, టెలికం టవర్ కంపెనీలకు భారీగా బకాయి పడిందంటూ మీడియాలో వార్తలు రావడం కస్టమర్లలో భయాలకు దారి తీసింది. ఫలితంగానే లక్షలాది మంది ఎంఎన్‌పీకి ప్రయత్నిస్తున్నారు. మంగళవారం సుమారు 3 లక్షల మంది, బుధవారం దాదాపు 9 లక్షల మంది ఎంఎన్‌పీకి విజ్ఞప్తి చేశారు. కాగా, నిరుడు సెప్టెంబర్ నాటికి దేశవ్యాప్తంగా ఎయిర్‌సెల్ కస్టమర్లు 88.8 మిలియన్లుగా ఉన్నారు. ఇందులో తమిళనాడు వాటానే 20 మిలియన్లు.

సమస్యలు మొదలైంది ఎప్పుడు?

గతనెల 30న ఎయిర్‌సెల్ దేశవ్యాప్తంగా ఆరు సర్కిళ్లలో టెలికం సేవల్ని నిలిపివేసింది. గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ (పశ్చిమ) సర్కిళ్లు మూతబడ్డాయి. రూ.60 కోట్ల బకాయిల కారణంగా 10 రోజుల కిందట ఐడియా సెల్యులార్.. ఎయిర్‌సెల్‌తో ఇంటర్‌కనెక్ట్ సేవలను కూడా నిలిపివేసింది. దీంతో ఎయిర్‌సెల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఒక్కసారిగా తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లింది. కస్టమర్ల తాకిడిని తట్టుకునే శక్తి సన్నగిల్లినట్లైంది. ఫలితంగానే కాల్ డ్రాప్స్ అవుతుండగా, చాలామంది ఇతర సంస్థల్లోకి వెళ్లిపోతున్నారు. కాగా, టెలికం రంగంలోని తీవ్ర పోటీ పరిస్థితుల మధ్య తాము సేవల్ని కొనసాగించడం కష్టమేనని ఎయిర్‌సెల్ ఇప్పటికే చెప్పింది. 2016 సెప్టెంబర్‌లో రిలయన్స్ జియో రాక నేపథ్యంలో ఎయిర్‌సెల్‌సహా మెజారిటీ టెలికం సంస్థలు నష్టాల్లో నడుస్తున్న విషయం తెలిసిందే.

దివాలా వైపు చూపేందుకు?

జియో రాకతో భారతీయ టెలికం పరిశ్రమలో సమీకరణలు ఒక్కసారిగా మారిపోయాయి. ఎయిర్‌టెల్‌సహా, వొడాఫోన్, ఐడియా సెల్యులార్‌లు భారీ నష్టాలను ప్రకటిస్తున్నాయి. ఎయిర్‌సెల్ సైతం 2016 జూలై-సెప్టెంబర్‌తో పోల్చితే 2017 అక్టోబర్-డిసెంబర్‌కు రూ.120 కోట్ల నిర్వహణ లాభం నుంచి రూ.120 కోట్ల నిర్వహణ నష్టానికి పడిపోయింది. రుణాల కోసం బ్యాంకులుసహా భాగస్వాములందరినీ సంప్రదిస్తున్నది. అయినా ఫలితం శూన్యం. బ్యాంకుల నుంచి ఇప్పటికే తీసుకున్న రూ.15,500 కోట్ల రుణాన్ని ఆర్బీఐ మొండి బకాయిగా ప్రకటించడమే దీనికి కారణం. ఎయిర్‌సెల్ బ్యాంక్ ఖాతాలనూ బ్యాంకర్లు స్తంభింపజేస్తున్నారు. ఎయిర్‌సెల్‌కు సాయమందించేందుకు మాతృ సంస్థ మ్యాక్సిస్ ముందుకు వచ్చినా.. మళ్లీ వెనుకకు తగ్గింది. చివరకు ఆర్‌కామ్‌తో విలీన ఒప్పందం కూడా రద్దైపోవడంతో దివాలా తప్ప గత్యంతరం కనిపించట్లేదు.

పెచ్చుమీరిన అసమానతలు

దేశంలో పెరిగిపోతున్న ధనిక-పేద తారతమ్యం

జీడీపీలో 15 శాతానికి ఎగబాకిన బిలియనీర్ల సంపద

మరింత దారిద్ర్యంలోకి జారుకున్న పేదలు: ఆక్స్‌ఫామ్ ఇండియా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: దేశంలో అసమానతలు పెచ్చుమీరుతున్నాయి. పేద-ధనిక తారతమ్యం క్రమేణా పెరిగిపోతున్నది. ధనికులు మరింత సంపన్నులుగా మారుతుంటే.. పేదలు ఇంకా పేదరికంలోకి దిగజారుతున్నారు. గడిచిన మూడు దశాబ్దాల్లో భారతీయ బిలియనీర్ల సంపద దేశ జీడీపీలో 15 శాతానికి ఎగిసింది. ఈ మేరకు ఆక్స్‌ఫామ్ ఇండియా నివేదిక ఒకటి స్పష్టం చేసింది. ప్రభుత్వ సరళతర విధానాలు సంపన్న వర్గాలకు కలిసొస్తున్నాయని, ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో వారసత్వం వంటివి కోటీశ్వరులకు కోట్లు తెచ్చిపెడుతున్నాయని పేర్కొన్నది. అయితే ఇదే సమయంలో పేదలు కటిక దారిద్ర్యంలోకి జారుకోవడం ఆందోళన కలిగిస్తున్నది. '1991, ఆ తర్వాతికాలంలో భారీ స్థాయిలో అమల్లోకి వచ్చిన సంస్కరణల ఫలితమే ఈ అసమానతలు' అని ఆక్స్‌ఫామ్ ఇండియా సీఈవో నిషా అగర్వాల్ తెలిపారు. దేశ జీడీపీలో ఐదేండ్ల క్రితం 10 శాతంగా ఉన్న బిలియనీర్ల మొత్తం సంపద.. ఇప్పుడు 15 శాతానికి పెరిగిందన్నారు. గతేడాది దేశంలో 101 బిలియనీర్లున్నారని ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది. ఈ క్రమంలోనే గతేడాది దేశ సంపదలో 73 శాతాన్ని కేవలం ఒక్క శాతం జనాభానే సృష్టించినట్లు తెలిపింది. 2017లో భారత్‌లోని ఒక శాతం సంపన్నుల సంపద 20.9 లక్షల కోట్ల రూపాయలకుపైగా పెరిగిందని వివరించింది. ఇదే సమయంలో దేశ జనాభాలో సగానికిపైగా సమానమైన 67 కోట్ల మంది సంపద ఒక్క శాతం మాత్రమే వృద్ధి చెందినట్లు చెప్పడం గమనార్హం. 'పెరుగుతున్న అంతరాలు: భారతీయ అసమానత నివేదిక 2018' పేరుతో విడుదల చేసిన ఓ రిపోర్టులో ఆదాయం, వినియోగం, సంపద, ప్రభుత్వ విధానాల ఆధారంగా అత్యంత అసమానతలున్న దేశాల్లో భారత్ కూడా ఒకటిగా నిలిచిందని ఆక్స్‌ఫామ్ తెలిపింది.



ప్రభుత్వం అవలంభిస్తున్న కొన్ని విధానాలతో కార్మికుల కంటే యాజమాన్యాలకే, నైపుణ్యం ఉన్నవారి కంటే లేనివారికే ఎక్కువ లబ్ధి చేకూరుతున్నదని చెప్పింది. 1980వ దశకంతో చూస్తే.. 1991 నుంచి అసమానతలు పెరిగినట్లు తేటతెల్లమైందని, 2017 వరకు ఈ అసమానత్వం కొనసాగిందని వివరించింది. కుల, మత, ప్రాంతీయ, లింగ బేధాలతో నిండిన భారతీయ సమాజాన్ని ఆర్థిక అసమానతలూ పట్టి పీడిస్తున్నాయని తమ నివేదికలో ఆక్స్‌ఫామ్ అభిప్రాయపడింది. ఈ పరిస్థితి మారాలంటే సంపద, వారసత్వ పన్నుల వంటి ప్రగతిశీల ప్రత్యక్ష పన్ను విధానాన్ని అమల్లోకి తీసుకురావడమే ఏకైక మార్గమని నివేదిక రూపకర్త ప్రొఫెసర్ హిమాన్షు అభిప్రాయపడ్డారు. ఈ విధానంలో వచ్చిన ఆదాయాన్ని పేదల అభ్యున్నతికి ఖర్చు చేయాలని, ముఖ్యంగా పేద పిల్లల ఆరోగ్యం, విద్య, పోషకాహార లోపాలను సరిదిద్దాలన్నారు. అప్పుడు మాత్రమే దేశంలో సమానత్వ సంకేతాలపై ఓ చిన్ని ఆశైనా కలుగుతుందన్నారు. కాగా, ఈ నివేదికను దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సుకు ముందే ఆక్స్‌ఫామ్ విడుదల చేసింది.

రూ.6,500 కోట్లతో కియా మోటార్స్ ప్లాంట్

ఏపీలో ఏర్పాటు చేస్తున్న సంస్థ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ వాహన తయారీ సంస్థ కియా మోటార్స్ కార్పొరేషన్..ఆంధ్రప్రదేశ్‌లో రూ.6,500 కోట్ల పెట్టుబడితో ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నది. అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్ గురువారం శంకుస్థాపన చేసింది. ఈ సందర్భంగా కంపెనీ ప్రెసిడెంట్, సీఈవో హన్-వూ పార్క్ మాట్లాడుతూ..ఈ ప్లాంట్ ద్వారా 3 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని, త్వరలో నియామక ప్రక్రియను ప్రారంభించనున్నట్లు చెప్పారు. 2.3 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్లో ప్రతియేటా 3 లక్షల కార్లు తయారుకానున్నాయి. భారతీయ కస్టమర్లకు ప్రపంచ స్థాయి కార్లను అందించాలనే ఉద్దేశంలో భాగంగా ఈ ప్లాంట్‌ను తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు.

మార్చి 31లోగా ఆధార్ లింక్ తప్పనిసరి

బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు సూచన

సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు తమ మొబైల్ సిమ్‌కార్డును మార్చి 31లోగా ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచించింది. ఆధార్‌తో సిమ్‌కార్డును లింక్ చేసుకునే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని తెలంగాణ టెలికం సర్కిల్ సీజీఎం వీ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయాల్లో, ఫ్రాంచెజ్, రిటైల్ మొబైల్ షాపుల వద్ద అనుసంధానం చేసుకోవచ్చునన్నారు. అదేవిధంగా ఐవీఆర్‌ఎస్ పద్ధతిలో 14546 నంబర్‌కు కాల్ చేసి ఆధార్ లింక్ చేసుకోవాలని సూచించారు.

ఫాంటమ్‌లో సరికొత్త వెర్షన్



ప్రారంభ ధర రూ.9.50 కోట్లు

చెన్నై, ఫిబ్రవరి 22: లగ్జరీ కార్ల తయారీ సంస్థ రోల్స్-రాయిస్.. ఎనిమిదో జనరేషన్ ఫాంటమ్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు ప్రారంభ ధరను రూ.9.50 కోట్లుగాను, గరిష్ఠంగా రూ.11.35 కోట్లకు లభించనున్నది. భారత్‌లో లగ్జరీ కార్ల విక్రయాలు ఊపందుకున్నాయని, ముఖ్యంగా దక్షిణాదిలో అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయని, వీరిని దృష్టిలో పెట్టుకొని ఈ నూతన కారును విడుదల చేసినట్లు కంపెనీ ఆసియా-పసిఫిక్ రీజినల్ డైరెక్టర్ పాల్ హారీస్ తెలిపారు. కున్ ఎక్స్‌క్లూజివ్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో హైదరాబాద్‌తో పాటు చెన్నైలలో కంపెనీకి ఉన్న రిటైల్ అవుట్‌లెట్లలో మాత్రమే ఈ కార్లు లభించనున్నాయన్నారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీతో గతేడాది అమ్మకాల్లో నిస్తేజం నెలకొన్నదన్న ఆయన.. లగ్జరీ కార్లపై 214 శాతం దిగుమతి సుంకంతోపాటు జీఎస్టీ విధించడం భావ్యం కాదని, ఇది వ్యాపార రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదన్నారు. ఈ ఏడాది చివరి నాటికి కుల్లియన్ నూతన మోడల్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. 6.75 లీటర్ల ట్విన్-టర్బోచార్జ్ వీ 12 ఇంజిన్‌తో తయారైన ఫాంటమ్-8 వెర్షన్ 563 హెచ్‌పీల శక్తి నివ్వనున్నది. కేవలం 5.4 సెకండ్లలో సున్న నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవడం ఈ కారు ప్రత్యేకత.

మార్చిలో పాన్‌కార్డ్ క్లబ్స్ ఆస్తుల వేలం: సెబీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: పెట్టుబడిదారుల నుంచి సేకరించిన రూ.7 వేల కోట్లను తిరిగి వసూలు చేయడానికి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ..పాన్‌కార్డ్ క్లబ్స్‌కు చెందిన ఆస్తులను వచ్చే నెలలో వేలం వేయనున్నట్లు ప్రకటించింది. రిజర్వు ధరను రూ.260 కోట్లుగా నిర్ణయించింది. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య కాలంలో వేలం వేసిన 22 ఆస్తులకు ఇది అదనం. వచ్చే నెల 21న పాన్‌కార్డ్ క్లబ్స్, వన్ ప్రాపర్టీ సీఎండీ సుధీర్ మోరవెకర్(గతంలో మరణించారు)కి సంబంధించిన పది ప్రాపర్టీలను విక్రయించనున్నట్లు సెబీ ప్రత్యేక నోటీస్ జారీ చేసింది. వేలం వేసేవాటిలో గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానాలో ఉన్న ఫోర్-స్టార్ హోటల్, రిసార్ట్స్, భూములు, ఆఫీస్ స్థలం, పలు దుకాణాలు ఉన్నాయి.



సిద్దిపేట జిల్లాలో దివ్యాంగులకు ఉచితంగా వీల్ చైర్లు, త్రిచక్ర సైకిళ్లుసహా వివిధ రకాల సహాయం అందించడానికి భారత్ డైనమిక్స్ లిమిటెడ్, ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ముందుకొచ్చాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా దీనికి సంబంధించి రూ.20 లక్షల విలువైన ఎంవోయూను హైదరాబాద్‌లోని బీడీఎల్ కార్యాలయంలో కుదుర్చుకుంటున్న ఇరు సంస్థల అధికారులు.



కోలాట బృందానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

కరీంనగర్ కల్చరల్: జన జానపద వృత్తి కళాకారుల సమాఖ్య కోలాట బృందానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించింది. కరీంనగర్ జిల్లాకు చెందిన ఈ బృందం 1,500 మందితో గురువారం కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 10 నిమిషాలపాటు కోలాట నృత్య ప్రదర్శన ఇచ్చింది. ఈ బృందానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డు భారతదేశ ప్రతినిధి బింగి నరేందర్‌గౌడ్, జిల్లా ప్రతినిధి విజయ భాస్కర్ రికార్డులో స్థానం కల్పిస్తూ సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

కేసీ కెనాల్ ఇండెంట్ నీరు విడుదల

టీబీడ్యాం నుంచి రెండు టీఎంసీలు

26వరకు ఆర్డీఎస్ ఆనకట్టకు మరింత వరద

అయిజ: ఆలస్యంగానైనా తుంగభద్ర డ్యాం నుంచి కర్నూల్-కడప (కేసీ) కెనాల్ ఇండెంట్ నీరు విడుదలైంది. కేసీ కెనాల్, ఆర్డీఎస్ ఆయకట్టుకు 60-40 నిష్పత్తి ప్రకారం గురువారం టీబీ డ్యాం నుంచి విడుదల చేశారు. కేసీ కెనాల్ నీటి వాటాలో 2టీఎంసీల నీటిని 15రోజులపాటు విడుదల చేయాలని కర్నూల్ ఎస్ఈ టీబీ బోర్డు ఎస్ఈకి ఇండెంట్ పెట్టారు. దీంతో గురువారం టీబీ డ్యాం పవర్ హౌస్ నుంచి ఆర్డీఎస్ ఇండెంట్ 1000 క్యూసెక్కులతోపాటు కేసీ కెనాల్ ఇండెంట్ 2000 క్యూసెక్కులను విడుదల చేసినట్టు కర్ణాటక డీఈఈ రామయ్య తెలిపారు. కేసీ కెనాల్ ఇండెంట్‌లోని 2టీఎంసీల్లో 7 రోజులపాటు 2వేల క్యూసెక్కులు, 8 రోజులు 1500 క్యూసెక్కుల నీటిని టీబీ డ్యాం నుంచి విడుదల చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 11 నుంచి ఆర్డీఎస్ నీటి వాటాలోని ఒక టీఎంసీ రోజుకు వెయ్యి క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నా నీటి ప్రవాహం నెమ్మదిస్తుండటంతో ఆర్డీఎస్ ఆనకట్టకు సరిపడా నీరు చేరడం లేదన్నారు. కేసీ కెనాల్ నీరు విడుదల చేయడంతో ఈ నెల 26నాటికి ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నీరు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 1.5 అడుగుల మేరకు నీటి లభ్యత ఉన్నట్టు తెలిపారు. కేసీ కెనాల్ నీటి వాటా విడుదల చేయడంతో ఆర్డీఎస్ ఆయకట్టుకు నీరందే అవకాశమున్నదని ఆర్డీఎస్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ తనగల సీతారాంరెడ్డి పేర్కొన్నారు.

వరంగల్‌లో మోనోరైల్ బృందం పర్యటన

- నేడు మంత్రి కేటీఆర్‌తో భేటీ
- కేసీఆర్‌లాంటి సీఎంను ఎక్కడా చూడలేదు: ఇంటమిన్ ప్రతినిధి



వరంగల్‌లో మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇంటమిన్ ట్రాన్స్‌పోర్టేషన్ బృందం

వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ : మోనోరైల్ బృందం గురువారం వరంగల్‌కు వచ్చింది. స్విట్జర్‌ల్యాండ్‌కు చెందిన ప్రఖ్యాత ఇంటమిన్ ట్రాన్స్‌పోర్టేషన్ కంపెనీ, గ్లోబల్ స్పెక్ట్రమ్, బ్లెండ్ ఫైనాన్స్, కెన్‌టెక్ సంస్థల ప్రతినిధుల బృందం వరంగల్, హన్మకొండ, కాజీపేట పట్టణాల్లో పర్యటించింది. నగర మేయర్ నన్నపునేని నరేందర్ ఈ బృందానికి కావాల్సిన సమాచారం అందజేశారు. సాయంత్రం బృందం సభ్యులు ఇంటమిన్, గ్లోబల్ స్పెక్ట్రమ్ సంస్థ సీఈవో సునిత్ వర్మ విలేకరులతో మాట్లాడారు. వరంగల్‌లో మోనోరైల్‌ను నడిపేందుకు సంబంధించిన తొలి, మలిదశ ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, అన్ని అనుకూలిస్తే నేడు హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌తో తుది దశ చర్చల తర్వాత ఎంవోయూ కుదుర్చుకుంటామన్నారు. వరంగల్ అభివృద్ధి చెందే నగరంగా తమ అధ్యయనంలో గుర్తించామన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌లాగా ఇంత శ్రద్ధతో తన రాష్ట్ర అభివృద్ధికే కాకుండా అన్ని నగరాల అభివృద్ధికి పాటుపడటం లేదని కితాబిచ్చారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ఓ అద్భుతమే

- శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్



జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో మాట్లాడుతున్న శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్

మెట్‌పల్లి,నమస్తేతెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టు ఓ అద్భుతమని, ఇలాంటి ప్రాజెక్టును దేశంలో ఎక్కడా లేదని శాసన మండలి చైర్మన్ కే స్వామి గౌడ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం సాహసం చేసి ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపడుతున్నదని ప్రశంసించారు. నదీ జలాలను మళ్లించి రివర్స్ పంప్‌హౌస్ ద్వారా సాగు, తాగునీటి అవసరాలను తీర్చేలా సీఎం కేసీఆర్ గొప్ప ఆలోచన చేశారని కొనియాడారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గురువారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వచ్చిన స్వామిగౌడ్ కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం నుంచి ఎక్కడో ఉన్న రంగారెడ్డి జిల్లా వరకు నీళ్లు ఇవ్వడమనేది సాధారణ విషయం కాదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాల్సిన అవసరం ఉన్నదన్నారు.

దేశానికి తెలంగాణే ఆదర్శం

- డీ-8 కాల్వ ద్వారా 25వేల ఎకరాలకు సాగునీరు
- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



వనపర్తి జిల్లా కిష్టాపూర్‌లో డీ-8 కాల్వకు పూజ చేస్తున్న మంత్రి జూపల్లి

పాన్‌గల్/వీపనగండ/పెంట్లవెల్లి/కొల్లాపూర్ టౌన్: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లో, వనపర్తి జిల్లా పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించారు. పాన్‌గల్ మండలం రేమొద్దుల గ్రామ సమీపంలో డీ-8 కాల్వ నుంచి వచ్చే నీటిని కిష్టాపూర్, గోప్లాపూర్, అన్నారం, దవాజీపల్లి గ్రామాలకు చేరేలా మంత్రి జూపల్లి గంగపూజ చేసి నీటిని విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ.. ఎంజీకేఎల్ఐ పథకంలోని 29వ ప్యాకేజీలో అంతర్భాగమైన డీ-8 కెనాల్ ద్వారా 23వేల ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతున్నదన్నారు. ఓవైపు పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయడం మరోవైపు రైతులందరికీ సాగునీరు అందించాలనే లక్ష్యంతో పెద్ద ఎత్తున ఎత్తిపోతల పథకాలను చేపడుతున్నట్టు తెలిపారు.

కేటీకే ఓసీపీ-2లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభం

భూపాలపల్లి, నమస్తే తెలంగాణ: భూపాలపల్లి ఏరియా నూతన గని ఓసీపీ సెక్టార్-2లో గురువారం ఏరియా జీఎం కే.గురువయ్య నేతృత్వంలో అధికారులు పూజలు నిర్వహించి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించారు. 2017 ఆగస్టు 19న సింగరేణి బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఆమోదం పొందగా, రూ.614.57కోట్ల అంచనా వ్యయంతో ఈ నూతన గనిని చేపట్టారు. 2017 సెప్టెంబర్‌లో మట్టి తవ్వకాలను ప్రారంభించారు. గురువారం బొగ్గు ఉత్పత్తిని అధికారికంగా ప్రారంభించారు. ఈ గని నుంచి ఏటా 1.25మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి యాజమాన్యం లక్ష్యంగా నిర్ణయించింది.


కాకతీయుల చిత్రానికి అంతర్జాతీయ గుర్తింపు

- నేడు అమెరికాలో ప్రదర్శన

పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కాకతీయ రాజుల భౌగోళిక, వాస్తవాలు, వారి శాస్త్రీయ పద్ధతులను విశ్లేషిస్తూ నిర్మించిన(డాక్యుమెంటరీ) 'చిసేల్డ్'కు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గోపరపల్లికి చెందిన అల్లాడి రామ్ 16 ఏండ్ల క్రితం అమెరికాలో స్థిరపడ్డారు. కాకతీయ కాలంలో ఆనాటి భౌగోళిక పరిస్థితులు, ప్రకృతి విపత్తులను దృష్టిలో ఉంచుకొని కట్టిన నిర్మాణాలను ప్రపంచానికి చూపించాలనే ఉద్దేశంతో 2016లో స్వదేశానికి వచ్చిన ఆయన, 'చిసేల్డ్' పేరిట కాకతీయ వైభవాన్ని తెలిపేలా లఘు చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ఇప్పటికే పలు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో పురస్కారాలు గెలుచుకుంది. నేడు అమెరికాలో 'ఓజీభీ ఇంటర్నేషనల్ హిస్టరీ ఫిలిం ఫెస్టివల్' నిర్వహిస్తుండగా, అందులో ఈ చిత్రం ప్రదర్శనకు ఎంపికైంది.

హక్కుల సాధనకు ఉద్యమిస్తాం

ఎమ్మార్పీఎస్-టీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్



జమ్మికుంటలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్-టీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్

జమ్మికుంట : మాదిగల హక్కుల కోసం ఉద్యమిస్తామనీ, రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఎమ్మార్పీఎస్-టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఉమ్మడి జిల్లా సదస్సును జిల్లా అధ్యక్షుడు భాస్కర్ అధ్యక్షతన నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. ఓటు హక్కుపై మాదిగల్లో అవగాహన కల్పిస్తున్నామనీ, ఓటుపై చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. మాదిగలను విస్మరించిన పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామనీ, ఏబీసీడీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. ఓట్లు, సీట్లు లక్ష్యంగా మలిదశ ఉద్యమాన్ని నడిపిస్తామన్నారు. మాదిగల సాంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసేందుకు జ్ఞాన మందిరాలను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు.

40 డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు

- ఖాళీల భర్తీకి రూ.10వేల కోట్లు మంజూరు
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి



నాగర్‌కర్నూల్‌లో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్/జడ్చర్ల, నమస్తే తెలంగాణ: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 40 డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేసిన డయాలసిస్, ఐసీయూ కేంద్రాలను ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం శ్రీకృష్ణ గీతాభవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయాచోట్ల మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యశాలలను తలదన్నేలా ప్రభుత్వ దవాఖానల్లో వైద్యం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పేద ప్రజలందరికీ ఖరీదైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. దవాఖానల్లో ఖాళీల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం నుంచి రూ.10 వేల కోట్లు మంజూరయ్యాయని త్వరలోనే పోస్టులను భర్తీ చేయడంతోపాటు సిబ్బందికి వేతనాలు సైతం పెంచనున్నట్టు చెప్పారు. రెండో ఏఎన్ఎంల వేతనాలూ పెంచేందుకు సీఎం చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సేవలు మెరుగైనట్టు చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో దవాఖానల్లో కనీస సౌకర్యాలు, మందులు ఉండేవి కాదన్నారు.

చిట్టితల్లి ఎదుటే.. తనువు చాలించారు!

రైలుకు ఎదురెళ్లి సహజీవన జంట ఆత్మహత్య

మెదక్ జిల్లా బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌లో ఘటన

చావుకు బంధువులే కారణమని ఫేస్‌బుక్‌లో లేఖ



కాశీరాం, దేవేంద్ర(ఫైల్).. రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా చిన్నారి లతాశ్రీ

తూప్రాన్, నమస్తే తెలంగాణ: లోకం తెలియని ఏడాది వయస్సున్న కూతురు ఎదుటే కన్నతల్లి ఆత్మహత్య చేసుకున్నది. సహజీవనం చేస్తున్న బావతో కలిసి రైలు కింద పడి కన్నుమూసింది. తల్లి ఇక తిరిగి రాదని తెలియని ఆ చిన్నారి.. ప్లాట్‌ఫాంపైనే కూర్చుని ఎదురుచూస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఈ విషాదఘటన గురువారం తెల్లవారుజామున మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌లో జరిగింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బాంబేకాలనీకి చెందిన ఒంటెద్దు కాశీరాం(27) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేశాడు. 2016లో అతనికి వివాహమవగా, పలు కారణాలతో భార్య విడిపోయింది. కాశీరాం మేనత్త కూతురు, రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం అవునూరిపల్లికి చెందిన దేవేంద్ర(25)కు ఆరేండ్ల కిందట నిజామాబాద్ జిల్లా దోమకొండకు చెందిన రఘుతో వివాహమైంది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. రఘు బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి అక్కడే ఉంటున్నాడు. ఒంటరిగా ఉంటున్న కాశీరాం, దేవేంద్ర ఇద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. కొన్నాళ్లుగా వివాహేతర సంబంధం సాగిస్తుండంతో విషయం రెండు కుటుంబాలకు తెలిసి పంచాయితీ పెట్టారు. ఈ విషయంలో రెండు నెలల కిందట కాశీరాం రూ.1.5 లక్షలు జరిమానా సైతం చెల్లించాడు. తర్వాత దేవేంద్రను తల్లిదండ్రులు ఇంట్లో నుంచి గెంటేశారు. అప్పటినుంచి ఇద్దరూ సహజీవనం చేస్తున్నారు. కొన్నిరోజులుగా ఇద్దరి మధ్య ఘర్షణ జరుగుతున్నది. దీంతో కాశీరాంతో కలిసుండనని, భర్త రఘు వద్దకు వెళ్తానంటూ దేవేంద్ర రెండురోజుల కిందట కామారెడ్డి పోలీసులను ఆశ్రయించింది. రెండు రోజులు ఆగాలని పోలీసులు నచ్చజెప్పి పంపించారు. బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో కాశీరాం.. దేవేంద్ర, ఆమె కూతురు లతాశ్రీ(1)ని తీసుకొని మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున చిన్నారిని రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై కూర్చోబెట్టి వేగంగా వస్తున్న రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రమాదంలో ఇద్దరి మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వచ్చి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. విషయం తెలిసుకొని అక్కడికి వచ్చిన బంధువులకు మృతదేహాలను అప్పగించారు. చిన్నారి లతాశ్రీని మృతురాలి తల్లిదండ్రులకు అప్పగించారు. కామారెడ్డి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. 'గుడ్ మార్నింగ్ సీఎం కేసీఆర్ సర్. మేం ఇద్దరం చనిపోతున్నాం. మా అత్తామామలు చిన్నతల్లి, గంగయ్య చావండంటూ దూషించడంతోనే ఆత్మహత్య చేసుకుంటున్నాం. వాళ్లపై చర్య తీసుకుంటే నిజం బయటకు వస్తుంది'అని కాశీరాం తన ఫోన్‌లో పెట్టిన ఫేస్‌బుక్ పోస్టింగ్‌ను పోలీసులు గుర్తించారు.

షాద్‌నగర్ ఎంవీఐపై ఏసీబీ కేసు

హైదరాబాద్ / షాద్‌నగర్, నమస్తే తెలంగాణ: డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చేందుకు తన వ్యక్తిగత డ్రైవర్ ద్వారా లంచం తీసుకున్న షాద్‌నగర్ ఎంవీఐ శ్రీకాంతాచక్రవర్తిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఎంవీఐ డ్రైవర్ బాలయ్య(అలియాస్ రాజు)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీలు సూర్యనారాయణ, శ్రీకృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన విజేందర్‌రెడ్డి డ్రైవింగ్ లైసెన్స్ కోసం కొన్నిరోజులుగా షాద్‌నగర్ రవాణాశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. రూ. 5 వేల లంచం ఇస్తే డ్రైవింగ్ లైసెన్స్ ఇస్తానని ఎంవీఐ శ్రీకాంత చక్రవర్తి డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు విజేందర్‌రెడ్డికి రూ.5 వేల నగదు ఇచ్చి రవాణా శాఖ కార్యాలయానికి పంపించారు. ఎంవీఐ సూచన మేరకు అతడి డ్రైవర్ బాలయ్యకు డబ్బులు ఇస్తుండగా, అప్పటికే అక్కడ ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డబ్బులు స్వాధీనం చేసుకుని బాలయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎంవీఐ శ్రీకాంతాచక్రవర్తిపై కేసు నమోదు చేశామని ఏసీబీ అధికారులు వివరించారు.

ఆదిలాబాద్ మున్సిపల్ డీఈ ఇండ్లల్లో ఏసీబీ సోదాలు



డీఈ కొండల్‌రావు

ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ : ఆదాయానికి మించి అక్రమాస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో ఆదిలాబాద్ మున్సిపల్ డీఈ కొండల్‌రావు ఇళ్లలో గురువారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏకకాలంలో కొత్తగూడం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లో దాడులు చేశారు. ఆదిలాబాద్‌లోని అద్దె నివాసంలో రూ.2.60 లక్షల నగదు, 13 తులాల బంగారు ఆభరణాలు, పలు కీలక డాక్యుమెంట్లు, బ్యాంక్ ఖాతా పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. డీఈ కొండల్ రావును అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. వరంగల్‌లో ఆయన, గాంధీనగర్‌లోని ఆయన సన్నిహితులు ఇండ్లలో,హన్మకొండ రెడ్డికాలనీలోని ఆయన బావ, కొత్తగూడెంలోని ఆయన మామ ఊటూకూరి అంజనానందం ఇంట్లో ఏసీబీ సోదాలు చేసి, పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.





నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో ఎమ్మెల్యే మర్రి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరుతున్న బీజేపీ ఎంపీటీసీ గిరి, ఇతర నాయకులు...
నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

టీఆర్ఎస్‌లో చేరికల జోరు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్:

టీఆర్ఎస్‌లో చేరికల జోరు కొనసాగుతున్నది. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలానికి చెందిన 30మంది కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరగా, మంత్రి జూపల్లి కృష్ణారావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఊర్కొండ మండలం బొమ్మరాశిపల్లికి చెందిన 40మంది నాయకులు మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో చేరారు. బిజినేపల్లి మండలంలోని వడ్డెమాన్ గ్రామానికి చెందిన బీజేపీ ఎంపీటీసీ గిరితోపాటు పలువురు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. అమ్రాబాద్ మండల కేంద్రంలో వివిధపార్టీలకు చెందిన 40మంది పార్టీలో చేరగా, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సాదారంగా ఆహ్వానించారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం కొత్త మొల్గర గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, గ్రామ యువకులు 40 మంది గురువారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం అడ్డెసరా గ్రామపంచాయతీకి చెందిన ఇద్దరు మాజీ సర్పంచులు, ఉప సర్పంచ్, అన్నభావుసాఠే యువజన సంఘం సభ్యులతో సహా 100 మంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కోవ లక్ష్మి టీఆర్ఎస్‌లో చేరారు.

విద్యార్థినిపై ఉన్మాది దాడి

ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలో ఘటన



నిందితుడు రామలింగయ్య

బోనకల్లు: ఖమ్మం జిల్లా బోనకల్లు మండల కేంద్రంలో గురువారం విద్యార్థినిపై ఓ ఉన్మాది కత్తితో పొడిచి హత మార్చేందుకు యత్నించాడు. వివరాల్లోకి వెళ్తే.. బోనకల్లుకు చెందిన ఆటో డ్రైవర్ కోలా రామలింగయ్య(20), ఇదే గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థినిని పెళ్లి చేసుకోవాలంటూ వేధించాడు. సదరు విద్యార్థి తల్లిదండ్రులు గతేడాది డిసెంబర్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదై, బెయిల్‌పై వచ్చిన యువకుడు తిరిగి ఆ విద్యార్థినిని బెదిరించడం ప్రారంభించాడు. రామలింగయ్య ఆమె తల్లిదండ్రులు లేని సమయంలో ఇంటికి వెళ్లి కత్తితో ఛాతిపై, కడుపులో పొడిచాడు. ఇంట్లో నుంచి కేకలు వినిపించడంతో పరిసర ప్రాంతాల వారు తలుపులు పగులగొట్టి చూస్తున్న క్రమంలో అక్కడి నుంచి పరారయ్యాడు. ఆ విద్యార్థినిని ఖమ్మం దవాఖానకు తరలించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరిపై లైంగికదాడులు

వైరా రూరల్/పరిగి రూరల్: ఖమ్మం, వికారాబాద్ జిల్లాలో బాలికలపై లైంగిక దాడులు జరిగాయి. వివరాలు ఇలా.. ఖమ్మం జిల్లా వైరా మండలం విప్పలమడక గ్రామంలో ఓ ఇంటి వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించగా, ఓ మహిళ తన ఇద్దరు కూతుళ్లను అక్కడికి తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. అదే సమయంలో గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ ఆ ఇద్దరు చిన్నారులను తాను తీసుకెళ్తానని నమ్మబలికాడు. ఇద్దరు చిన్నారుల్లో ఒకరిని ప్రభుత్వ పాఠశాల వద్ద ఉంచి, ఆమె చెల్లిని ఆధ్యాత్మిక కార్యక్రమ సభలో వదిలిపెట్టి, తిరిగి వచ్చి పాఠశాలలో ఉన్న చిన్నారిపై లైంగిక దాడికి ఒడిగట్టాడు. ఎంత సేపైనా తన కూతుళ్లు రాకపోవడాన్ని గమనించిన తల్లి, బంధువులతో కలిసి వెతుక్కుంటూ పాఠశాల దగ్గరికి చేరుకుంది. వీళ్లను గమనించిన యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం జరిగిన విషయాన్ని ఆ చిన్నారి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు చెప్పగా, ఠాణాలో ఫిర్యాదు చేశారు.

ఇబ్రహీంపూర్‌తండాలో..

వికారాబాద్ జిల్లా పరిగి మండలం ఇబ్రహీంపూర్‌తండాలో మూడు రోజుల క్రితం బాలిక(15) తన సొంత పొలంలో బట్టలు ఉతుకుతుండగా తండాకు చెందిన నెలావత్ శ్రీనివాస్, నెలావత్ సునీల్ ఆమెను బలవంతంగా అక్కడి నుంచి లాక్కొని చిన్న వాగులోకి తీసుకెళ్లారు. నోట్లో బట్టలు కుక్కి సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించారు. ఈ విషయాన్ని ఆ బాలిక తన తల్లిదండ్రులకు తెలుపగా తండాలో పంచాయతీ ఏర్పాటు పెట్టారు. ఆపై బాధితురాలి తల్లి పరిగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను ఇద్దరిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం తాండూర్ ప్రభుత్వ దవానాకు తరలించారు.

ఇంటి పైకప్పు కూలి చిన్నారి మృతి



సాత్విక (ఫైల్)

ధర్మపురి, నమస్తేతెలంగాణ: ఇంటిపైకప్పు కూలడంతో మంచంపై నిద్రిస్తున్న మూడేండ్ల చిన్నారి కన్నుమూసింది. ఈ ఘటన గురువారం ధర్మపురిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని సారగమ్మవాడకు చెందిన చిట్టన్నోజు లింగస్వామి-పావని దంపతులకు లోకేశ్, సాత్విక (3) సంతానం. కాగా లింగస్వామి ఉపాధి కోసం ఏడాది క్రితం సింగపూర్ వెళ్లాడు. భార్య పావని తన ఇద్దరు పిల్లలతో ధర్మపురిలోనే మట్టి గోడలతో ఉన్న పాత ఇంట్లో నివాసం ఉంటుంది. గురువారం ఉదయం పావని ఆరుబయట ఇంటి పనులు చేస్తుండగా పడక గదిలోంచి పెద్ద శబ్దం రావడంతో పరుగులు తీసింది. అప్పటికే మంచంపై నిద్రిస్తున్న తన ఇద్దరు పిల్లలపై ఇంటి పైకప్పు పడటంతో మట్టితో పూర్తిగా కప్పినట్టు కనిపించింది. ఈ ప్రమాదం నుంచి ఐదేండ్ల బాలుడు లోకేశ్ క్షేమంగా బయట పడగా, దుప్పటి కప్పుకోకుండా నిద్రించిన చిన్నారి సాత్విక ఊపిరాడక అపస్మారక స్థితికి చేరింది. కరీంనగర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో తుదిశ్వాస విడిచింది.

చావులోనూ తోడుగా..

- భార్య మృతిని తట్టుకోలేక భర్త..



శౌరెడ్డి, ఇన్నాసమ్మ (ఫైల్)

వేములవాడ రూరల్: భార్య మృతి చెందిన కొద్ది గంటల్లోనే భర్త మృతి చెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం నాంపెల్లిలో గురువారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. నాంపెల్లికి చెందిన అల్లం ఇన్నాసమ్మ(72), శౌరెడ్డి(75) అనార్యోగంతో బాధపడుతున్నారు. బుధవారం రాత్రి 10 గంటలకు ఇన్నాసమ్మ గుండెపోటుతో మృతి చెందగా, బంధువులు శౌరెడ్డికి చెప్పలేదు. ఇంట్లో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేసి, గురువారం సాయంత్రం 4.30గంటలకు విషయాన్ని శౌరెడ్డికి చెప్పడంతో మనోవేదన తట్టుకోలేక అతను అక్కడే కుప్పకూలాడు. రెండు మృతదేహాలకు ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు.

ఏసీబీ కేసులో సీఐకి రెండేండ్ల జైలు, జరిమానా

కరీంనగర్ లీగల్: లంచం తీసుకొని ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ నేరంలో సీఐ చాట్ల విజయ్‌కుమార్‌కు రెండేండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.పదివేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టు న్యాయమూర్తి పీ భాస్కరరావు గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. విజయ్‌కుమార్ 2009లో కరీంనగర్ జిల్లా చొప్పదండి సీఐగా పని చేస్తున్న సమయంలో భూవివాదం కేసులో శ్రీనివాస్‌రెడ్డిని కోర్టుకు పంపకుండా స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ.40వేలు తీసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత విజయ్‌కుమార్ సదరు వ్యక్తిని పిలిచి మరో రూ.20వేలు డిమాండ్ చేశాడు. శ్రీనివాసరెడ్డి 2009 మే 11న కరీంనగర్ ఏసీబీకి ఫిర్యాదు చేయగా, మరునాడు ఠాణాలో శ్రీనివాస్ నుంచి సీఐ డబ్బులు తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు పట్టుకుని విజయ్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించారు.

సూర్యాపేటలో 180 కిలోల గంజాయి పట్టివేత

సూర్యాపేట, నమస్తే తెలంగాణ ప్రతినిధి: సూర్యాపేటలో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత పోలీసులు దాదాపు 180 కిలోల గంజాయిని పట్టుకున్నారు. సూర్యాపేట డీఎస్పీ నాగేశ్వర్‌రావు కథనం ప్రకారం.. రాత్రి 11గంటల ప్రాంతంలో గాయత్రి జూనియర్ కళాశాల హాస్టల్‌లోని మంచాల కింద గుర్తుతెలియని వ్యక్తులు కొందరు బ్యాగులు పెడుతుండగా అవేమిటని విద్యార్థులు ప్రశ్నించారు. అవి ప్రశ్న పత్రాలని చెప్పడంతో అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో విద్యార్థులు ఓ బ్యాగు తెరిచి చూశారు. వాటిలో గంజాయి ఉన్నట్టు గుర్తించి విద్యార్థి సంఘాల నాయకులకు సమాచారం ఇచ్చారు. వెంటనే టీజీవీపీ నాయకులు హాస్టల్‌కు చేరుకొని బ్యాగులను బయట పెట్టి ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు హాస్టల్‌లోని 12 బ్యాగుల గంజాయి, ఓ ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వార్డెన్ లింగానాయక్ సోదరుడు మహబూబాబాద్ జిల్లా తానంచర్లకు చెందిన లాలునాయక్ గంజాయి ప్యాకెట్లను తీసుకువచ్చినట్టు తెలిసింది.

హైదరాబాద్‌లో తైక్వాండో జాతీయ అకాడమీ ఏర్పాటుకు కృషి

■ మంత్రులు హరీశ్‌రావు, పద్మారావు హామీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో తైక్వాండో జాతీయ అకాడమీ ఏర్పాటు అంశంపై సీఎం కేసీఆర్‌తో చర్చిస్తామని మంత్రులు హరీశ్ రావు, పద్మారావు చెప్పారు. అమెరికాలోని డల్లాస్‌లో ఈనెల 10, 11 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్‌లో పతకాలు సాధించిన (54 కిలోల కేటగిరీలో ముషీరాబాద్‌లోని బాపూజీనగర్‌కు చెందిన కొండ సహదేవ్, 62-67 కిలోల కేటగిరీలో రాజేంద్రనగర్ పరిధి నార్సింగ్‌కు చెందిన అబ్దుల్ ఖలీల్, 67-73 కిలోల కేటగిరీలో కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన కే సింధు తపస్వీ) క్రీడాకారులను గురువారం సచివాలయంలో మంత్రులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తైక్వాండో క్రీడకు ప్రభుత్వపరంగా తగిన గుర్తింపు, ప్రోత్సాహం ఇవ్వాలని ఇన్‌ఫినో తైక్వాండో వరల్డ్ సంస్థ చైర్మన్, కోచ్ జయంత్‌రెడ్డి మంత్రులకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రులు ఈ విషయమై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని చెప్పారు.



ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ మైదానంలో ముగిసిన ఇండో-బంగ్లాదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో సికిందరాబాద్, పద్మారావు నగర్‌కు చెందిన 72 ఏండ్ల ఆర్‌పీ భగవాన్ 100మీటర్ల పరుగుపందెంలో స్వర్ణం సాధించాడు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్‌పీ భగవాన్ ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న దృశ్యం.



ఏయ్.. ఇటు చూడు!

పాండేపై ధోనీ ఆగ్రహం

సెంచూరియన్: మైదానంలో ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటూ 'మిస్టర్ కూల్'గా పేరు తెచ్చుకున్న మాజీ సారథి ధోనీకి కోపం వచ్చింది. ఆవేశంలో సహచరుడు మనీష్ పాండేను తిట్టేశాడు కూడా. అసలు ఏం జరిగిందంటే.. రెండో టీ20లో ఆరంభంలోనే వికెట్లు పడటంతో భారత్ కష్టాల్లో పడింది. రైనా, మనీష్ పాండే వీలైనంతగా ఇన్నింగ్స్‌ను సరిదిద్దారు. ఇక రైనా ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన ధోనీ ఈ బాధ్యతను తీసుకున్నాడు. అనుభవజ్ఞుడు అందులోనూ మ్యాచ్‌ను అర్థం చేసుకోవడంలో దిట్ట అయిన మహీ భారీ హిట్టింగ్ మిస్ అయినా వేగంగా వికెట్ల మధ్య పరుగెత్తాలని భావించాడు. కానీ ఇదేమీ పట్టించుకోకుండా రెండో ఎండ్‌లో మనీష్ పెవిలియన్ వైపు చూస్తూ నిల్చున్నాడు. అంతే ఒక్కసారిగా సంయమనం కోల్పోయిన ధోనీ.. పాండేపై అరిచేశాడు. 19.1 ఓవర్‌లో ఈ సంఘటన జరిగింది. తొలి బంతికి మనీష్ సింగిల్ తీసి ధోనీకి స్ట్రయికింగ్ ఇచ్చాడు. ఇక రెండో బంతిని స్ట్రయిక్ చేసే క్రమంలో మహీ.. మనీష్ వైపు చూస్తూ 'ఓయ్ కిదర్ దేక్ రా హై, ఉదర్ కా దేక్ రా హై. ఆవాజ్ నహీ జాయేగి, ఇషారా దేకియో' అని సీరియస్‌గా అన్నాడు. కెమెరాల్లో రికార్డు అయిన ఈ సంఘటన సామాజిక మధ్యమాల్లో వైరల్‌గా మారింది.

సైనాకు కఠిన డ్రా

■ ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్



బర్మింగ్‌హామ్: హైదరాబాద్ ఏస్ షట్లర్ సైనా నెహ్వాల్‌కు ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో కఠిన డ్రా ఎదురైంది. వచ్చే నెలలో జరుగనున్న ఈ టోర్నీ తొలిరౌండ్‌లోనే తైవాన్‌కు చెందిన ప్రపంచ నంబర్‌వన్ తాయ్ జు యింగ్‌తో తలపడనుంది. గత నెలలో ముగిసిన ఇండోనేషియా ఓపెన్‌లో తాయ్ జుయింగ్ చేతిలో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరో తెలుగుతేజం పీ సింధు తొలిరౌండ్‌లో థాయిలాండ్ కు చెందిన చోంచువాంగ్‌ను ఎదుర్కోనుంది. సింధు తొలిరౌండ్‌లో సునాయాసంగా విజయం సాధించినా రెండోరౌండ్‌లో అమెరికా షట్లర్ బీవెన్ జాంగ్‌జాంగ్ ఎదురుపడనుంది. ఇక పురుషుల ప్రపంచ నంబర్ 3 కిడాంబి శ్రీకాంత్‌కు ఫ్రెంచ్ బ్యాడ్మింటన్ ఆటగాడు లెవెర్డెజ్‌తో తలపడనున్నాడు. గతేడాది సంచలన ప్రదర్శన చేసిన సాయి ప్రణీత్, హెచ్‌ఎస్ ప్రణయ్‌లకు తొలిరౌండ్‌లో కఠిన ప్రత్యర్థులు ఎదురయ్యారు. మహిళల డబుల్స్ జోడీ అశ్విని పొన్నప్ప, సిక్కిరెడ్డి జోడీ తొలిరౌండ్‌లో జర్మనీ జంట మార్విన్ ఎమిల్, లిండా ఎఫ్లర్‌లను ఎదుర్కోనున్నారు.




గురువారం ఢిల్లీలో పిల్లలతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతున్న కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో. చిత్రంలో భారత మాజీ కెప్టెన్ అజరుద్దీన్ కూడా ఉన్నాడు.

ప్రతిఘటన ఊహించిందే.!

వన్డే సిరీస్ ఏకపక్షంగా ముగియడంతో అందరూ టీ20ల్లోనూ భారత్‌దే హవా అని అనుకున్నారు. అనుకున్నట్లుగానే టీమ్‌ఇండియా తొలి మ్యాచ్‌లో తిరుగులేని ఆధిపత్యం చూపెట్టింది. కానీ రెండో టీ20కి వచ్చేసరికి సీన్ ఒక్కసారిగా రివర్స్ అయ్యింది. భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా.. పొట్టి ఫార్మాట్ బౌలింగ్ స్పెషలిస్టులు ఉన్నా.. పరిస్థితులను అధిగమించడంలో విరాట్‌సేన పూర్తిగా విఫలమైంది. మరి ఈ ఓటమికి ఎవర్ని నిందించాలి..? బౌలర్లనా.. వానదేవుడినా.. పిచ్ పరిస్థితులనా..? అంటే విరాట్ మాత్రం వర్షం పైనే నింద మోపాడు..!

చాహల్ వైఫల్యం భారత్‌కు దెబ్బ

విజయానికి సఫారీలు అర్హులన్న విరాట్



కోహ్లీ

(నమస్తే తెలంగాణ స్పోర్ట్స్‌డెస్క్)

189 పరుగుల లక్ష్యం.. ప్రత్యర్థి జట్టులో ఒకరిద్దరు మినహా స్టార్ బ్యాట్స్‌మెన్ లేరు.. ఉన్నవాళ్లు కూడా తొందరగానే వెనుదిరిగారు.. ఇక పొట్టి ఫార్మాట్ సిరీస్ కూడా మనదే అనుకుంటున్న వేళ.. అంతర్జాతీయ కెరీర్‌లో పెద్దగా అనుభవం లేని ఓ అనామక బ్యాట్స్‌మన్ చూపిన తెగువకు టీమ్‌ఇండియాకు బలహీనతలన్నీ బయటకొచ్చాయి. ఇన్నాళ్లూ మణికట్టు స్పిన్నర్లతో మాయాజాలం చేసిన విరాట్‌సేనకు సఫారీ గడ్డపై తొలిసారి దిమ్మతిరిగే షాక్ తగిలింది. అయితే దక్షిణాఫ్రికా నుంచి ఈ ప్రతిఘటన ఊహించిందేనని టీమ్‌ఇండియా సారథి విరాట్ కోహ్లీ అన్నాడు. నిరంతరం చినుకులు పడటం వల్ల బౌలర్ల పని చాలా కష్టతరమైందన్నాడు. 'పిచ్ బౌలర్లకు ఏమాత్రం సహకరించలేదు. ఆరంభంలో వికెట్లు కోల్పోవడంతో 175 పరుగులు చేస్తామనుకున్నాం. కానీ మనీష్, రైనా అద్భుతంగా ఆడారు. ధోనీ పుంజుకోవడంతో 190కి చేరువగా వచ్చాం. కచ్చితంగా ఇది గెలిచే స్కోరే. అయితే వాతావరణం విలన్‌గా మారిపోయింది. 12వ ఓవర్‌కు బాగానే ఉంది. ఎప్పుడైతే చినుకులు మొదలయ్యాయో బంతిపై పట్టు దొరుకలేదు. వికెట్ కూడా బాగా కుదురుకుంది. భారీ షాట్లకు అనువుగా మారిపోయింది. ఒకవేళ మ్యాచ్ ఆపితే చాలా సమస్యలు ఎదురవుతాయి. తొలి ఇన్నింగ్స్ మొదలైనప్పుడే మ్యాచ్ ఆగదని అనుకున్నాం' అని కోహ్లీ పేర్కొన్నాడు.



క్లాసెన్ డుమిని

విజయానికి వాళ్లే అర్హులు

నిలకడగా లక్ష్యాన్ని ఛేదించిన దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌పై విరాట్ ప్రశంసలు కురిపించాడు. ఈ విజయానికి వాళ్లు పూర్తి అర్హులని కితాబిచ్చాడు. 'క్లాసెన్, డుమిని ఆట సూపర్బ్. చాలా సానుకూలంగా కనిపించారు. అభిమానులకు కూడా కనువిందు కలిగించారు. లెక్కలేసుకుని మరి రిస్క్ షాట్లు కొట్టారు. షార్ట్ బౌండరీ కూడా కలిసొచ్చింది. పోరాడుతారని ముందే తెలుసు. కానీ ఇంతలా బాదుతారని మాత్రం అనుకోలేదు. క్రికెట్ మ్యాచ్‌లు గెలువడంలో వాళ్లకు ఉన్న ఆసక్తి, అభిరుచిని చూపెట్టారు. ఓవరాల్‌గా మంచి క్రికెట్ ఆడారు' అని విరాట్ వ్యాఖ్యానించాడు.

సమిష్టి విజయం: డుమిని

జట్టు సమిష్టితో చేసిన పోరాటానికి దక్కిన విజయం ఇదని దక్షిణాఫ్రికా కెప్టెన్ డుమిని అన్నాడు. 'దీనిని మేం సెమీస్‌లాగా భావించాం. బంతితో మంచి ఆరంభాన్నిచ్చాం. కానీ చివరి ఐదు ఓవర్లలో మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. లక్ష్య ఛేదనలో మా బ్యాట్స్‌మెన్ కూడా మెరుగ్గానే ఆడారు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిని దృష్టిలో పెట్టుకుని పరుగులు సాధించాం. ప్రత్యర్థి బౌలర్లు బంతిపై పట్టు కోల్పోవడంతో మాకు స్వేచ్ఛ దొరికింది. ఓవరాల్‌గా ఇది సమిష్టి విజయం. ఓ రకంగా టీమ్‌ఇండియాను 188కి కట్టడి చేశామనే చెప్పొచ్చు' అని డుమిని పేర్కొన్నాడు.

నాలో భయాన్ని తొలిగించాడు: క్లాసెన్

రెండో టీ20లో తాను అంతగా చెలరేగడానికి కెప్టెన్ డుమినియే కారణమని విధ్వంసకర బ్యాట్స్‌మన్ హెన్రిచ్ క్లాసెన్ అన్నాడు. తన ఆటలో ఉన్న భయాన్ని పోగొట్టాడని చెప్పాడు. సారథి సహకారం వల్లే తాను మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడగలిగానన్నాడు. 'నా మొత్తం ఇన్నింగ్స్‌లో డుమినిది కీలక పాత్ర. ఓవర్‌ను ఎదుర్కొనేటప్పుడు ఎన్ని పరుగులు చేయాలో స్పష్టంగా చెప్పాడు. ఓ ఓవర్‌లో 10, మరోదాంట్లో 20 ఇలా చెప్పుకుంటూ నాలో భయాన్ని తొలిగించాడు. బౌలర్లపై ఎదురుదాడి చేసేలా సహజ సిద్ధమైన ఆటను ఆడమని ప్రోత్సహించాడు. భారత్ బౌలర్లలో చాలా నైపుణ్యం ఉంది. పరుగులు రాబట్టడం చాలా కష్టమని తెలుసు. కాబట్టి బలమైన షాట్లు కొట్టేందుకే ఎక్కువగా ప్రయత్నించా' అని క్లాసెన్ వివరించాడు. సొంత మైదానంలో తొలి అర్ధసెంచరీతో జట్టును గెలిపించడం చాలా ఆనందాన్నిచ్చిందన్నాడు. 'తొలి ఐదు, ఆరు ఓవర్లలో డక్‌వర్త్ లూయిస్ స్కోరులో ఉండాలని ప్రయత్నించాం. అదృష్టంకొద్దీ ఆరో ఓవర్‌లో వర్షం తగ్గింది. ఇక అక్కడి నుంచి డీఎల్ స్కోరు తగ్గకుండా చూద్దామని డుమినికి చెప్పా. ఇది సత్ఫాలితాన్నిచ్చింది. వాస్తవానికి సూపర్ స్పోర్ట్స్ పార్క్‌లో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడమే కలిసొస్తుంది' అని క్లాసెన్ వెల్లడించాడు.

చాహల్ ఊహించలేదు..

తాను ఎక్కువగా లెగ్ స్పిన్ ఆడటాన్ని ఇష్టపడుతానని క్లాసెన్ చెప్పాడు. అందుకే చాహల్ బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొన్నానని తెలిపాడు. 'నేను హిట్టింగ్ చేస్తాని చాహల్ ఊహించలేదు. బంతిని ఎక్కడకు పంపించాలనుకున్నానో అక్కడికే బాదా. హిట్టింగ్ చేయాలని క్రీజులోకి రాలేదు. పరిస్థితిని బట్టి బాదేశా. చాహల్ ఓవర్‌లో 20 పరుగులు రాబట్టాలని డుమిని చెప్పడంతో భారీ సిక్సర్లు కొట్టా' అని క్లాసెన్ వివరించాడు.

కోహ్లీ కోరితే విశ్రాంతి.!

● శ్రీలంక టూర్‌కు కుర్రాళ్లకు అవకాశం

న్యూఢిల్లీ: సుదీర్ఘమైన షెడ్యూల్ నేపథ్యంలో భారత జట్టులోని సీనియర్ క్రికెటర్లకు విశ్రాంతి ఇవ్వాలని సెలెక్షన్ కమిటీ భావిస్తున్నది. కఠినమైన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ పర్యటనలతో పాటు వన్డే ప్రపంచకప్ వరకు ఆటగాళ్లకు గాయాలు కాకుండా చూడాలన్నదే కమిటీ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తున్నది. దీంతో వచ్చే నెల 6 నుంచి 18 వరకు శ్రీలంకలో జరిగే ముక్కోణపు టీ20 సిరీస్‌కు కుర్రాళ్లను ఎంపిక చేయాలని యోచిస్తున్నది. బంగ్లాదేశ్ మూడో జట్టుగా బరిలోకి దిగుతున్నది. ఒకవేళ టీమ్‌ఇండియా ఫైనల్‌కు చేరితే ఐదు మ్యాచ్‌లు ఆడాల్సి వస్తుంది. పని భారం పెరగడం, అలసట, ఒత్తిడి కారణంగా పేసర్లు భువనేశ్వర్, బుమ్రాలకు విశ్రాంతి ఇవ్వనున్నారు. వీళ్ల స్థానంలో హైదరాబాదీ మహ్మద్ సిరాజ్, బాసిల్ థంపి, జైదేవ్ ఉనాద్కట్, శార్దూల్ ఠాకూర్‌లకు అవకాశం దక్కొచ్చు. విశ్రాంతి కావాలని కోరితే కోహ్లీకి కూడా ఇస్తామని కమిటీ స్పష్టం చేసినట్లు సమాచారం. రోహిత్, రహానేలలో ఒకరికి తాత్కాలికంగా జట్టు పగ్గాలు అప్పగించనున్నారు. ఇక స్పిన్నర్లలో అక్షర్ పటేల్ తుది జట్టులో చోటు కోసం కండ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నాడు. కాబట్టి మణికట్టు స్పిన్నర్లు చాహల్, కుల్దీప్‌లో ఎవరికైనా విశ్రాంతి కల్పిస్తే అక్షర్‌కు మార్గం సుగమమవుతుంది. అందుకే చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్, సెలెక్టర్ శరణ్‌దీప్ సింగ్.. బుధవారం కర్ణాటక, హైదరాబాద్ మధ్య జరిగిన విజయ్ హజారే టోర్నీని నిశితంగా పరిశీలించారు. కర్ణాటక బ్యాట్స్‌మన్ మయాంక్ అగర్వాల్‌పై దృష్టిపెట్టారు. మిడిలార్డర్‌ను బలోపేతం చేసేందుకు కూడా కసరత్తులు చేస్తున్నారు.


సెమీఫైనల్లో ఆంధ్ర

■ క్వార్టర్స్‌లో ఢిల్లీపై ఘన విజయం

■ విజయ్ హజారే ట్రోఫీ

న్యూఢిల్లీ:

విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం ఢిల్లీతో జరిగిన క్వార్టర్స్‌లో ఆంధ్ర 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఢిల్లీ నిర్దేశించిన 112 పరుగుల లక్ష్యాన్ని ఆంధ్ర 28.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అశ్విన్ హెబ్బర్(38), రికీ భుయ్(36) రాణించారు. 11 పరుగులకే ఓపెనర్ భరత్(0), కెప్టెన్ హనుమ విహారీ(6) వికెట్లు కోల్పోయిన ఆంధ్ర..అశ్విన్, రికీ బ్యాటింగ్‌తో విజయాన్నందుకుంది. వీరిద్దరు కలిసి మూడో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆఖర్లో సుమంత్(25 నాటౌట్) ఆకట్టుకున్నాడు. ఇషాంత్‌శర్మ(1/11), సైనీ(1/14), నెగీ(1/20), రానా(1/25) ఒక్కో వికెట్ తీశారు. తొలుత శివ కుమార్(4/29), భార్గవ్ భట్(3/28) ధాటికి ఢిల్లీ 32.1 ఓవర్లలో 111 పరుగులకు కుప్పకూలింది. కెప్టెన్ రిషబ్ పంత్(38) మినహా ఎవరూ అంతగా ఆకట్టుకోలేకపోయారు. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో శివ, భట్ చెలరేగడంతో ఢిల్లీ బ్యాట్స్‌మెన్ దగ్గర సరైన సమాధానం లేకపోయింది. క్రీజులోకి వచ్చిన వాళ్లు వచ్చినట్లు అనవసరపు షాట్లకు పోయి వికెట్లు సమర్పించుకున్నారు. భారీ ఆశలు పెట్టుకున్న సీనియర్ గంభీర్(8) ఘోరంగా నిరాశపరిచాడు. మ్యాచ్ మొత్తమ్మీద పంత్, ధృవ్ షోరే(21) ఐదో వికెట్‌కు నెలకొల్పిన 36 పరుగుల భాగస్వామ్యం అత్యుత్తమం కావడం విశేషం. ఆంధ్ర బౌలర్లు సమిష్టిగా విజృంభించడంతో ఢిల్లీ ఆఖరి ఆరు వికెట్లను 35 పరుగుల తేడాతో కోల్పోయింది. అయ్యప్ప(2/30) రెండు వికెట్లు తీశాడు.



శివ కుమార్(4/29)

సెమీస్‌లో ఎవరితో ఎవరు?

కర్ణాటక X మహారాష్ట్ర ఫిబ్రవరి 24

ఆంధ్ర X సౌరాష్ట్ర ఫిబ్రవరి 25

సెమీస్‌లో సౌరాష్ట్ర: బరోడాతో జరిగిన మరో క్వార్టర్స్ మ్యాచ్‌లో సౌరాష్ట్ర 3 వికెట్ల తేడాతో విజయం సాధించి సెమీస్‌లోకి ప్రవేశించింది. షోయబ్ తాయి(72 నాటౌట్), కృనాల్ పాండ్యా(61) అర్ధసెంచరీలతో బరోడా తొలుత నిర్ణీత 50 ఓవర్లలో 247/8 స్కోరు చేసింది. జానీ(4/35) నాలుగు వికెట్లతో రాణించాడు. బారోత్(82), వాసవద(45) బ్యాటింగ్‌తో సౌరాష్ట్ర 48.4 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. షేత్(3/38) మూడు వికెట్లు తీశాడు.

సెమీస్‌లో మేరీకోం, సరితాదేవి

సోఫియా(బల్గేరియా): భారత బాక్సింగ్ దిగ్గజం, ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ మేరీ కోం మరో అంతర్జాతీయ పతకాన్ని ఖాయం చేసుకుంది. బల్గేరియాలో జరుగుతున్న 69వ స్ట్రాంజా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీలో సెమీస్ చేరడంతో మరో పతకం అందుకోనుంది. ఈ టోర్నీలో 48వ కేజీల విభాగంలో మేరీ కోం బరిలోకి దిగింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రొమేనియాకు చెందిన స్టెలుతా డుతాను ఓడించి సెమీస్ ఫైనల్లో స్థానం దక్కించుకుంది. ఆసియా చాంపియన్‌షిప్‌తోపాటు ఇండియన్ ఓపెన్ టైటిళ్లను దక్కించుకున్న మేరీ ఇక్కడ కూడా తన సత్తాచాటింది. ఈ రెండు టోర్నీలతోపాటు ఈ టోర్నీలోనూ స్టెలుతాను చిత్తుగా ఓడించడం విశేషం.ఈ టోర్నీలో 60 కేజీల విభాగంలో ఎల్ సరితా దేవి క్వార్టర్స్ లో ఘన విజయంతో సెమీస్ చేరుకుంది. కాగా.. ఇంతకు ముందే సీమా పునియా (81+), సావీటీ బూరా (75), మీనా కుమారి దేవి(54), కచారి (81) కేజీల విభాగాలలో, పురుషుల 49 కేజీల విభాగంలోఅమిత్ పంగల్, మహ్మద్ హుసాముద్దీన్ సెమీస్ చేరడంతో భారత్‌కు 8 పతకాలు ఖాయమయ్యాయి.

డీఎస్పీగా హర్మన్‌ప్రీత్‌కౌర్



చండీగఢ్: భారత మహిళల టీ20 కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ త్వరలో డీఎస్పీగా పదవీ బాధ్యతలు అందుకోబోతున్నది. దక్షిణాఫ్రికా పర్యటన ముగిసిన వెంటనే వచ్చే నెల 1న పంజాబ్ పోలీసు విభాగంలో డీఎస్పీగా కొలువుదీరనుంది. గత ప్రపంచకప్‌లో అద్భుతంగా రాణించి జట్టును ఫైనల్‌కు చేర్చినందుకు గాను పంజాబ్ ప్రభుత్వం కౌర్‌కు డీఎస్పీ హోదా ప్రకటించిన సంగతి తెలిసిందే. పశ్చిమ రైల్వే విభాగంలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేసేందుకు ఐదేండ్ల బాండ్‌పై సంతకం చేయడంతో రైల్వేశాఖ తొలుత అనుమతిచ్చేందుకు నిరాకరించింది. సీఎం అమరీందర్‌సింగ్ ప్రత్యేకంగా దృష్టి సారించి కౌర్ పోలీసు కలను నేరవేర్చాడు.

టీ20 లీగ్ కుర్రాళ్లకు మంచి వేదిక: సచిన్



ముంబై: తమ ప్రతిభను నిరూపించుకునేందుకు టీ20 లీగ్ మంచి వేదిక అని భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అన్నాడు. ముంబై క్రికెట్ లీగ్‌కు బ్రాండ్ అంబాసీడర్‌గా వ్యవహరిస్తున్న సచిన్ గురువారం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని విలువైన సలహాలు, సూచనలు ఇచ్చాడు. 'లీగ్ ఏర్పాటు పట్ల చాలా సంతోషంగా ఉన్నాను. ఇలాంటి టోర్నీల వల్ల రాష్ట్రంలో ప్రతిభ కల్గిన యువకులకు మంచి అవకాశం దొరుకుతుంది. తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు టీ20 లీగ్‌ను వేదికగా మలుచుకోవాలి. ముంబై క్రికెట్‌కు ఇలాంటివి ఎంతో అవసరం. శివాజీ పార్క్ నుంచి నా క్రికెట్ ప్రస్థానం మొదలైంది. రమాకాంత్ అచ్రేకర్, పద్మాకర్ శివాల్కర్ లాంటి గురువుల వద్ద శిష్యరికంతో ఈ స్థాయికి ఎదిగాను. భారత క్రికెట్‌కు ముంబై నాయకత్వం ఎప్పుడూ కావాల్సిందే. ఇది గతంలోనూ చాలా సందర్భాల్లో రుజువు అయ్యింది. ఎంతో మంది క్రికెటర్లు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు' అని సచిన్ అన్నాడు. ముంబై క్రికెట్ అసోసియేషన్(ఎమ్‌సీఏ)అనుమతితో వస్తున్న ముంబై క్రికెట్ లీగ్ వచ్చేనెల 11న మొదలవుతుంది.

కపిల్‌తో పాండ్యాను పోల్చొద్దు: బిన్నీ



ముంబై: భారత క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్, హార్దిక్ పాండ్యా మధ్య చాలా తేడా ఉంది. సౌకర్యాలు సరిగ్గా లేని రోజుల్లో ఇంగ్లండ్ గడ్డపై భారత్‌కు తొలి ప్రపంచకప్ అందించడంలో కీలక భూమిక పోషించి కోట్లాది మందికి కపిల్ ఆరాధ్య క్రికెటర్‌గా నిలిచాడు. అదే పాండ్యా విషయానికొస్తే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో చెప్పుకోదగ్గ పరుగులు చేయకుండానే ఐపీఎల్ ప్రదర్శన ఆధారంగా జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. అయితే ఈ మధ్యకాలంలో అందరూ కపిల్‌తో పాండ్యాను పోల్చడాన్ని అంతగా ఇష్టపడటం లేదు. దక్షిణాఫ్రికాలో అటు బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్‌లో విఫలమవుతున్న హార్దిక్‌పై మాజీ క్రికెటర్ రోజర్ బిన్నీ కీలక వ్యాఖ్యలు చేశాడు. దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్‌తో పాండ్యా పోల్చడం ఇక ఆపేయండని బిన్నీ సూచించాడు. 'బ్యాట్స్‌మన్‌గా చూస్తే కపిల్‌తో పాండ్యాకు అసలు పోలికే లేదు. జట్టులోకి వచ్చే ముందు దేశవాళీ క్రికెట్లో కపిల్ శతకాల మోత మోగించాడు. పాండ్యా విషయంలో అలా జరుగులేదు. కేవలం ఐపీఎల్ ప్రదర్శన ఆధారంగానే అతన్ని జాతీయజట్టులోకి తీసుకున్నారు. సుదీర్ఘ ఫార్మాట్‌కు టీ20 క్రికెట్‌కు చాలా వ్యత్యాసం ఉంటుంది. పూర్తి పరిణతి కల్గిన ఆల్‌రౌండర్‌గా పాండ్యా ఎదుగాలంటే బరోడా జట్టుకు టాపార్డర్‌లో ఆడాలి. పరుగులు సాధించేందుకు మంచి అవకాశముంటుంది, లేకపోతే టెస్ట్‌ల్లో రాణించం కష్టం. కానీ దేశవాళీ క్రికెట్‌లో అతను అంతగా ఆడే అవకాశాలు కనిపించడం లేదు' అని బిన్నీ అన్నాడు.

టీఆర్టీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో మాక్‌టెస్ట్

సందేహాల నివృత్తికి ప్రత్యేక హెల్ప్ డెస్క్: టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపాధ్యాయ కొలువుల భర్తీలో భాగంగా నిర్వహించనున్న టీఆర్టీ కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్టీ) కోసం ఆన్‌లైన్‌లో మాక్‌టెస్ట్‌ను గురువారం నుంచి అందుబాటులో ఉంచినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభంకానున్న పరీక్షలకు సంబంధించి క్యాండిడేట్ సర్వీసెస్ అనే విభాగంలో ఉన్న ఆన్‌లైన్ మాక్‌టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నది. 24వ తేదీన లాంగ్వేజ్ పండిట్, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు పరీక్ష నిర్వహించనున్నారు. 25వ తేదీన ఎస్జీటీ, 26, 27 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లం, గణితం, సోషల్, భౌతికశాస్త్రం (ఆంగ్ల మాధ్యమం), లాంగ్వేజ్ (ఉర్దూ, మరాఠి, హిందీ), 28వ తేదీన పీఈటీ, స్కూల్ అసిస్టెంట్ (హిందీ, కన్నడ, తమిళం, ఉర్దూ) అభ్యర్థులకు పరీక్ష నిర్వహించనున్నారు. మార్చి 2వ తేదీన సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్), 3వ తేదీన స్కూల్ అసిస్టెంట్ (బయోలాజికల్ సైన్సెస్, మ్యాథమెటిక్స్, సోషల్‌స్టడీస్, ఫిజికల్ సైన్స్), 4వ తేదీన స్కూల్ అసిస్టెంట్ (బయో సైన్సెస్, మ్యాథమెటిక్స్, సోషల్ స్టడీస్ – తెలుగు మీడియం), పీఈటీ పరీక్షలు ఉండనున్నాయి. పరీక్ష కేంద్రాలు, ఇతర వివరాలను తమ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది. టీఆర్టీ అభ్యర్థుల కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేసినట్టు తెలిపింది. 8333923740 లేదా helpdesk@tspsc.gov.in ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నది.

పరీక్షహాల్‌లో నమోదు ప్రక్రియ

- అభ్యర్థి (ఆమె/అతడు) పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించాలి.
- ఎంట్రెన్స్‌లో ప్రదర్శించే సీటింగ్ ప్రణాళికను చూసుకొని, కేటాయించిన ప్రత్యేకమైన పరీక్ష హాల్‌లోకి వెళ్లాలి.
- ఎగ్జామినేషన్ హాల్ తెలుసుకున్న తరువాత ఫొటో, వేలిముద్రను ఇవ్వడానికి నమోదు టేబుల్ వద్దకు వెళ్లాలి.
- పరీక్ష కేంద్రంలో వందకుపైగా కంప్యూటర్లు అందుబాటులో ఉంటే, అప్పుడు రెండు నమోదు టేబుళ్లు ఉంటాయి.
- అభ్యర్థి టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన హాల్‌టికెట్, ఒరిజినల్ గుర్తింపుకార్డు తీసుకొని రావాలి.
- నమోదు టేబుల్ వద్ద హాల్‌టికెట్, గుర్తింపుకార్డును చూపాలి.
- అక్కడ సీబీఆర్టీ వారు అభ్యర్థి హాల్‌టికెట్, గుర్తింపుకార్డును ధ్రువీకరించి, టీఎస్‌పీఎస్సీ అందించిన జాబితాలో అభ్యర్థి పేరును తనిఖీచేస్తారు. వివరాలు సక్రమంగా ఉంటేనే అభ్యర్థిని పరీక్షహాల్‌లోకి పంపిస్తారు.
- అభ్యర్థి తనకు కేటాయించిన కంప్యూటర్ వద్ద కూర్చొని, ఇన్విజిలేటర్ నుంచి తదుపరి సూచనల కోసం వేచి ఉండాలి.

పరీక్ష హాల్‌లో చేయదగినవి

- అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 9.15 గంటలు, మధ్యాహ్నం 1.45 గంటలలోపు చేరుకోవాలి. లేదంటే కేంద్రంలోకి అనుమతించరు.
- అభ్యర్థుల వివరాల ధ్రువీకరణ కోసం హాల్‌టికెట్‌తోపాటు ఏదేనీ గుర్తింపుకార్డును పరీక్ష కేంద్రానికి తప్పక తీసుకొనిరావాలి. (ఉదాహరణకు: పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, ఓటరు ఐడీ, ఆధార్, ప్రభుత్వ ఉద్యోగి అయితే గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్)
- పరీక్ష హాల్ లోపల భద్రత కోసం అభ్యర్థి ఫొటో, ఎడమ బొటనవేలి ముద్రను తీసుకుంటారు. (అసలు/నకిలీ అభ్యర్థులను గుర్తించేందుకు)
- అభ్యర్థి బహుళ ఎంపిక రకం పశ్నలకు సమాధానం ఇవ్వడానికి మౌస్ ఉపయోగించాలి.
- నిర్ణీత సమయం కాకముందే పరీక్ష హాల్ నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించరు.
- అభ్యర్థులు కేంద్రం వదిలి వెళ్లేముందు తమ వద్ద ఉన్న పెన్, రఫ్ పేపర్లను ఇన్విజలేటర్లకు తప్పక ఇవ్వాలి.
- హాల్‌టికెట్‌లో ఫొటో సరిగా కనిపించకపోతే అభ్యర్థి తనవెంట రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లాలి.
- అభ్యర్థికి కేటాయించిన కంప్యూటర్ (లాగిన్ స్క్రీన్)పై అభ్యర్థి వ్యక్తిగత వివరాలు (ఫొటో, పేరు) కనిపిస్తాయి. వాటిని జాగ్రత్తగా పరిశీలించి, వ్యత్యాసాలుంటే తక్షణమే ఇన్విజిలేటర్‌ను సంప్రదించాలి.

పరీక్ష హాలులో చేయకూడనివి

- ఆలస్యంగా వస్తే పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు.
- పరీక్ష హాల్‌లోకి మొబైల్ / సెల్యులార్ ఫోన్, ట్యాబ్, పెన్‌డ్రైవ్, బ్లూటూత్ వంటి పరికరాలు, వాచ్, కాలిక్యులేటర్, లాగ్ పట్టికలు, పర్సు, నోటు పుస్తకాలు, ఇతర పేపర్లు లేదా రికార్డింగ్ సాధనాలను అనుమతించరు.
- విలువైన పరికరాలు, వ్యక్తిగత వస్తువులు (ఆభరణాలు) తీసుకొని రావొద్దు. పరీక్ష హాల్ వెలుపల భద్రత ఉండకపోవచ్చు.
- అభ్యర్థులు మెహెందీ, ఇంకు తదితర పదార్థాలను చేతులు / పాదాలకు పెట్టుకోవద్దు. ఈ కారణంగా బయోమెట్రిక్ పరీక్ష కేంద్రంలో వేలిముద్ర నమోదుకాదు.
- పరీక్ష సమయంలో కీ బోర్డును తాకొద్దు. పశ్నలకు సమాధానం ఇవ్వడానికి మౌస్ ఉపయోగించండి.
- పరీక్ష సమయంలో అభ్యర్థులు సూచనలను అతిక్రమించొద్దు.

నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్లు

■ బీఈ/బీటెక్ అభ్యర్థులకు అవకాశం ■ ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ■ చివరితేదీ: మార్చి 4

ఇండియన్ నేవీలో షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) కింద పైలట్/అబ్జర్వర్, ఏటీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

కేరళ ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీ (ఐఎన్ఏ)లో ప్రారంభమయ్యే ఎస్ఎస్‌సీ జనవరి 2019 కోర్సులో ప్రవేశాల ద్వారా ఆఫీసర్ పోస్టులను భర్తీచేస్తారు.

- **అర్హతలు:** బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు లేదా ఇంజినీరింగ్ డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్షలు రాయనున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఇంజినీరింగ్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులు కావాలి. ఏటీసీ ఎంట్రీ కోసం పై అర్హతలతోపాటు పదోతరగతి, ఇంటర్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఇంటర్ ఇంగ్లిష్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఏటీసీ ఎంట్రీ:** ఖాళీల సంఖ్య – 2. పురుష/మహిళా అభ్యర్థులు అర్హులు. 1994, జనవరి 2 నుంచి 1998, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి.
- **అబ్జర్వర్ – ఖాళీల సంఖ్య – 4.** పురుష/మహిళా అభ్యర్థులు అర్హులు.
- అభ్యర్థులు 1995, జనవరి 2 నుంచి 2000, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి.
- **పైలట్ (ఎంఆర్): ఖాళీల సంఖ్య – 3.** పురుష/మహిళా అభ్యర్థులు అర్హులు.
- అభ్యర్థులు 1995, జనవరి 2 నుంచి 2000, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి.
- **పైలట్ (ఎంఆర్ కాకుండా మిగిలిన బ్రాంచీలు): ఖాళీల సంఖ్య – 5.** పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- అభ్యర్థులు 1995, జనవరి 2 నుంచి 2000, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి.
- కమర్షియల్ పైలట్ లైసెన్స్ కలిగి ఉన్న అభ్యర్థులు 1994, జనవరి 2 నుంచి 2000, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి. వీరు పైలట్ ఎంట్రీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **శారీరక ప్రమాణాలు:** పైలట్/అబ్జర్వర్ పోస్టులకు కనీసం 162.5 సెం.మీ. ఎత్తు ఉండాలి. ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి. నిర్దిష్ట కంటిచూపు కలిగి ఉండాలి.
- **ఏటీసీ:** నిర్దిష్ట కంటిచూపుతోపాటు పురుషులు 157 సెం.మీ, మహిళలు 152 సెం.మీ. ఎత్తు కలిగి ఉండాలి. ఎత్తుకుతగ్గ బరువు ఉండాలి.
- **పేస్కేల్, పదోన్నతులు:** సబ్ లెఫ్టినెంట్ హోదాలో ఉద్యోగావకాశం కల్పిస్తారు. పే మ్యాట్రిక్స్‌లో లెవల్ 10 కింద ఎంఎస్‌పీ రూ.15,500/– జీతం ఇస్తారు.



- సబ్ లెఫ్టినెంట్ నుంచి కమాండర్ స్థాయి వరకు పదోన్నతి పొందవచ్చు.
- **ఎంపిక:** దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులను అకడమిక్ మార్కుల ఆధారంగా నేవీ షార్ట్‌లిస్ట్ చేస్తుంది. తర్వాత ఎస్ఎస్‌బీ నిర్వహించే ఇంటర్వ్యూ/టెస్ట్‌ల ద్వారా ఎంపిక చేస్తారు.
- మే 18 – జూలై 18 మధ్య పైలట్/అబ్జర్వర్ పోస్టులకు బెంగళూరులో. ఏటీసీ ఇంటర్వ్యూలను బెంగళూరు, భోపాల్, విశాఖపట్నం, కోయంబత్తూరులో నిర్వహిస్తారు.
- ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు ఐదురోజులపాటు నిర్వహిస్తారు. స్టేజ్ – 1 ఒక్కరోజు, స్టేజ్ – 2 నాలుగు రోజులపాటు ఉంటాయి.
- **శిక్షణ:** 2018, డిసెంబర్ చివరివారంలో శిక్షణ ప్రారంభమవుతుంది. 22 వారాల శిక్షణ ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 4
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

విద్య, ఉద్యోగ సమాచారం

ప్రాజెక్ట్ సైంటిస్టులు

చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోస్టల్ అండ్ మెరైన్ ఏరియా మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టరేట్ (ఐసీఎంఏఎం - పీడీ)లో ప్రాజెక్ట్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఐసీఎంఏఎం - పీడీ అనేది ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వశాఖ పరిధిలోని సంస్థ.

- పోస్టులు – ఖాళీలు – జీతం (కన్సాలిడేటెడ్)
- ప్రాజెక్ట్ సైంటిస్ట్ డీ – 1 ఖాళీ. **జీతం:** రూ. 50,000/–
- ప్రాజెక్ట్ సైంటిస్ట్ సీ – 17 ఖాళీలు. **జీతం:** రూ. 46,000/–
- ప్రాజెక్ట్ సైంటిస్ట్ బీ – 33 ఖాళీలు. **జీతం:** రూ. 43,000/–
- టెక్నికల్ అసిస్టెంట్ – 3 ఖాళీలు. **జీతం:** రూ. 27,000/–
- ఫీల్డ్ అసిస్టెంట్ – 8 ఖాళీలు. **జీతం:** రూ. 25,000/–



- మొత్తం ఖాళీల సంఖ్య – 62.
- **నోట్:** పై ఖాళీలను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 21
- **హార్డ్‌కాపీని పంపడానికి చివరితేదీ:** మార్చి 28
- **వెబ్‌సైట్:** www.icmam.gov.in

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఎన్ఐఆర్‌డీపీఆర్ భారత ప్రభుత్వ రంగ సంస్థ. ఇది గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలో పనిచేస్తుంది.

- డీడీయూ–జీకేవై ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ పోస్టులను భర్తీ చేస్తున్నారు.

పోస్టులు – ఖాళీల వివరాలు..

- పీఎంఏ హెడ్ – 1, థిమాటిక్ ఎక్స్‌పర్ట్ (స్ట్రాటజీ డెవలపర్స్ –1, సోషల్ బ్రాండ్ మేనేజ్‌మెంట్ – 1, ఐఈసీ అండ్ ఐసీటీ –1,
- కెపాసిటీ బిల్డింగ్ – 1, రిసెర్చ్ అండ్ పాలసీ – 1, ఫైనాన్స్ – 1, డిప్యూటీ పీఎంఏ హెడ్ – 1, స్టాండర్డ్స్ అండ్ క్వాలిటీ – 1, ప్రొక్యూర్‌మెంట్ – 1, డాటా అనాలసిస్ – 1, అసెస్‌మెంట్ అండ్ సర్టిఫికేషన్ –1, ఎంఐఎస్ – 1 ఖాళీ ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 6
- **వెబ్‌సైట్:** www.nird.org.in

ఓఎంపీఎల్‌లో అప్రెంటిస్ ట్రెయినీలు



ఓఎన్‌జీసీ మంగళూరు పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఓఎంపీఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న గ్రాడ్యుయేట్/ టెక్నీషియన్ అప్రెంటిస్ ట్రెయినీ పోస్టుల భర్తీకి అర్హులైన ఇంజినీరింగ్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.


వివరాలు:

మంగళూరు రిఫైనరీ & పెట్రోకెమికల్స్ లిమిటెడ్ అనేది మినీరత్న హోదా కలిగి ఉన్నది. దీన్ని ఓఎన్‌జీసీ అనుబంధంగా 1988లో ఏర్పాటుచేశారు.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 17
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రెయినీ–12
- **విభాగాలవారీగా ఖాళీలు:** కెమికల్–4, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్–4, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్–1, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్–1, మెకానికల్–2
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- టెక్నీషియన్ అప్రెంటిస్ ట్రెయినీ–5
- **అర్హత:** సంబంధిత విభాగంలో మూడేండ్ల డిప్లొమా లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **స్టయిఫండ్:** గ్రాడ్యుయేట్‌కు రూ. 4,984/–, టెక్నీషియన్‌కు రూ. 3,542/–
- **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 1
- **వెబ్‌సైట్:** www.ompl.co.in

టెక్నికల్ ఆఫీసర్లు

చెన్నైలోని సీఎస్ఐఆర్ - స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ రిసెర్చ్ సెంటర్ టెక్నికల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.



కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలోని ఎస్ఈఆర్‌సీలో కింది ఖాళీలు ఉన్నాయి.


- టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ ఎఫ్ఎఫ్ఎల్)–1
- టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ ఎస్ఎంఎస్ఎల్)–1
- సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఎంఎల్)–1
- సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ (బీకేఎండీ)–1
- సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ (ఏసీటీఈఎల్)–1
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 9
- **వెబ్‌సైట్:** www.serc.res.in

పీహెచ్‌డీ, పీజీ కోర్సులు

రాంచీలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకియాట్రి (సీఐపీ)లో పీహెచ్‌డీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

- సీఐపీ భారత ప్రభుత్వ పరిధిలో పనిచేస్తుంది.
- పీహెచ్‌డీ (క్లినికల్ సైకాలజీ) – 4 సీట్లు
- **కోర్సు కాలవ్యవధి:** రెండేండ్లు
- **అర్హతలు:** ఎంఫిల్ (మెడికల్ & సోషల్ సైకాలజీ, క్లినికల్ సైకాలజీ)
- ఎంఫిల్ (క్లినికల్ సైకాలజీ) – 12 సీట్లు.
- **అర్హతలు:** ఎంఏ/ఎమ్మెస్సీ సైకాలజీ (రెగ్యులర్ విధానంలో)లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత.



- ఎంఫిల్ (సైక్రియాట్రిక్ సోషల్ వర్క్ – 12 సీట్లు, డిప్లొమా ఇన్ సైక్రియాట్రిక్ నర్సింగ్ – 15 సీట్లు ఉన్నాయి.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** www.cipranchi.nic.in

ఐసీఎంఆర్ - ఎన్ఐటీఎంలో

ఐసీఎంఆర్ - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రెడిషనల్ మెడిసిన్‌లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఐసీఎంఆర్ - ఎన్ఐటీఎం బెల్గావిలో ఉంది. గతంలో ఈ సంస్థను రీజినల్ మెడికల్ రిసెర్చ్ సెంటర్‌గా వ్యవహరించేవారు.

- లోయర్ డివిజన్ క్లర్క్ – 1 (ఓబీసీ)
- **పేస్కేల్:** రూ. 5,200 – 20,200 + గ్రేడ్ పే రూ. 1,900/–
- ల్యాబ్ అటెండెంట్ – 1 (జనరల్)
- **పేస్కేల్:** రూ. 5,200 – 20,200 + గ్రేడ్ పే రూ. 1,800/–
- **నోట్:** ఈ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీచేస్తారు. తర్వాత కూడా కొనసాగించే అవకాశం ఉంది.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** మార్చి 23
- **వెబ్‌సైట్:** www.icmr.nic.in

